
బంజారాల వివాహ ఆచార పద్ధతులు



డా॥ అజ్మీర సిల్మానాయక్

ఆంధ్ర సారస్వత పరిషత్తు
హైదరాబాద్

బంజారాల
వివాహ ఆచార పద్ధతులు

ప్రధాన సంపాదకులు

జ్ఞానపీఠ పురస్కార గ్రహీత, పద్మభూషణ్

డా. సి. నారాయణ రెడ్డి

అధ్యక్షులు. ఆంధ్ర సారస్వత పరిషత్తు

సంపాదకులు

డా. జె. చెన్నయ్య

ప్రధాన కార్యదర్శి, ఆంధ్ర సారస్వత పరిషత్తు

గ్రంథకర్త

డా॥ అజ్మీర సిల్యానాయక్

ఆంధ్ర సారస్వత పరిషత్తు

హైదరాబాద్

2

BANJĀRĀLA VIVAHA
ACHĀRA PADDHATULU

By
Dr. Azmeera Silma Naik

First Published : March 2015

Pages : 132

Copies : 500

Price : 60/-

For copies :
Andhra Saraswatha Parishath
Tilak Road, Abids,
Hyderabad - 500001.
Ph : 040-24753724

Composed : Sneha

Printed at
Sailikhitha Printers
Khairatabad, Hyderabad.
Ph : 040-65 545 979

జ్ఞానపీఠ అవార్డు గ్రహీత
డాక్టర్ సి. నారాయణరెడ్డి ఎక్స్ ఎం.పి.
ఎం.ఏ., పిహెచ్.డి., డి.లిట్.
అధ్యక్షులు
ఆంధ్ర సారస్వత పరిషత్తు
తిలక్ రోడ్,
హైదరాబాదు-500001.
ఫోన్ : (ఆ) 24753724

Jnanpith Awardee
Dr. C. Narayana Reddy Ex. M.P.
M.A., Ph.D., D.Litt.
PRESIDENT
Andhra Saraswatha Parishath
Tilak Road,
Hyderabad - 500 001.
Phone : (Off.) 24753724

అవతారిక

నిజాం పాలనలో తెలుగు భాషాదీపం కొడిగట్టిన కాలంలో దాని పునరుద్దీపనానికి ఉద్యమించిన మాతృసంస్థ ఆంధ్ర సారస్వత పరిషత్తు. శ్రీ సురవరం ప్రతాపరెడ్డి, శ్రీ మాడపాటి హనుమంతరావు, శ్రీ కాళోజి నారాయణరావు, శ్రీ బూర్గుల రామకృష్ణారావు, శ్రీ లోకనంది శంకర నారాయణ రావు, శ్రీ గడియారం రామకృష్ణశర్మ వంటి సాహితీమూర్తుల ప్రేరణతో పరిషత్తు 1943 మే 26 న రూపుదిద్దుకుని ఈ రోజు తెలంగాణలో అగ్రేసర సాహితీ సంస్థగా విశిష్టస్థానం వహించింది. మాన్యమిత్రులు డా॥దేవులపల్లి రామానుజరావు గారు యావజ్జీవం పరిషత్తు అభివృద్ధికి శ్రమించినారు. పరిషత్తు బహుముఖీన కార్యక్రమాలు చేపట్టి సమర్థంగా నిర్వహిస్తూ అందరి ప్రశంసలందుకుంటున్నది. పరిషత్తు ప్రాథమిక, ప్రవేశ, విశారద తెలుగు పరీక్షలు జరపడంతో పాటు, తెలుగు పండిత శిక్షణ కళాశాలను, ప్రాచ్య కళాశాలను నిర్వహిస్తున్నది. పరిషత్తు ఏర్పాటు చేసే సాహితీ సభలు, సమావేశాలు, ప్రసంగాలు, సదస్సులు, ఉత్సవాలు, చర్చాగోష్ఠులు, పరిణతవాణి ప్రసంగాలు, ప్రసంగాత్మక ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు మొదలైనవి తెలంగాణ వైశిష్ట్యానికి అద్దం పడుతున్నవి. పరిషత్తు ప్రచురించే గ్రంథాలను సాహితీలోకం అభిమానించి స్వాగతిస్తున్నది. ఇంతవరకు దాదాపు 300 గ్రంథాలను వెలవరించింది.

2013 లో పరిషత్తు సప్తతి మహోత్సవాలను ఘనంగా నిర్వహించింది. తెలంగాణ ప్రత్యేకతలోని వివిధ పార్శ్వాలను ఆవిష్కరించే సదస్సులు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటయ్యాయి. నిపుణుల ప్రసంగ వ్యాసాలను "వ్యాసగుళుచ్ఛం" పేరుతో పరిషత్తు రెండు భాగాలు వెలువరించింది. వివిధ రంగాలలో తెలంగాణ వైశిష్ట్యాన్ని విశదీకరించే "తెలంగాణలో తెలుగు సాహిత్య వికాసం" పై సదస్సు వంటి కార్యక్రమాలను పరిషత్తు ఏర్పాటు చేసింది.

తెలంగాణ ప్రజల చిరకాల స్వప్నం సాకారమై 2014 జూన్ 2 వ తేదీన ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించింది. తెలంగాణను సర్వతోముఖంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం, సంస్థలు, ప్రజలు ఉద్యమస్ఫూర్తితో కృషి చేయడం హర్షణీయం. తెలంగాణ భాషా సాహిత్య కళా సంస్కృతుల వికాసాభ్యుదయాల కోసం ఏడు దశాబ్దాలకు పైగా అంకితభావంతో ముందుకు సాగుతున్న ఆంధ్ర సారస్వత పరిషత్తు బంగారు తెలంగాణ నిర్మాణంలో తన వంతు పాత్రలో భాగంగా విశిష్ట కార్యక్రమాలకు రూపకల్పన చేసి నిర్వహిస్తున్నది. వాటిలో కొన్ని- తెలంగాణ మాండలిక పదాలు – ప్రయోగ వైశిష్ట్యం, తెలంగాణ ప్రాచీన తెలుగు కవుల కవితా ప్రాభవం, తెలంగాణ చిత్రకళ, శిల్పకళల వైభవం, తెలంగాణ గిరిజన భాషా సాహిత్యాలపై సదస్సు, తెలంగాణ కవయిత్రుల, కథయిత్రుల రాష్ట్రస్థాయి సమ్మేళనం.

తెలంగాణ వైభవోన్నతిపై గ్రంథప్రచురణను పరిషత్తు చేపట్టింది. ఈ పరంపరలో ప్రస్తుత గ్రంథం ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి ఎం.ఫిల్. పట్టా పొందిన బంజారాల వివాహ ఆచార పద్ధతులు. కర్త ఆంధ్ర సారస్వత పరిషత్తు ప్రాచ్య కళాశాల ప్రధానాచార్యులు డా॥ ఎ.సిల్మానాయక్. ఆయన బంజారా తెగకు చెందిన విద్యాధికుడు కావడం వల్ల గ్రంథం మరింత ప్రామాణ్యాన్ని సంతరించుకున్నది. చాలా తాండాలు సందర్శించి డా॥ఎ.సిల్మానాయక్ వివరాలు సేకరించి రచించిన పరిశోధన గ్రంథమిది. బంజారాల పూర్వోత్తరాలు సంస్కృతి, సంప్రదాయాలు, వివాహ వ్యవస్థలోని ఆచారాలు పద్ధతులు మొదలైన అంశాలను రచయిత దీనిలో విశదీకరించినారు. 45 బంజారా వివాహ గేయాలను సందర్భం, భావం వివరిస్తూ జతపరచడం విశేషం. తెలంగాణ గిరిజనుల్లో అధిక సంఖ్యాకులైన బంజారాల వివాహ వ్యవస్థపైన విలువైన సమాచారాన్ని విశ్లేషణాత్మకంగా అందించిన డా॥ఎ.సిల్మానాయక్ కు నా హార్దికాభినందనలు.

పరిషత్తు వెలువరిస్తున్న ఈ గ్రంథం ఎప్పటిలాగా అందరి మన్ననలను పొందగలదని విశ్వసిస్తున్నాను.

హైదరాబాదు, — (డా.సి.నారాయణ రెడ్డి)

తేది :17-03-2015. — అధ్యక్షులు, ఆంధ్ర సారస్వత పరిషత్తు

డా॥ జె. చెన్నయ్య
ప్రధాన కార్యదర్శి
ఆంధ్ర సారస్వత పరిషత్తు

తిలక్ రోడ్,
హైదరాబాదు-500001.
ఫోన్ : 040-24753724

ప్రవేశిక

ఆంధ్ర సారస్వత పరిషత్తు నిర్వహిస్తున్న విభిన్నమైన కార్యక్రమాల్లో పుస్తక ప్రచురణ విశిష్టమైంది. పరిషత్తు ప్రచురించిన గ్రంథాల పట్టికను చూస్తే ఎంత గొప్పవైన ప్రచురణలు వచ్చాయో తెలుస్తుంది. పరిషత్తు ఆధ్వర్యంలో తెలుగు పరీక్షల నిర్వహణ, భాషా సాహిత్య సాంస్కృతిక వికాసానికి దోహదం చేసే సదస్సుల నిర్వహణ, పెద్దల పేరిట నిర్వహించే సంస్మరణ ప్రసంగాలు, పరిణతవాణి ప్రసంగ పరంపర కొనసాగుతూ అనుబంధంగా పుస్తక ప్రచురణ జరుగుతున్నది. 2013 సంవత్సరంలో పరిషత్తు అధ్యక్షులు డా. సి.నారాయణరెడ్డి నేతృత్వంలో సప్తతి పూర్తి సందర్భంగా ఏడాది పొడవునా అనేకమైన ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరిగింది. 'తెలంగాణ తెలుగు సాహిత్య వికాసం', 'తెలంగాణ ప్రాచీన కవుల కవితా ప్రాభవం', 'తెలంగాణ మాండలిక పదాలు-ప్రయోగ రీతులు', 'తెలంగాణ ప్రాచీన నృత్య రీతులు', 'తెలంగాణ గిరిజన భాషా సాహిత్యాలు', 'తెలంగాణ కవయిత్రులు, కథయిత్రుల సమ్మేళనం' వంటి అనేక సదస్సులు, ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించడం జరిగింది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఆవిర్భవించిన తరుణంలో తెలంగాణలో సాహిత్య చైతన్యాన్ని పెంపొందించే కృషిలో భాగంగా ఈ కార్యక్రమాలు నిర్వహించాలని పరిషత్తు భావించింది. నవ్య స్ఫూర్తితో ప్రచురణల్ని కూడా వెలువరించాలని నిర్ణయించింది. గత సంవత్సరం పరిణతవాణి ప్రసంగాలతో కూడిన తాజా సంపుటి, 'తెలంగాణ సాహిత్య వికాసం', 'వ్యాసగుళుచ్ఛం' రెండు సంపుటాలు ప్రచురించడం జరిగింది. వాటిని పాఠకులు ఆదరించారు.

తెలంగాణ ప్రత్యేకరాష్ట్రంగా ఆవిర్భవించింది. ఈ నూతన యుగోదయవేళ తెలంగాణ కు సంబంధించిన వివిధ అంశాలపై ప్రత్యేక అధ్యయనం జరగాలి.

ఆ అధ్యయనానికి కావలసిన పఠనసామాగ్రిని సమకూర్చుకోవాలి. ఇప్పటివరకు ఉమ్మడి చరిత్రలో అంతర్భాగంగా వుండి తగినంత ప్రాధాన్యం లభించలేదని ప్రజల్లో వున్న అసంతృప్తిని పోగొట్టాలి. ఆ దిశగా ఆంధ్ర సారస్వత పరిషత్తు వెలువరిస్తున్న ప్రచురణల్లో 'తెలంగాణ సాహిత్యచరిత్ర', 'తెలంగాణ ప్రాచీనకవుల కవితా ప్రాభవం', 'తెలంగాణ మాండలిక పదాలు-కావ్య ప్రయోగాలు', 'కుతుబ్‌షాహీల తెలుగు సాహిత్యసేవ', 'మాఊరు మాట్లాడింది', 'తెలంగాణ గిరిజన భాషా సాహిత్యాలు', 'సురవరం ప్రతాపరెడ్డి వ్యాసావళి', 'తెలంగాణ ప్రముఖుల పరిణతవాణి', 'బంజారాల వివాహ ఆచార పద్ధతులు', 'యాభైసంవత్సరాల జ్ఞాపకాలు', 'తెలంగాణ చరిత్ర', 'తెలుగు జానపద సాహిత్యం-స్త్రీల గేయాల్లో సంప్రదాయం' ఈ సంవత్సరం వెలువడుతున్నాయి.

ఆంధ్ర సారస్వత పరిషత్తు ప్రాచ్య కళాశాలలో ఇన్‌ఛార్జి ప్రధానాచార్యుడు డా. అజ్మీర సిల్మానాయక్ పరిశోధన గ్రంథాన్ని పుస్తకరూపంలో వెలవరించాలని పరిషత్తు నిర్ణయించింది. బంజారా వివాహ పద్ధతిని, వారి ఆచారాలను గురించి అత్యంత మౌలికమైన విశేషాలు ఈ గ్రంథంలో వున్నాయి. బంజారాల పుట్టు పూర్వోత్తరాలు, వారి జీవనం, సాంస్కృతిక విశేషాలను ఈ గ్రంథం విశదపరుస్తుంది.

ప్రచురణల పరిశీలక సంఘం సభ్యులుగా తమ పూర్తి సహకారాన్ని అందించిన ఆచార్య ఎస్వీ రామారావు, డా. తిరుమల శ్రీనివాసాచార్య, డా. డి. చంద్రశేఖర్ రెడ్డి గార్లకు కృతజ్ఞతలు.

(డా॥ జె. చెన్నయ్య)
ప్రధాన కార్యదర్శి
ఆంధ్ర సారస్వత పరిషత్తు

హైదరాబాదు
తేది : 27-03-2015

ఇందులో .....

ఉపోద్ఘాతం 9

1. బంజారాల పుట్టు పూర్వోత్తరాలు 19

2. బంజారాల సమాజం-సంస్కృతి 33

3. బంజారాల వివాహ ఆచారాలు పద్ధతులు 44

4. బంజారాల వివాహ ఆచార గేయాలు 73

ముగింపు 115

ఉపయుక్త గ్రంథసూచి 124

ఉపోద్ఘాతం

వివాహ వ్యవస్థ మనిషి సమష్టి జీవితానికి పునాదిగా ఉంది. ముఖ్యంగా మానవ జీవన క్రమ సరళికి అనువైనది వివాహమేనని సాహిత్యంలో ఎన్నో ఆధారాలున్నాయి.

హిందూ మతంలో ఋణత్రయాసాకరణాది ధర్మ సముపార్జనమే వివాహం పరమావధిగా భావిస్తారు. వ్యక్తి ఈ సంఘంలో తీర్చవలసిన ఋణాలు, ఋషి ఋణం, దేవ ఋణం, పితృ ఋణం. ఋషి ఋణాన్ని వేదాధ్యయనం వలన దేవ ఋణాన్ని యజ్ఞాచరణం వలన పితృ ఋణాన్ని సంతానోత్పత్తి వలన తీర్చుకుంటాడని హిందూ మతం ప్రమాణీకరిస్తోంది.

"క్రియాణాం ఖలు ధర్మాణాయుసత్పత్నో మూల కారణం" అని మంత్రాలు, వివాహ ఉద్ధేశాన్ని స్పష్టం చేస్తున్నాయి (కుమార సంభవం, షష్ఠ సర్గ శ్లోకము) అని అంటాడు కాళిదాసు. ధర్మేచ, అర్థేచ, కామేచ, మోక్షేచ, నాతి చరామి అని మంత్రాలు వివాహోద్దేశాన్ని స్పష్టం చేస్తున్నాయి.

హిందూ మతం వివాహాన్ని ఇహపర సాధనంగా మాత్రమే పరిగణిస్తోంది. శారీరక సుఖాన్ని తుచ్ఛంగా భావిస్తుండడం వలన స్త్రీ పురుషుల నడుమ అనుభూతులకు ప్రాముఖ్యత లోపించి యాంత్రికత చోటు చేసుకుంది. అయితే ఈ మధ్య కాలంలో వస్తున్న మార్పు వివాహంపై ఉన్న పూర్వ అభిప్రాయాన్ని కొంత మేర తుడిచి వేసిందనవచ్చు.

హిందూ మతంలో గృహ్య సూత్రాల ప్రకారం

1. బ్రాహ్మ వివాహం	4. ప్రాజాపత్య వివాహం	7. రాక్షస వివాహం
2. దైవ వివాహం	5. ఆసుర వివాహం	8. పైశాచిక వివాహం
3. ఆర్ష వివాహం	6. గాంధర్వ వివాహం.	

అనే అష్టవిధ వివాహ పద్ధతి ఏర్పడింది. అయితే పైన పేర్కొన్న, ఎనిమిదింటిలో, బ్రాహ్మ, దైవ, ఆర్ష, ప్రాజాపత్య వివాహలు నాలుగు శ్రేష్ఠమైనవనే భావన బలపడింది. దీనికి కారణం వరుడికి కన్యను తల్లిదండ్రులు దానం చేయడం పైన పేర్కొన్న వివాహాలలో ఉంది. ఋగ్వేద కాలంలో కన్న, అధర్వణ వేద కాలంలో బ్రాహ్మ వివాహ పద్ధతి ప్రారంభమైనది.

బ్రాహ్మణాల కాలంలో వివాహ వ్యవస్థ, రాక్షస, స్వయంవర, ప్రాజాపత్య వివాహాలతో పాటు బ్రాహ్మ వివాహం కూడా ప్రాముఖ్యతను సంతరించుకుంది. ఈ బ్రాహ్మ వివాహంలో కన్యనలంకరించి వేదాధ్యయన శీలుడైన సద్బ్రహ్మచారితో వివాహం జరిపించడం ప్రధానాంశముగా ఉన్నప్పటికినీ, కన్యా దానంతోపాటు దక్షిణ లేనిదే దానికి ప్రయోజనం లేదనే మిషతో... వరదక్షిణ పెట్టడం తప్పనిసరి అయింది. కన్యను ఆభరణాలతో అలంకరించి సాలంకృత కన్యాదానం చేయడం ఆచారమయ్యింది".

1. "సాలంకృత కన్యాదానం సద్గుణ్యార్థం మనోసోతాసహ సంకల్పిత దక్షిణాం తుభ్యమహం సంప్రదదేనమమ" (ఐతరేయ బ్రాహ్మణంలో-3-1-11)

2. "రూపం హిరణ్యం పశవో వివాహ" అని పేర్కొనబడింది. అర్థం గ్రహిస్తే. బంగారము రూపము నిచ్చును. వివాహము పశువులనిచ్చును, అని బోధపడుతుంది. ఋగ్వేదములో "రయించ పుత్రాగ్ంశ్చాగా దగ్నిర్మహ్యమథో ఇమాం" (ఋగ్వేద సంహారం -10-85-4).

పై మంత్రార్థం పరిశీలిస్తే అగ్ని కన్యను, ధనమును, సంతానమును ఇచ్చెను అని తెలుస్తుంది. ఈ మంత్రార్థాలను పరిశీలిస్తే వరునికి పశువులు, ధనం వివాహం ద్వారా వచ్చేస్తాయనే విషయం స్పష్టమవుతుంది. స్మృతుల

కాలంలో అష్ట విధ వివాహాలు వ్యాప్తిలో ఉన్నాయని తెలుస్తుంది. ముఖ్యంగా బ్రాహ్మ వివాహం వలన పన్నెండు తరాలు తరిస్తాయి అని అంటాడు ఆశ్వలాయనుడు.

"కన్యాం కనక సంపన్నాం కనకా భరణ భూషితాం దాస్యామి విష్ణ వేతుభ్యం బ్రహ్మలోక జీగీషయా"కన్యాదానం (కులపతి ఎక్కిరాల కృష్ణమాచార్య-కళ్యాణ సంస్కృతి -పుట. 58, 59)

"అష్టవిధ వివాహాలు :

1) **బ్రాహ్మవివాహం:** వేదాధ్యయన శీలుడైన సద్బ్రహ్మచారిని ఆహ్వానించి సాలంకృత కన్యాదానం చేయడం.

2) **దైవ వివాహం :** జ్యోతిష్టోమాది. యజ్ఞాలలో అధ్వర్యం చేసే ఋత్వికుడికి సాలంకృత కన్యాదానం చేయడం.

3) **ఆర్ష వివాహం :** యాగాల సిద్ధి కోసంగాని లేదా కన్యకు ప్రతి ఫలంగా కాని గోమిథునాన్నో, రెండు వృషభాలనో వరుడి నుండి తీసుకొని శాస్త్ర ప్రకారం వరునకు కన్యను ఇవ్వడం.(కన్యాశుల్కానికి నాంది)

4) **ప్రాజాపత్య వివాహం :** మీరిద్దరూ కలిసి ధర్మాన్ని ఆచరించండి అని కన్య తల్లిదండ్రులు వరుని పూజించి పెళ్ళి చేయడం పిల్లనీయడం.

5) **ఆసుర వివాహం :** జ్ఞాతులకు కన్య కోరిన ధనాన్ని ఇచ్చి వివాహము చేసుకోవడం.

6) **గాంధర్వ వివాహం :** స్త్రీ పురుషులు పరస్పరం ప్రేమించుకుని రహస్యంగా తమకు తామే వివాహం చేసుకోవడం.(ప్రస్తుత ప్రేమ వివాహం)

7) **రాక్షస వివాహం :** కన్య బంధువులు సమ్మతించనప్పుడు వారిని నాశనం చేసి ఏడుస్తున్న కన్యను బలాత్కారంగా తెచ్చుకోవడం.

8) **పైశాచిక వివాహం :** నిద్రిస్తున్న కన్యను కాని, మైకంలో ఉన్న దానిని కాని, మతి లేని దానిని కాని బలాత్కరంగా అనుభవించడం.

ఆర్య వివాహంలో ప్రధాన విధులు

1. హోమము
2. పాణిగ్రహణము
3. లాజ హోమము
4. అశ్వారోహణము
5. అగ్ని ప్రదక్షిణము
6. సప్తపది.

హిందూవివాహాలలో శరీరాకర్షణలకు ప్రాధాన్యం లేదు. నేను పురుషుడను, నీవు స్త్రీవి నేను దివిని, నీవు భువివి. నేను సామము, నీవు ఋక్కువు.

ఓ దేవతలారా ఐక్యభావనతో ఏ దంపతులు పవిత్రాత్ములై మిమ్మల్ని అర్చిస్తారో వాళ్ళకు శుభం కలుగుగాక. (ఆనంద లక్ష్మి సి. – తెలుగు నవలలో కుటంబ జీవన చిత్రణము పుట – 14; ఋగ్వేదము–VIII పుట 31, 5-6 శ్లోకాల అర్థం).

సప్తపది అర్థము (ఏడు అడుగులు)

భగవానుడైన విష్ణువు నీ మొదటి పాదంతో గ్రాసాభివృద్ధిని కలిగించుగాక.

రెండవ పాదంతో వ్రత సంపన్నతను సమకూర్చాలి.

మూడో పాదంతో వ్రత సాఫల్యాన్ని అనుగ్రహించాలి.

నాల్గవ పాదంతో స్నేహ సౌభాగ్యాలను ప్రసాదించాలి.

ఐదవ పాదంతో పశు సంపదను వర్ధిల్లచేయాలి.

ఆరవ పాదంతో సప్త పురోహితులను ప్రీతి పొందించాలి.

ఏడడుగులు నడిచి నాకు స్నేహితురాలివయ్యావు. నీ స్నేహ సౌభాగ్యాన్ని అనుభవించనివ్వు.

అరుంధతి నక్షత్రము

ఆకాశంలో అరుంధతి స్థిరంగా ప్రకాశిస్తునట్లే వధువు భర్త గృహంలో స్థిరంగా ఉండాలని కోరుతూ చేసే ప్రార్థనే అరుంధతీ దర్శనం. (తెలుగు నవలలో కుటుంబ జీనవ చిత్రణము – ఆనంద లక్ష్మి సి. – పుట 13)

మంత్ర బ్రాహ్మణంలోని మంత్రార్థం ఆకాశం అచంచలం. ఈ విశ్వమంతా సుస్థిరం. గిరులు గిరిదాటవు. ఈ వధువు తన వల్లభుని వంశంలో స్థిరంగా నిలుస్తుంది.

నీ హృదయంలో ఏముందో అదే నా హృదయంలోనూ ఉండాలి. నా హృదయంలో ఏముందో అదే నీ హృదయంలో ఉండాలి. *(Women in vedic age-Shakuntala Rao)* సగోత్రికులను వివాహమాడరాదని గృహ్యాసూత్రాలలో ఉంది.

1. హిందూవుల సంస్కారాలన్నింటిలోకి, వివాహానికి అత్యధిక ప్రాధాన్యత ఆది నుండి కన్పిస్తుంది.
2. సమస్త గృహ యజ్ఞాలకు వివాహమే ఉత్తమ స్థానంగా పరిగణింపబడింది.
3. వేద కాలానికి పూర్వమే వైవాహిక విధులు, ఆచారాలు ప్రచారంలో ఉన్నట్లు తెలుస్తుంది.
4. ఋగ్వేదంలో వివాహ సూక్తం అనే పేరుతో పదవ మండలంలో 85వ సూక్తం ఒకటి వుంది.
5. ధార్మికత అనేది వివాహనికి ఉన్న గొప్పతనానికి ప్రతీక.
6. వివాహ ప్రస్తావన మహా భారతం శాంతి పర్వంలో ఇలా విశ్లేషించింది.

   "నగృహం గృహ మిత్యాహు: గృహిణీ గృహ ముచ్యతే
   గృహంతు గృహిణీహీనమ. అరణ్య సదృశ్యం మతం."

7. శతపదబ్రాహ్మణం 5-2-10లో "అర్థోహ నాయేష ఆత్మనో యజ్ఞాయా తస్ మార్య వజ్జాయం ననిందతేనైవ తావత్ప్రాజావతే అసర్వోహితావత్ భవితి అథయదైవ జాయాం విందతేన ధప్రజాయతేహీ సర్వోభవతి."(భార్య భర్త యొక్క ఆత్మకు అర్థాంశము. కాబట్టి పురుషుడు భార్యను పొందేవరకు అసంపూర్ణుడుగానే ఉంటాడు. వివాహం చేసుకొని సంతాన పరంపరను అవిచిన్నంగా, నిరంతరాయంగా ఉంచడం ద్వారా పరిపూర్ణుడవుతాడు)

8. *Dr. Vestor Mark* అనే సామాజిక శాస్త్ర, చారిత్రక పరిశోధకుని మాటల్లో *"Marriage is a relation of one or more men to one or more Women that is recognised by custom or law" (Future of Marriage in westran civilisation page No. 3. Ascitd by Mrs. Shakuntala Rao in Women in Vedic Age, Chapter-VIII page - 143).*

ప్రకృతిలో ఒక రహస్యముంది. తన చెట్లూ చేమలూ, పురుగులూ, మృగాలు, మనుష్యులూ అన్ని జాతులూ నశించకుండా వుండాలి. ఆ జాతులు, అలా పారంపర్యాభివృద్ధి పొందుతూ ఎడ తెరపి లేకుండా వుండాలి. అదే ప్రకృతిలోని ఆత్మ సంరక్షణ లేక జాతి సంరక్షణ అంటారు. ఈ గుణాలు ప్రకృతిలో ఉండడం చేతనే పెళ్ళి అన్నది వచ్చిందంటారు. కాబట్టి స్త్రీ పురుషులకు సంబంధం ప్రకృతిలోనే ఉంది. దానిని పెళ్ళి తెచ్చిపెట్టలేదు. పెళ్ళి అన్నది లేకపోయినా, ఈ సంబంధం ఉంటుంది. ప్రపంచం సాగుతుంది. అంటే ప్రకృతి జీవనానికి పెళ్ళి అన్నది కేవలం అప్రధానం. జాతి రక్షణకు పెళ్ళి ఉన్నా ఒక్కటే, లేకపోయినా ఒకటే సృష్టికి ఎలాంటి నష్టం లేదు.

మొదట ఇండియాలో ఉన్నట్టే, హీబ్రూలలో కూడా ఒక ఆచారం ఉండేది. కొడుకులు లేకుండా అన్న చచ్చిపోతే, తమ్ముడు ఆ అన్న భార్యతో జతకట్టి ఆ అన్నకు పుత్రుడిని కలిగించాలి. లేకుంటే ఆ అన్నకు గతులుండవు. ఈ సంగతి ఓల్డు టెస్ట్‌మెంటును బట్టి తెలుస్తుంది.

అప్పటి ఆచారం ప్రకారం అన్న భార్యను తమ్ముడు చేసుకోవచ్చు. రామాయణంలో వాలి సుగ్రీవులు చేసిన పని ఇదే. తార ఇద్దరికీ భార్యయే. ఇలా అన్న భార్యలను చేసుకొనే ఆచారాలు చాల ఉన్నాయి. మహా భారతంలో కూడ ద్రౌపది పంచపాండవులు అందరు ఒకరి తర్వాత ఒకరు ఒక్కోక్కసంవత్సరం చొప్పున సంసారం చేశారు. ఇలా అన్న భార్యను తమ్ముడు, తమ్ముడి భార్యను అన్నలు చేసుకునే ఆచారం అనాది కాలం నుండి ఉంది. అదే సంప్రదాయం గిరిజనులలోను ఉన్నది.

పెళ్ళంటే సందడి. పెళ్ళంటే సంతోషం. ఒక మగవాడు ఒక స్త్రీతో జరిగే కొత్తతంతు, వేడుక. పెళ్ళంటే తెలియని వారు ఎవరు ఉండరు. అయినా పెళ్ళి సంగతి తెలిసినవారు చాల తక్కువ అని అంటే వింతగా ఉంటుంది. కాని సృష్టి ఆరంభం నుండి ఇప్పటి వరకు కోట్లాను కోట్ల పెళ్ళిళ్ళు జరిగినాయి. దేవతల పెళ్ళిళ్ళ సంగతి అటుంచిన ఇప్పటికి ప్రతి రోజు వందలు, వేల పెళ్ళిళ్ళు ప్రపంచమంతటా జరుగుతున్నాయి. పెళ్ళి చేసుకొని వియోగంలో పడ్డవారు, మళ్ళీ పెళ్ళిళ్ళకు తలపడుతున్నారు. చూడ చూడగా ఈ ప్రపంచం అంతా పెళ్ళి కోసమే బ్రతుకుతున్నట్లుంది.

పెళ్ళికి కారణం ఉపయోగమే. సహాయం కోసం పని పాటలు చేసుకోవడంలో తోడ్పడటానికి చేసుకున్న ఒక ఏర్పాటు. ఈ పెళ్ళి జంటలు ఒకరు పొలం పని చేస్తుంటారు. ఒకరు ఇంటి పని చేస్తుంటారు. ఒకరు కట్టెలకు పోతే, ఒకరు నీళ్ళకు పోతారు. సహకారం కావలసివచ్చినప్పుడే, ఒక వ్యక్తి మొత్తం పని చూసుకోవటానికి వీలులేనప్పుడే ఈ పెళ్ళి తోడు కోసం చూస్తారు.

పెళ్ళి అనేది ఒకరికొకరు సహాయం చేసుకొని ఇల్లు నడుపుకోవడానికి ఒక ఏర్పాటు. ఇద్దరు ఆడవాళ్ళు ఇలాంటి ఏర్పాటు చేసుకోవచ్చు. ఇద్దరు మగవాళ్ళు కలిసి ఇలాంటి ఏర్పాటు చేసుకోవచ్చు, కాని అటువంటి జంటలది పెళ్ళి అనం. ఒక మగవాడు ఆడది కలిసి ఈ ఏర్పాటుకి దిగాలి. అప్పుడే దానిని పెళ్ళి అని అంటాం. దానితో పిల్లలు, కాపురం, కుటుంబం, మనుషులు, సమయానుకూలంగా చేసుకున్న ఏర్పాటు.

పెళ్ళికి మొదటి కారణం అవసరం. జతకట్టి కామం తీర్చుకోడానికి అవసరం కాదు. అది ఎప్పుడూ యథేచ్ఛగా వారికి లభించేదే. ఒకరు వేటాడుకొని జంతువును కొట్టుకొని వస్తే దానిని ఉడికించటానికి ఒకరు అవసరం. ఒకరు పొలం దున్నితే, ఒకరు ఇత్తు నాటే అవసరం. ఒకరు బయటికి పోతే ఒకరు ఇంట్లో ఉండే అవసరం. ఇలాంటి అవసరాలు పెళ్ళి కోసం వచ్చాయి.

మొట్టమొదటి దశలో మనుషులు కేవలం మృగప్రాయులుగా ఉండేవారు. ఆకలి వేసినప్పుడు దగ్గర ఉండే చెట్టో, చేమో పట్టుకొని తినేవారు. ఆ ప్రక్కన ఉన్న వాగులో ఇన్ని నీళ్ళు తాగేవారు. నిద్రవచ్చిందంటే ఏ బండ మీదనో చేరగిలబడేవారు. జత కట్టాలని తోచినప్పుడు అటూ ఇటూ చూచి దగ్గరలో ఉన్న ఆడదానితో జతకట్టేవారు. ఎప్పుడైనా భయం కలిగిందా ఏ గుహలోనికో దూరిపోయేవారు. అంతే కాదు, కాయ కసరూ దొరకక పోతే "చెలో" అని మరొక స్థలానకి మారిపోయేవారు. అది జట్టు పద్ధతి. ఈ పద్ధతి కూడా గిరిజనులలో ఉంది.

తర్వాత తర్వాత పచ్చిక బయళ్ళు పశువుల మందలు ఆ తర్వాత వ్యవసాయం లాంటి వాటిపై దృష్టిని కేంద్రీకరించారు. ఆ తర్వాత స్థిర నివాసాలు ఏర్పడ్డాయి. పని పాట్లకు ఒక క్రమం కలిగింది. అవన్నీ చేయక తీరని పనులే చాలా ఎక్కువగా ఉండేవి. అందుచేత ఒక వ్యక్తి చేయలేక తన తోడుకోసం వెతకడం ఆరంభించాడు. తర్వాత పెళ్ళి చేసుకున్నాడు.(పెళ్ళి దాని పుట్టు పూర్వోత్తరాలు - ధర్మారావు తాపి. పుట-1,51,55,51,61)

డబ్బు ఇచ్చి పిల్లను తెచ్చుకోవడం దాదాపు అన్ని దేశాలలోనూ అన్ని జాతులలోనూ ఉంది. సాధారణంగా ఈ ధనం పశువులు, పందులు, కుక్కలు, వీటి రూపంగానే ఉంటాయి. డబ్బు తీసుకోకుండా పిల్లను ఇచ్చినట్టయితే వంశానికంతటికి అవమానం. డబ్బు పుచ్చుకోవాలి. ఆ రోజులలో అలాగే పుచ్చుకుంటే ఇప్పుడు అవమానం అంటున్నాం. ఇప్పుడయినా కానుకలు ఎదురు కట్నాలు ఇలాంటి వన్నీ ఈ బేరానికి సంబంధించిన విషయాలే. ఎదురు కట్నాలుగా నాలుగు కోడెలను ఇచ్చే పద్ధతి పూర్వము బంజారాలలో కూడ ఉండేది.

హిందూ వివాహం లాగానే తాండా సంస్కృతిలో బంజారాల వివాహ సంప్రదాయం చాలా ముఖ్యమైనది. వీరు కొన్ని శతాబ్ధాల నుండి తమ వైవాహిక ఆచారాలను అలాగే ఆచరించుకుంటూ రావటం చేత వివాహ పద్ధతిలో ప్రత్యేకతలు కన్పిస్తాయి. పూర్వం సంచార జీవులైన బంజారాలు

సంవత్సరంలో నాలుగు లేదా ఐదు నెలలు వ్యాపారం కోసం సంచరించేవారు. ఈ కారణంగా అనేక తాండాలు నిర్ధిష్టమైన స్థలంలో స్థిరంగా ఉండేవి కావు. స్థిరంగా ఉండకపోయినా తాండా వారితో వివాహ సంబంధం ఏర్పర్చుకోవటం సంభవమైనది. వీరి పెళ్ళికి కొన్ని ప్రత్యేకతలు ఉన్నాయి. ఇవి సాధారణంగా ఈనాడు కన్పించే ఒక రోజు పెళ్ళి కాదు. పూర్వం నెలల కొద్ది ఈ సంబరం నడిచేది. ఇప్పుడు10 లేదా 5 రోజులు జరిగుతుంది. అందులో 7 రోజులు పెళ్ళియని సౌత్ దాడేర్ నొక్తా ఇందులో ముఖమైనది. మూడు రోజుల తంతు తీన్ దాడేర్ నొక్తా వీరి పెళ్లి సాధారణంగా రాత్రి 8.00 గం.లకు మొదలై తెల్లవారుజామున 3 గంటల వరకు జరిగేవి.

వీరి పెళ్ళి తంతులో ముఖ్యంగా అడుగడుగునా గేయాలు పాడుతారు. ఈ గేయాలను గమనించినట్లయితే వారి జీవితం భిన్న ఘట్టాలతో ముడిపడినదిగా అనిపిస్తుంది. వీటిలో కొన్ని నృత్య ప్రాధాన్యం కల్గినవి కొన్ని కార్యకలాపాలతో ముడిపడినవిగా గమనించవచ్చు. వారి గేయ లక్షణాలు ఈ విధంగా ఉన్నాయి.

1. తరతరాల నుండి పెద్దల నుండి పిల్లలకు వ్యాపించిన పాటలు.
2. ఆ పాట చుట్టు ఒక ప్రాచీనమైన రాచరిక వాతావరణం ఉండడం.
3. బృందగాన రూపంలో ఉండడం.
4. ఈ గేయాలను నిర్ధిష్టమైన రాగాలలో కాకుండా 3,4 స్వరాలకు మించిన పద్ధతిలో లయాత్మకంగా పాడటం.
5. పాటలలోనే భాష, భావం చాల సాధారణంగాను, అలంకార రహితంగాను ఉండటం.
6. ప్రతి పాటలోను ఆయా గాయకుల మనో భావాలను రసోస్ఫోరకంగా ప్రకటించే శక్తి ఉండటం.
7. ఈ గేయాలు వీరు సాధారణంగా ఏ వాద్యాలు లేకుండా పెళ్ళి సమయాలలో పాడుకుంటారు.

అంతే కాకుండా వీరి పెళ్ళిలో అడుగడుగునా పాట ఉంటుంది. ఒక రకంగా శిష్టుల వివాహాలలోని మంత్రాల స్థానాన్ని బంజారాల పాటలు ఆక్రమిస్తాయి. ఈ పాటల ఘోషతో పెండ్లింటిలోని వాతావరణం నాటకీయంగాను రసవత్తరంగాను మారిపోతుంది. వీరు దాంపత్య ధర్మాన్ని అతి ఉత్కృష్టమైనదని నమ్ముతారు. వారు పార్వతీ పరమేశ్వరులను, సీతారాములను ఆదర్శంగా భావిస్తారు. వరుని తల్లిదండ్రులు పిల్లనడిగి పెళ్ళి చేసుకోవలసి ఉంటుంది. ఈ సమయంలో కూడా ఒకరిపై ఒకరు పాటలు పాడుకుంటారు.

ఇటీవల వారి వివాహ వేడుకలలో కూడా మార్పు రావడం హిందూ వివాహం లాగే వీరి వివాహలు కూడా జరగడం, ఒక రోజు పెళ్ళి అయినప్పటికి సంప్రదాయంలో మాత్రం ఏడ్పు ధావళో/ఢాలో అనేది ఇప్పటికి మిగిలి ఉండడం, వీరిబలమైన సంస్కృతికి నిదర్శనం. అబ్బాయి, అమ్మాయి చదువుకున్న వివాహంలో మార్పులు వచ్చినా తాండా సంప్రదాయంలో మాత్రం నాయకణ్(నాయకుని భార్య) ద్వారా ఏడ్పు పాటను నేర్చుకోవటం జరుగుతుంది.

I. బంజారాల పుట్టు పూర్వోత్తరాలు

బంజారాల పుట్టు పూర్వోత్తరాలు - చరిత్ర

లంబాడీలు లేదా సుగాలీలు లేదా బంజారాల మూలస్థానం, పుట్టు పూర్వోత్తరాల పైన చరిత్రకారులలో భేదాభిప్రాయాలున్నాయి. వీరి పుట్టు పూర్వోత్తరాలను తెల్సుకోవాలంటే వారి వంశము, కులం, గోత్రాల గూర్చి తెల్సుకోవటం చాలా అవసరం.

"బంజారాలు రాజస్థాన్‌లోని రాజపుత్ర వంశానికి చెందిన గూర్జర మాడివా మొదలగు ఉప జాతులలో కనిపించే ఆచార వ్యవహారాలు సాధారణంగా వీరిలో కనిపిస్తుంటాయి. వీరి వంశాలన్ని ఒకే మూలం నుండి ఏర్పడినాయని చెప్పడంలో ఎటువంటి అనుమానం లేదు. ఈ మూడు వంశాలలోని వివాహ ఆచార వ్యవహారాలను గమనిస్తే అన్ని ఒకే విధంగా ఉంటాయి. పెద్దగా తేడా ఏమి కనిపిందు. ఈ జాతుల పోలికలు ఒకే విధంగా ఉండటం వలన వీరు రాజస్థాన్ లోని రాజపుత్ర వంశము వారితో సంబంధం ఉన్నదని తెల్సుకోవచ్చు. కాబట్టి బంజారాల పుట్టుక స్థానం రాజస్థాన్ అని నిర్ధారించవచ్చు.

రాజపుత్రులలో కనిపించే రాథోడ్‌లు, చౌహాన్‌లు పమార్‌లు మొదలైన వంశాలు మార్వాడీ గూర్జర బంజారాలలో స్పష్టంగా కనబడుతుంది. కాబట్టి వీరిని రాజపుత్రులలో ఒక శాఖ అని అనటంలో ఏలాంటి సందేహం లేదు. రాజపుత్రులలో కనిపించే ధార్మిక సంస్కారాలు, ఆచారాలు, కట్టుబాట్లు, నమ్మకాలు, విశ్వాసాలు సంప్రదాయాలు మొదలగునవి ఈ మూడు వంశాలలో స్పష్టంగా కనబడుతుంటాయి. రాజకీయ కారణాల వల్ల ఈ మూడు వంశాల వారు దూర ప్రాంతాలకు వెళ్ళడం జరిగింది. కాని తమ మూల ఆచారాలను మాత్రం యథాతథంగా కాపాడుకుంటూ, వాటిని ఆచరిస్తూ రావటం ఇప్పటికీ చూడవచ్చు"[1].

"బంజారాలు మొదట్లో రాజస్థాన్‌కు చెందిన వారే తర్వాత దక్కన్ ప్రాంతానికి వలస వచ్చి స్థిరపడ్డారు. బంజారాలకు రాజపుత్రులకు సంబంధించి అనేక రకాల ఇతిహాసాలు కలవు. బారత దేశంలో మొగలుల పాలన ప్రారంభానికి ముందు, కొన్ని రాజవంశాల వారు చిన్న చిన్న సంస్థానాలను రాజ్యంగా చేసుకొని పరిపాలన చేస్తూండేవారు. అదే సమయంలో రాజపుత్ర వంశానికి చెందిన "రాణాప్రతాప్ సింగ్" రాజస్థాన్, ఢిల్లీలోని కొన్ని ప్రాంతాలను పరిపాలిస్తుండే.

ఇదే సమయంలో మొగల్ పాలకుడైన మొగల్ సామ్రాట్‌గా పేరు ప్రఖ్యాతలు గడించిన అక్బర్ క్రీ॥శ॥ 1576 సంవత్సరంలో "ఉదయపూర్"పై దండెత్తినాడు. ఈ దాడికి అక్బర్ ప్రతాపానికి తట్టుకోలేక రాణాప్రతాపుడు హల్దీఘాట్‌కు పారిపోయాడు. ఆ విధంగా రాణాప్రతాపుడు హల్దీఘాట్ యుద్ధంలో మొగలుల చేతిలో పరాజితుడై పారిపోయాడు.

గెలుపొందిన అక్బర్ రాణాప్రతాపుడితో ఇలా అన్నాడు. నీవు శరణు కోరి వస్తే, తిరిగి నీ రాజ్యాన్ని మీకే అప్పగిస్తాను అని సందేశం పంపించాడు. అప్పుడు క్షత్రియ వంశంలో పుట్టిన రాణాప్రతాపుడు అక్బర్ సందేశానికి లొంగకుండ తిరిగి అక్బర్‌కు రాణాప్రతాపుడు తన సందేశాన్ని ఈ విధంగా పంపినాడు. నా శక్తి సామర్థ్యాలతో తిరిగి రాజ్యాన్ని పొందుతానేగాని పిరికి పందలా చేతకాని వాడిలా శరణు కోరనని సందేశం పంపించాడు. తిరిగి రాజ్యాన్ని పొందేంత వరకు అడవిలోనే నివసిస్తానని ప్రతిజ్ఞ చేశాడు. అతనితో పాటు తన అనుచరులు సైనికులు అడవుల్లోకి వెళ్ళారు. ఈ సమయంలో రాజపుత్రుల మీదా మొగలుల అరాచకాలు, హత్యలు ఎక్కువ అయినాయి. దీనితో అనేక రాజపుత్ర కుటుంబాలు కొండలు, గుట్టలు, అడవుల్లోకి వెళ్ళి తలదాచుకున్నారు. అడవుల్లోనే అష్టకష్టాలు పడుకుంటూ క్రూర మృగాల మధ్య, విష సర్పాల మధ్య తమ జీవితాన్ని గడిపారు. రాజు ప్రతిజ్ఞను తమ ప్రతిజ్ఞగా భావించి రాజు యందు భక్తితో రాజు గారి కోరిక నెరవేరేంత

వరకు సైనికులుగా వున్న బంజారాలు అడవుల్లోనే ఉన్నారు. ఇంతలో రాణాప్రతాపుడు మరణించాడు."[2]

ఈ సందర్భంలో మొగలుల దాడి నుండి తప్పించుకొని తమకు తాము రక్షించుకొనుటకు బంజారాలు ఎన్నో కష్టాలు పడ్డారు. వీరిలో మొగలుల కష్టాలను పడలేక గూర్జర, మార్వాడీలు తిరిగి తమ పూర్వ స్థావరాలైన రాజస్థాన్‌కు వచ్చారు. కాని బంజారాలు మాత్రం అడవుల్లోనే మిగిలిపోయారు. వీరి పుట్టుక గూర్చి చాలా మంది చరిత్రకారులు కూడా ఇదే అభిప్రాయాలను వ్యక్తపరిచారు.

1) బంజారాలు రాజస్థాన్‌లోని చారకులు, భట్రాజులుగాను, వాణిజ్యకారులు గాను ఉండేవారిని కర్నల్ టాడిజెమ్స్ అభిప్రాయ పడ్డాడు.

2) డా॥ గ్రియర్సన్, నంజుండయ్య అయ్యర్ అభిప్రాయంలో బంజారాలు క్షత్రియులు, రాజపుత్రులు అని ఉత్తరాది వారిని మార్వాడ్ అని తెలిపారు.

బంజారాల చరిత్ర

బంజారాల తెగకు చారిత్రక ప్రతిపత్తి ఉంది. మన భారత దేశంలో ఆదివాసి తెగల్లో బంజారాలు విశిష్టమైన తెగకు చెందినవారు. బంజారాల చరిత్రను అనేక రకాలుగా అధ్యయనం చేయవచ్చు. బంజారా తెగను రెండు ఆధారాల ద్వారా అధ్యయనం చేయవచ్చు. మొదటిది పురాగాథల ఆధారంగా రెండవది చారిత్రక ఆధారంగా బంజారాలను వివిధ ప్రాంతాలలో వివిధ పేర్లతో వ్యవహరిస్తున్నారు. బంజారాలుగా, సుగాలీలుగా లంబాడీలుగా పిలువబడుతున్నారు.

పురా గాథల (MYTHS) ఆధారంగా :

"శ్రీ మహా విష్ణువు మొదట భృగు, రఘు అనే ఇద్దరు మహర్షులను సృష్టించాడు. ఈ మహర్షులు దజ్ మహారాజు, అంబాబాయిలను

సృష్టించారు. వీరికి కవర్‌దజ్ అనే కుమారుడు జన్మించాడు. కవర్‌దజ్‌కు రాజ్‌ఫళ్, రాజ్‌ఫళ్‌కు రీమ్ జన్మించాడు. రీమ్‌కు హాబల్ సంతతి హిందువులు, కాబల్ సంతతికి ముసల్మాన్‌లు జన్మించారు. హబల్ సంతతికి చెందినవాడు తీడా. ఈ తీడా బిడ్డలే బంజారాలు అని జానపదుల ఇతిహాసాల వల్ల తెలుస్తుంది. (ఈ ఇతిహాసం ప్రముఖ జంజారా రచయిత శ్రీ భూక్య బాలాజీదాస్ గారు తెలిపారు)."[3]

బంజారా:

"బంజారా అనే పదం వనచర్ భణ్‌జారే అనే హిందీ పదం ఆధారంగా వచ్చింది. అనగా వలస వెళ్ళేవారు అని అర్థం. అనగా పూర్వం నుండి బంజారాలు ఆహార ధాన్యాలను ఒక ప్రాంతం నుండి వేరొక ప్రాంతానికి ఎడ్ల వీపుల పైన బస్తాలలో ధాన్యం నింపి వ్యాపారం చేసేవారు. కాబట్టి వీళ్ళను హిందీలో వనచర్ భణ్‌జారే అంటే వలస వెళ్లేవారు అని అంటారు. ఎక్కడైనా స్థిరంగా ఉండక ఊరూరు తిరుగుతూ వ్యాపారం చేసుకునేవారు. కాబట్టి వీరు సంచార జీవితం గడిపేవారు. ఈ విషయం ఆధారంగా భణ్ + జారే అనేపదం కాలక్రమంలో ఈ పదం ఉచ్చారణలో కొంత మార్పు వచ్చి బంజారా అని వ్యవహరించటం మూలాన వీరిని బంజారాలు అని పిలుస్తారు. వీరినే వివిధ పర్యాయ పదాలుగా లంబాడీలు బంజారా, వంజారి, బ్రింజారీ, లభానా, వనజారా, లదానియాగా వాడుతున్నారు.

లంబాడా :

వీరు పూర్వము ఉప్పుబస్తాలను పశువుల వీపుపై గోనె సంచులలో నింపి వ్యాపారాలు చేసేవారు. అనగా లుమాన్+ భాడా అనగా ఉప్పు కిరాయి, ఉప్పు రవాణా అనే అర్థాలు చెప్పకోవచ్చు. లూణ్ + భాడా అనే పదం చివరగా కాలక్రమంలో రాను రాను ఉచ్చారణలో మార్పు వల్ల లంబాడా అని వ్యవహరిస్తున్నారు. అదే విధంగా భారతదేశానికి వలస వచ్చిన బ్రిటీషువారు కూడా వారి సైన్యములో మంచి శరీర దారుఢ్యం కలిగిన వారైన లంబాడీలను బ్రిటీషువారు తమ సైన్యములోకి తీసుకునేవారు. ఈ

విధంగా లంబాడీలను లాంగ్+ బాడి అని, లాంగ్ అనగా పొడవైన బాడీ అనగా శరీరం కలిగినవారు. దీని ఆధారంగానే లాంగ్ బాడి అనే పదం కాలక్రమంలో ఉచ్చారణలో మార్పు వల్ల లంబాడీలుగా వ్యవహరించబడుతున్నారు.

సుగాలి :

ఈ పదము సుగాయ్+ అనే హిందీ పదం ఆధారంగా ఏర్పడింది. సు అనగా మంచి గాయ్ అనగా ఆవు(పశువు) అని అర్థం. అంటే మంచి పశువుల సంపద కలిగిన వారు అని అర్థం. సుగాలీలు మంచి పశువుల కాపరులు, పోషకులు దీన్ని ఆధారంగా జానపదుల శైలిని బట్టి జానపద ఇతిహాసాన్ని బట్టి తెలుస్తుంది."[4]

చారిత్రకంగా - వలస :

"చారిత్రకంగా బంజారాలు రాజస్థాన్‌లోని రాజపుత్రవంశానికి చెందిన వారని చెప్పబడుతుంది. కాలక్రమంలో రాజపుత్ర స్థానం రాణాప్రతాప్‌సింగ్ అనే రాజు మరణాంతరం వీరు దిక్కులేని వారైనారు. మొగలుల దండయాత్రకు గురై బంజారాలు దక్షిణ ప్రాంతానికి తరలివచ్చారు. బంజారాలు బ్రతుకుతెరువు కొరకు తమ జీవనోపాది కోసం అడవుల్లోకి రావలసి వచ్చింది. వీరు తమ జీవనోపాధికి పశువులను పెంచి పోషించుకుంటూ పశు సంపదను పెంపొందించుకున్నారు.

బంజారాలు పశుపోషకులుగా ఎద్దులు, ఆవులు మందల మందలుగా పశు సంపదను కాపాడుకుంటూ వచ్చారు. పూర్వం బంజారాలు తమ ఎడ్ల బండ్లపైన వస్తువులను వేసుకొని ఒక చోటి నుండి వేరొక చోటికి చేరవేసేవారు. వీరు తమ మాతృభూమి అయిన రాజస్థాన్‌లోని పహాడ్ అనే ప్రదేశాన్ని వదలి "మాళవ" వైపు ప్రయాణం సాగించారు. ఈ విధంగా ఉత్తర భారతదేశం నుండి దక్కన్ ప్రాంతానికివలస వచ్చారు. వీరు రాజపుత్ర వంశానికి చెందిన క్షత్రియులని అనుకుంటారు. బంజారాలు సాహసమైన జాతి వారు. మొగలులు, మరాఠాలు, బ్రిటిషువారి పరిపాలన కాలాల్లో వీరి వలసలు సాగాయి.

బంజారాలు మొగలుల సైన్యానికి ఆహార పదార్థాలు, యుద్ధ సామాగ్రిని సరఫరా చేసేవారు అని షేర్ సింగ్ షేర్ అనే ఆంగ్లకవి చెప్పారు. క్రీ.శ. 1504లో సికింధర్, ధోర్‌పూర్ దండయాత్రల నాటికే వీరు మొగల్ సైనికులకు ఆహార ధాన్యాలను సరఫరా చేసేవారని చారిత్రకంగా చెప్పబడింది. షాజహాన్ కాలంలో అతని వజీర్ అయిన అసఫ్‌ఖాన్ నేతృత్వంలో దక్షిణ జీజ్‌పూర్ అదీఫ్‌సాహి మీద దాడి చేయటానికి క్రీ.శ. 1630వ సంవత్సరంలో బంజారాలు మొగలుల సైన్యంతో పాటు దక్కన్ ప్రాంతానికి వలస వచ్చారు. కాలక్రమంలో వీరు దక్కన్ ప్రాంతాన స్థిరపడ్డారు. రాజుల యుద్ధ సమయంలో బంజారాలు ఇరుపక్షాల రాజులకు ఆహార పదార్థాలను సరఫరా చేస్తూండేవారు. రాజుల యుద్ధ సమయంలో ఇరు పక్షాలవారు లంబాడీలను ఏమీ అనేవారు కాదు.

'మార్వాడీలు ఈ తెగల్లో ఒకరు. రాజస్థాన్‌లోని మార్వాడ్ ప్రాంతానికి చెందిన వారు మార్వాడీలు. ఈ ప్రదేశానికి చారిత్రక ప్రతిపత్తి వుంది. ఈ మార్వాడీలు తర్వాత కాలంలో అనేక ఉప తెగలుగా మార్పులు చెందారు. వీరినే లంబాడీలని, బంజారాలని, సుగాలీలని వ్యవహరించటం జరిగింది. వీరు మార్వాడీ తెగకు చెంది ఉండవచ్చునని చెప్పబడుతుంది'.

'బంజారాలు దక్కన్ ప్రాంతానికి వలస వచ్చినప్పుడు అసఫ్‌ఖాన్ కు సహాయంగా బంజారాల నాయకులైన జంగి, భంగి అనే వారు రాజుకు తోడుగా నిల్చినారు. జంగి వద్ద 1,90,000 పశువులు, భంగీ వద్ద 52,000 పశువులు ఉండేవని ఎఫ్.ఎన్. కంబర్ లేజర్ గారు చెప్పారు. సంచార సమయంలో జంగి, భంగీ అనే నాయకుల పశువులకు ఆహారం కోసం అసఫ్‌ఖాన్ దగ్గరకు వెళ్ళి తమ పశువులకు ఆహారం గూర్చి ఇబ్బందిని చెప్పుకున్నారు. అప్పుడు అసఫ్‌ఖాన్ వీరి సేవలను గుర్తించి, ఇరువురికి సువర్ణ అక్షరాలతో ఒక తామ్ర ఫలకం మీద పశువుల కొరకు వీరికి కొంత భూమిని, అధికారాన్ని ఇనాంగా రాసి ఇచ్చాడు. అది ఇలా వుంది.

"రంజన్ కా పాణి

ఛప్పర్ కా ఘాస్

దీన్ కా తీన్ ఖూనీ మాఫ్

జొర్ జహార్ అసఫ్ ఖాన్ కా ఘోడీ

వహాస్ భంగీ, జంగీ కా బైల్" అని ఒక తామ్ర శాసనం వల్ల అసఫ్‌ఖాన్ సైనికులకు కొరత లేకుండా నిరంతరంగా ఆహారం అందించాలని ఈ శాసనం వల్ల తెలుస్తుంది. పై శాసనం వలన బంజారాలు ఒక రోజులో మూడు హత్యల వరకు చేయటానికి కూడా అధికారం ఇచ్చాడు. మార్గ మధ్యలో ఎవరైన వీరి వద్ద నున్న ఆహార పదార్థాలను దోచుకోవటం జరుగుతుందేమోనని ఈ అధికారాన్ని రాజుగారు లిఖిత పూర్వకంగా తామ్ర శాసనం పై రాసి ఇచ్చారు. బంజారాలు బహు ధైర్యవంతులు. వీరి జోలికి ఎవ్వరు వచ్చేవారు కాదు. హింగోలియా దగ్గర ఉన్న "మూసి" అనే చోట నివసిస్తున్న భంగీ నాయకుని వారసుల వద్ద ఇప్పటికి ఈ తామ్ర శాసనం ఉంది. అందువల్ల నిజాం నవాబులు వీరిని "నాయక్" అని పిలిచేవారు. అంతే కాకుండా నాయకుని స్థానానికి వచ్చే వారసులకు, ప్రతి కొత్త వ్యక్తికి నిజాం నవాబులు గౌరవంగా బహుమతి పంపేవారు. అదే సమయంలో ఇమోట్‌మల్ జిల్లా యువళి అనే తాండాలో రామానాయక్ పటేల్ ఉండేవాడు. ఇతడు జంగీ నాయకుని వారసుడు ఇతని వద్ద నిజాం నవాబు ఇచ్చిన తామ్ర శాసనం అధికార ముద్ర ఉన్నది. ఇప్పటికీ హైద్రాబాద్ కోర్టు ప్రవేశ ద్వారం వద్ద ఉన్న ఖిలావత్ వద్ద దొరుకుతుంది. అదే విధంగా గోల్కొండ కోట ప్రవేశ ద్వారం వద్ద కూడా ఈ శాసనం ఇప్పటికి ఉంది."[5]

బంజారాల గోత్రాల పుట్టుక - గోత్ర నామాలు

గోత్రాల పుట్టుక :

"శ్రీ మహా విష్ణువు మొదట భృగు, రఝు అనే ఇద్దరు మహర్షులను సృష్టించాడు. ఈ ఋషులు, ధజ్ మహారాజును, అంబా బాయిలను సృష్టించాడు. ఈ దంపతులకు కవర్‌ధజ్ అనే కుమారుడు జన్మించాడు. ఈ కవర్‌ధజ్‌కు రాజఫళ్ జన్మించాడు. రాజ్‌ఫళ్‌కు రీమ్ జన్మించాడు. రీమ్‌కు, హాబల్, కాబుల్ అనే ఇద్దరు కుమారులు జన్మించారు.

హేబుల్ సంతతి వారిని హిందువులుగాను కాబుల్ సంతతి వారు ముసల్మాన్ (తురకలు) అయినారు. హబల్ అనే హిందూవుకు "వగరా" అనే కుమారుడు జన్మించాడు. ఈ వగరాకు జోగాదుఅనే కుమారుడు ఇతనికి నందల్ అనే కుమారుడు జన్మించాడు. నందల్‌కు కానన్, కానన్‌కు కర్ణ్ జన్మించారు. ఈ కర్ణ్‌కు తీడా, చాడా అనే ఇద్దరు కుమారులు జన్మించారు. తీడాకు పుట్టిన వారిని బంజారాలుగా, చాడాకు పుట్టిన వారిని బంజారేతరులు (శూద్రులు) అని వ్యవహంరిచారు. ఈ బంజారా తీడాకు జోగడ్, భీమడ్, ఖీమడ్, రాయడ్ మోటా, మోల అనే అరుగురు కోడుకులు జన్మించారు.

ఈ గోర్ బంజారా మోలకు సంతానం లేక వివిధ దత్త పుత్రులను పెంచుకున్నాడు. వారే పమార్, రాఠోడ్, చౌహాన్‌లు వీరికి మళ్ళీ పమార్‌కు 12 మంది సంతానం, రాఠోడ్‌కు 27 మంది. చౌహాన్‌కు 6 గురు సంతానం కల్గినారు. వీరి పేర్లనే ఇంటిపేరుగా ఉప కులాలుగా క్రింది విధంగా పేర్కొనడం జరిగింది.

గోత్రనామాలు :

పమార్ -12 (బార్ గొత్ పమార్)

1) లోహెడ్ పమార్, 2) గైడా పమార్, 3) అంద్ పమార్ 4) ధంత్ పమార్, 5) వదియాజీత్ పమార్, 6) జాగేత్ పమార్ 7) రాత్‌భారే పమార్ 8) హత్యా పమార్, 9) రాజా పమార్ 10) పూణా పమార్, 11) రబ్డుపమార్ 12) వాంకడోత్ పమార్.

చౌహాన్ - 6 : (ఛోగొత్ పమార్)

చౌహాన్ మోదారెజికి ఆరుగురు జన్మించారు. 1) కొర్రా చౌహాన్, 2) సబావట్ చౌహాన్ 3) కేళూత్ చౌహాన్ 4) మూడ్ చౌహాన్ 5) లావుడ్యా చౌహాన్, 6) పాల్త్యా చౌహాన్.

రాఠోడ్ వంశము - గోత్రాలు -27: (సత్తాయిస్ రాఠోడ్)

ఈ రాఠోడ్ ఉప భాగాన్ని భూక్యా అని పిలుస్తారు. ఇందులో మొత్తం ఇరువది ఏడు గోత్రాలు (ఇంటిపేర్లు) గలవు. ప్రతి ఉప భాగంలోను తండ్రి

సంతతికి చెందిన గోత్రాలు కల్గి ఉంటాయి. గోత్రం అనగా తండ్రి సంతతి వారని తెలియచేస్తుంది. దానినే బంజారాలు ఇంటి పేరుగా వ్యవహరిస్తారు. గోత్ర నామాన్ని పేరుకు ముందు (సర్‌నేమ్)గా వాడుతారు. ఆడపిల్ల పెళ్లి కాగానే తన తండ్రి గోత్రం రద్దు చేయబడి భర్తవైపువున్న గోత్రాన్ని వాడుతారు.

1. కరంసోత్	2. కానావత్	3. పితావత్
4. ఖేతావత్	5. మేగావత్	6. నేనావత్
7. డుంగావత్	8. కొడావత్	9. రమావత్
10.రాజావత్	11. డేగావత్	12. కుమావత్
13.భీలావత్	14. బాణావత్	15. ఖీలావత్
16.మేరావత్	17. ఖాత్రోత్	18. ఆళోత్
19.మెరాజోత్	20. దేపావత్	21.రాత్లా (పుళియా)
22. సొటికి	23. జూండావత్	24. దేవాసోత్
25. పాతలోత్	26. రణసోత్	27. సంగావత్"[6]

తాండాల చరిత్ర :

"చారిత్రకంగా ఉత్తర భారత దేశంలో పుట్టిన ఈ "తాండా" అనే పదం సమూహం లేదా గుంపు అని అర్థం. స్వయం సమృద్ధిని వివిధ జాతుల ప్రజలు ఒకేచోట కలిసి సంఘ జీవితాన్ని తమలో తాము ఒకరిని గుంపుకు పెద్దగా ఎన్నుకొంటారు. అతనినే నాయక్ అని పిలుస్తారు. నాయక్ భార్యను "నాయకణ్" అని పిలుస్తారు. నాయక్ అడుగుజాడల్లో తాండాల్లో నివసించే బంజారాలు కట్టుబాట్లను గౌరవిస్తూ, ఆచార సంప్రదాయాలను సక్రమైన పద్ధతిలో నిర్వర్తిస్తుంటారు. బంజారాల్లో ప్రతి తాండాకు ఆర్థిక, సాంఘిక కార్యక్రమాలను నిర్వహించేందుకు నాయకుని ఆధ్వర్యంలో సభా వేదిక గోర్ పంచాయితీని ఏర్పాటు చేస్తారు. ఈ సభా వేదికకు తాండాకు పెద్దగా ఎన్ను కొనబడిన నాయక్ పెద్ద మనిషిగా తీర్పులు చెప్పే న్యాయమూర్తిగా వ్యవహరిస్తారు. నాయకునికి సలహాదారులుగా ఒకరిని నియమిస్తారు. అతనిని కర్‌చారి అని పిలుస్తారు. ఇంకోక్కరిని వార్తావాహుడుగా నియమిస్తారు. ఇతనిని "డప్పన్" అని పిలుస్తారు. నాయక్

పదవి వంశపారపర్యంగా వస్తుంది. నాయక్ ఆజ్ఞానుసారంగా తాండాకు సంబందించిన మంచి, చెడు విషయాలను డప్పన్ (వార్తావాహుడు) ద్వారా తెలియచేస్తారు. వివాహ వేడుకలు, పండుగలు, జాతరలు మొదలగు విషయాలలో తాండా నాయకుని పాత్ర, పెద్ద మనుషుల పాత్ర చాల ముఖ్యంగా ఉంటుంది. తాండాలో ఎవరైన ఫిర్యాదులు చేస్తే నాయక్ ఇరువురిని అనగా వాది, ప్రతివాదిని పిలిపించి తాండా బయట గాని మధ్యలో గాని నాయకుని ఇంటి వద్ద గాని "గోర్ పంచాయతీని" నిర్వహిస్తారు. తర్వాత పంచాయితీ తీర్పులు చెబుతారు. బంజారాల సమస్యలు తాండాలోనే పరిష్కారం అవుతాయి. న్యాయ స్థానాలు, పోలీసుల వరకు ఈ వ్యవహారాలు పోవు. తప్పు చేసిన వారికి తగిన శిక్షలు విధిస్తారు. ఈ శిక్షలు డబ్బు రూపంలో జరిమానాగా ఉంటుంది. వీరు చాలా వరకు గ్రామాలకు దూరంగా, అడవుల్లో తమ గృహాలను నిర్మించుకొని గుంపులు, గుంపులుగా నివసిస్తారు. బంజారాలు తమ ఇండ్లను గడ్డితో కప్పి, చతురస్రాకారంగా నిర్మిస్తారు. ప్రక్క భాగాలు వెదురుతో కప్పబడి ఉంటాయి. చాలా వరకు మట్టి గోడలతోనే నిర్మించుకుంటారు. బంజారాలు మంచి వ్యవసాయదారులు కష్టజీవులు. వీరు అటవి ప్రాంత భూమిని బంజరు భూమిని సాగు చేస్తారు. వీరు ముఖ్యంగా సజ్జ, జొన్న, వరి, రాగులు, మిర్చి, ప్రత్తి, చెరుకు మొదలగు వాటిని పండిస్తారు. అదేవిధంగా, చిలగడదుంప, ఉల్లిగడ్డ, మొరంగడ్డ మొదలగు వాటిని పండించి ఊరూరా తిరుగుతూ అమ్ముతారు. వీరు తాండాలో కొత్తగా ఇండ్లను నిర్మించేటప్పుడు బాలాజీ స్వామి పేరు మీదగా పూజలు చేసి ఇల్లు కట్టుకుంటారు.

బంజారాల గురించి మొట్టమొదటి ప్రస్తావన కీ.శ. 6వ శతాబ్దానికి చెందిన దండి రచించిన దశ కుమార చరిత్ర అనే గ్రంథములో పుష్పోదవ అనే ఖండికలో మొదటి భాగం 4వ ఆధ్యాయంలో ఉన్న వర్తకుల విడిది అనే కథలో చెప్పబడింది."[7]

"బంజారాలు స్థిర నివాసం లేకుండా సంచార జీవితం గడిపే వాణిజ్యకారులని, వర్షకాలంలో మాత్రమే సొంత గుడిసే నిర్మించుకునేవారని

తెలియచేశారు. బంజారాలు ఈ గుడిసెలను ఒంటరిగా కాకుండా గుంపులు గుంపులుగా ఒక 10 నుండి 20 వరకు గుడిసెలు ఒకే ప్రాంతంలో కట్టుకుంటారు. దీనినే తాండా అని అంటారు. తాండా అంటే సమూహం లేదా గుంపు అని అర్థం.

బంజారాలు దసరా పండుగ ఉత్సవం తర్వాత తాము కట్టుకున్న గుడిసెలను వదిలి వేరేచోట తాండాలను నిర్మించుకునేవారు. వీరు చాలా వరకు వ్యవసాయనికి అనుకూలంగా ఉండే ప్రాంతాలలో తమ ఇళ్ళను కట్టుకునేవారు. వీరు తాము కట్టుకున్న గుడిసెను కుడి లేదా కురి అని అంటారు. వీరు మధ్యప్రదేశ్‌లోని దుంబా అనే ప్రాంతానికి వెళ్ళి వ్యవసాయం చేయటం స్థిర నివాసం చేసుకోవటం నేర్చుకున్నారు. కుడి లేదా గుడిసెలను కట్టుకునేటప్పుడు తమ గుంపుకు నాయకుని ఎన్నుకొని నాయక్ ఇల్లు మాత్రం తమ మధ్యలో ఉండేటట్లు నిర్మించుకునేవారు. నాయక్ ఆ గుంపుకు సారధ్యం వహించేవాడు. తమ గుంపులోని వారికి ఏ విధమైన ఆపద వచ్చినా తగాదాలను వివాహ సంబంధాలను ఆచారాలను నాయకుడు కట్టుబడి చేసి, అందరికి చేదోడు వాదోడుగా తన వంతు సహకారాన్ని తారతమ్య భేదం లేకుండా అందరిని సమానంగా చూసేవాడు."[8]

"బంజారాలు తాము నిర్మించుకునే గుడిసెలను ఖాళీ చేసి వేరే చోటికి వెళ్ళేటప్పుడు తిరిగి వచ్చే ఆలోచన లేకుంటే వాటిని నేల మట్టం చేసేవారు. కొన్ని సందర్భాల్లో మాత్రం ఆ గుడిసెలను ఉన్నవి ఉన్నట్లుగానే ఖాళీగా వదిలి వేరే ప్రాంతాలకు వెళ్ళి ధాన్యాలను సంపాదించుకొని తిరిగి తమ తమ గుడిసెల్లో వచ్చి జీవనం గడిపేవారు.

18వ శతాబ్దానికి చెందిన డుబోయిస్ అనే కవి హిందూ ఆచార సంప్రదాయాలనే పద్ధతులపై బాగా అధ్యయనం చేశాడు. బంజారాల గూర్చి ఈ విధంగా రాశారు. వీరు దేశంలో సంచార జీవితం గడిపే జాతులన్నింటిల్లోను ప్రధానమైన విలక్షణమైనవారు. వీరినే లంబాడా, సుకారులని, బ్రింజారులని అంటారు. అట్లే ప్రొఫెసర్ శ్రీరామ శర్మ గారు

1983 లో బంజారాల ప్రాముఖ్యతను గూర్చి వారి వలసల గురించి వివరించారు.

1. బంజారాలు మండి సార్థ వ్యవస్థలో అనగా! ఆహార వస్తువుల సరఫరా విషయాలలో గుత్తాధిపత్యాన్ని కలిగి ఉండేవారు. వీరిని రాజస్థాన్‌లో బళారియా అని పిలుస్తారు. వీరు రవాణా కొరకు ఎద్దును ఉపయోగినిచేవారు. కాబట్టి వీరిని ఆ విధంగా పిలిచేవారు. ఈ బళద్ అనగా ఎద్దు దాని వీపు మీద వస్తువులను రవాణా చేస్తారు. కాబట్టి రవాణా చేసే వ్యక్తిని కూడా బళద్ అని వ్యవహారిస్తారు. బళద్ తాండా గుంపునంతటికి నాయక్ అని పిలువబడే వ్యక్తి సారధ్యం వహిస్తాడు.

2. భారతదేశంలో బంజారాలు, వారి వారి నివాస ప్రాంతాలను కలిగి ఉండేవారు. కేరళ, తెల్లానొ, శెరియూ, బరార్, కాందేశ్, నిమద్, బవన్ అనేవి. వీటిలో కొన్ని తాండాలను భౌగోళిక సరిహద్దులు కూడా ఉండేవి. ఒక తాండా నివాసులు వేరొక తాండా పరిధిలోకి ప్రవేశించరు. తాండా పెద్దగా వ్యహరించే నాయక్‌లు. ఇతర తాండాలతో వివాహ సంబంధాలను ఏర్పర్చుకునే వారు.

3. పంజాబ్ రాష్ట్రంలోని గుజరాత్ జిల్లాలో తాండో అనే గ్రామంలో బంజారాలు ఎక్కువగా నివసిస్తున్నారు. డాక్టర్ మదన్‌రాజ్ మెహతా ఉప్పు ఉత్పత్తిదారులు అనే గ్రంథంలో రాజస్థాన్‌లోని సాంబర్ పక్బార్ సరస్సు మొదలగు ప్రాంతాలలో వాడే పదాలను సేకరించారు. కాని తాండా అనే పదం ఉన్నది కాని తాండో గూర్చి లేదు. అందువల్ల సరుకు రవాణాను వృత్తిగా చేసుకునే ఈ బంజారాల బృందాన్నే తాండా అని పిలుస్తున్నారు"[9]

సూచికలు

1. రత్నావత్ మాల్యా ఢాడీ వయస్సు 80 సంవత్సరాలు, గాయం వారి గూడేం, సూర్యాపేట, నల్లగొండ జిల్లా, సేకరణ మౌఖికం

2. రత్నావత్ హరిలాల్ ఢాడీ వయస్సు 75సం. గాయం వారి గూడేం, సూర్యాపేట, నల్లగొండ జిల్లా, సేకరణ మౌఖికం
3. రత్నావత్ బిక్షం ఢాడీ వయస్సు 70 సంవత్సరాలు గాయం వారి గూడేం, సూర్యాపేట, నల్లగొండ జిల్లా, సేకరణ మౌఖికం
4. సుగాలి సంస్కృతి భాషా సాహిత్యాలు – గోనా నాయక్, యం. పుట. 1,2,19,20, 22,23,24,25.
5. ఎ.పి. ట్రైబల్ లైఫ్ – చిన్న వెంకటేశ్వర్లు, భుక్యా – పుట:30,33,34,35,36.
6. బంజారా చరిత్ర సంస్కృతి ప్రగతి – చిన్యా నాయక్ బి. పుట. 8,9,26,27.
7. కరీంనగర్ జిల్లా లంబాడీల ఆచారవ్యవహారాలు – శంకరయ్య జె. పుట. 5,6,9,11, 18 నుండి 23 వరకు.
8. లకావత్ సొమ్లా నాయక్, వయస్సు – 80 సంవత్సరములు, అజ్మీర తాండా, నూతనకల్ (మం), నల్లగొండ జిల్లా, సేకరణ మౌఖికం.
9. బంజారా చరిత్ర – సంస్కృతి – ప్రగతి – చిన్యా నాయక్ బి. పుట. 8–30.

II. బంజారాల సమాజం - సంస్కృతి

బంజారాల సమాజం - సంస్కృతి

సమాజంలో బంజారాల సంస్కృతి చాల ఆకర్షణీయంగా ఉంటుంది. జానపదులలో గ్రామము లాగా గిరిజనులలో వీరి సమాజాన్ని తాండా అని అంటారు. వీరి ఆచార వ్యవహారాలు, కట్టుబాట్లు, నమ్మకాలు, విశ్వాసాలు, ఆహారపానీయాలు, పండుగలు, జాతరలు, వివాహ కార్యక్రమాలు, సంస్కృతి సమాజంలో ఒక ప్రత్యేకతను తెలియచేస్తుంది. తాండాలోని ప్రతి పని వ్యవహారాలు కూడ నిర్థిష్టంగా విభజించి వ్యవస్థీకృతంగా ఉంటుంది. తాండాలోని ప్రతి వారు తమ నాయకుని ఆజ్ఞకు లోబడి తమ జీవితాన్ని సాగిస్తుంటారు. అంతే కాకుండా తాండాలోని నియమ నిబంధనలను, కట్టుబాట్లకు అందరు మూకుమ్మడిగా కట్టుబడి ఉంటారు. తాండాకు సంబంధించిన ప్రతి విషయాన్ని చట్ట సమానంగా భావిస్తారు. తాము ఒక ప్రత్యేక తెగకు సంబంధించిన వారమని భావిస్తారు. సమాజంలో బంజారాలను గోర్ అని బంజారేతరులను కోర్ అని అంటారు. కాబట్టి వీరి సంస్కృతిని గోర్ సంస్కృతి అని పిలుస్తారు."[1]

నాయక్ బిరుదు :

"బంజారాలు పూర్వం తమ వంశ నామాలను హిందువులు అగ్రవర్ణాల వారు రావు, రెడ్డి, నాయుడు, రాయుడు, గౌడ్, ముదిరాజ్ మొదలగు పేరు చివరన పెట్టిన విధంగానే వీరు కూడా తమ పేరు చివరనా, రాఠోడ్, చౌహన్, జాదవ్ (వడితియా), పమార్ అని పెట్టుకుంటారు. 15వ శతాబ్దంలో ఉత్తరాది నుండి దక్షణాదికి వలస వచ్చిన వీరు, ఆంధ్రప్రదేశ్‌లో అనంతపూర్, ఖమ్మం, వరంగల్, మెదక్, మహబూబ్‌నగర్, నల్గొండ, రంగారెడ్డి మొదలగు జిల్లాలలో ఎక్కువగా విస్తరించి ఉన్నారు.

పూర్వం శ్రీరంగపట్టణంను పరిపాలిస్తున్న హైదర్ అలీ, టిప్పు సుల్తాన్‌ల సైన్యంలో చేరి స్వతంత్ర పోరాటంలో వీరు కూడా పోరాడారు. అప్పుడు సైన్యంలో మంచి నైపుణ్యం తెలివితేటలు కనబరచిన ఈ బంజారాలు యుద్ధ వీరులకు, ఆహార పదార్థాలను యుద్ధ సామగ్రిని సరఫారా చేశారు. యుద్ధంలో కూడా పాల్గొనేవారు. వారు సైన్యానికి నాయకత్వం వహించారు. కాబట్టి అప్పుడు రాజుగారు వీరికి నాయక్ అనే బిరుదు ఇచ్చి సత్కరించాడు. అప్పటి నుండి వీరు తమ పేరు చివరన నాయక్ అని పెట్టు కుంటున్నారు."[2]

బంజారాల్లో కుల వ్యవస్థ -వృత్తులు :

"బంజారాలు స్వతంత్ర జీవనం గలవారు. వీరికి ప్రత్యేకమైన కుల వృత్తులు అంటూ ఏవి లేవు. వీరిలోనే కొంతమంది, కుల వృత్తులుగా చేసుకొని జీవనం గడుపుతున్నారు. వీరు అనాది కాలం నుండి మాత్రం పశుపోషకులు, వ్యవసాయదారులు, వ్యాపారస్తులు. వీరిలో చాలా మంది పశువులు, కోళ్ళు పెంచేవారు. పశువులు ఎంత ఎక్కువగా వుంటే అతనిని అంత ఉన్నతమైన(ధనవంతుడుగా)వారుగా పరిగణించేవారు. వీరు మంచి కష్టజీవులు. వీరికి మోసం, దగా చేయటం తెలియదు. నీతి, న్యాయాన్ని నమ్ముకుంటారు. కూరగాయలు, ఆహార ధాన్యాలను పండిస్తారు. నిజాయితీగా బ్రతుకుతారు. వీరిలో నావి అనే మంగలి పనివాడు ఉంటాడు. దాదాపు తాండాకు సంబంధించిన అందరి క్షవరాలు చేస్తాడు. అదే విధంగా ఢాడి అనేవారు యాచక వృత్తిని చేసుకుంటూ పాట పాడుకుంటూ తాండా, తాండాలకు తిరిగి పురాణ, ఇతిహాసాల కథలు చెప్పకుంటూబిచ్చమెత్తుకొని జీవిస్తారు. వీరినే బంజారా భట్రాజులు అని వ్యవహరిస్తారు.

తర్వాత ఢాలియా అనే ఒక తెగవారు డప్పులు కొట్టుకుంటూ కాళ్లకు గజ్జెలు కట్టుకొని వివిధ నృత్యా విన్యాసాలను ప్రదర్శిస్తారు. వీరి వృత్తి కూడా యాచక వృతి. తర్వాత సనార్ అనే కంసాలి తెగ *(Gold Smith)* వారు ఉంటారు. వీరు బంజారాలకు సంబంధించిన ఆభరణాలను తయారు చేస్తారు. తర్వాత ఖాత్తి అనే వడ్రంగి వారు కూడా ఉంటారు. అదే విధంగా బంజారాలకు బట్టలు సరఫరా చేసే వ్యక్తిని రంగారా అని అంటారు. బట్టల

వ్యాపారి పైన పేర్కొన్న వారు తమ కుల వృత్తులను తాండాలోనే చేసుకుంటారు. తాండాలో వీరికి అందరితో పాటు సమానంగా గౌరవిస్తారు. తాండాలో అందరు కూడా అన్నదమ్ములాగా కలిసిమెలిసి జీవనం సాగిస్తుంటారు"[3]

తాండా నాయకుని ప్రాధాన్యత :

"తాండా వ్యవహారాలు మంచి చెడులు వివాహాలు పండుగలు పంచాయితీలు ఎన్నికలు, జాతరలు మొదలగు అన్ని విషయాలు తాండా నాయకుని ఆధ్వర్యంలో నాయకుని పేరు మీదుగా జరుగుతాయి. తాండాలో నివసించే వారందరు, తమ నాయకుడు చెప్పిన విధంగా కట్టు బాట్లను గౌరవిస్తూ నడుచుకుంటారు. నాయకునికి కొంత మంది సలహాదారులుగా కారోబారీ లను నియమిస్తారు. వీరు నాయకుని అడుగుజాడలో తమ పనులను, సలహాలను నిర్వర్తిస్తుంటారు. తాండాలో నివసించే అన్ని కులాల వారిని సరి సమానంగా నాయకుడు చూసుకుంటాడు. తాండాలో జరిగే ప్రతి శుభ అశుభ కార్యక్రమాలు తాండా నాయకుడు నిర్వహిస్తాడు.

చాలా వరకు తాండాల పేర్లు నాయకుని పేరు మీదుగా పెట్టుకోవటం జరుగుతుంది. అంతే కాకుండా తాండాలో రకరకాల గోత్రాల వారు ఉంటారు. ఆ తాండాలో ఏ గోత్రీకులు ఎక్కువ సంఖ్యలో నివశిస్తే వారి గోత్రం పేరు కూడా తాండాకు పేరుగా పెట్టుకుంటారు"[4]

ఉదాహరణకు :

నల్లగొండ జిల్లాలో నూతనకల్ మండలములో చాలా వరకు పేర్లు తాండా నాయకుని పేరు మీదుగా, గోత్రాల పేరు మీదుగా, ప్రాంతాల పేరు మీదుగా ఉన్నాయి.

1) టీక్యానాయక్ తాండా (వ్యక్తిపేరు)
2) రమావత్ తాండా (గోత్రంపేరు)
3) ఆజ్మీర తాండా (గోత్రం పేరు)
4) బోటిక్రింది తాండా (ప్రాంతం)

నూతనకల్ మండలములో మొత్తము 27 తాండాల పేర్లు పై వాటి ఆధారంగానే పేర్కొనటం జరిగింది.

బంజారాల న్యాయ నిర్ణయ పద్ధతులు :

"బంజారాల న్యాయ నిర్ణయ పద్ధతిని నసాబ్ అని గోర్ పంచాయతీ అని వ్యవహారిస్తారు. ఈ పంచాయితీ ముఖ్యంగా తాండా నాయకుని ఆధ్వర్యంలో జరుగుతుంది. ఎవరికి ఎటువంటి అన్యాయం జరగకుండా సక్రమమైన పద్ధతిలో తీర్పులు ఇస్తారు. న్యాయం కోసం వాది (బాధితుడు) నాయకునికి తనకు జరిగిన అన్యాయాన్ని వివరిస్తాడు. అప్పుడు నాయకుడు ప్రతివాదిని పిలిపించి నసాబ్ కు అయ్యే ఖర్చును మరియు తాను ఇచ్చే తీర్పులను శిరసావహిస్తామని అంటేనే పంచాయితీని జరిపిస్తానని ఇరువురికి తెలియ చేస్తాడు. అప్పుడు వాది, ప్రతి వాది ఇద్దరు ఒప్పుకుంటే నాయకుడు పంచాయితీని ఏర్పాటు చేస్తాడు. పంచాయితీలో కారోబారీ తాండా నాయకులు చిన్న, పెద్దలందరు పాల్గొంటారు. వాది ప్రతి వాదులతో కొంత డబ్బును డిపాజిట్ గా నాయకుని దగ్గర పెట్టించుకుంటారు. తర్వాత ఇరువురిని తమకు నచ్చిన నాయకులను కోరుకోమని తాండా నాయకుడు ఇద్దరికి అవకాశం ఇస్తాడు. ఇరువురు తమ నాయకులను కోరుకున్నాక, పంచాయితీ సమయాన్ని బట్టి ఆ రోజు గాని మరుసటి రోజు గాని తేదీని నిర్ణయిస్తారు.

బంజారాల పంచాయితీలలో, బంజారేతరులకు అవకాశం ఇవ్వరు. కేవలం బంజారులు మాత్రమే న్యాయ నిర్ణేతలుగా ఉంటారు. కాబట్టి వీరి పంచాయితీని గోర్ పంచాయతీ అని అంటారు.

బంజారాల పంచాయితీలలో చిన్న పెద్దలు తాండాలో ఉన్న అన్ని గోత్రాల వారు ఇతర తాండా వారు కూడా పాల్గొంటారు. ఈ పంచాయితీలు రచ్చబండ వద్ద గాని తాండా బయట మంచి నీడనిచ్చే పెద్ద వృక్షాల క్రింద గాని నాయకుని ఇంటి వద్దగాని దేవాలయాలలో గాని చెరువు గట్టుల వద్ద గాని విశ్రాంతిగా ఉండే ప్రదేశాలలో పంచాయితీని నిర్ణయించి జరిపిస్తారు.

బంజారాల పంచాయితీలు గంభీరంగా ఉంటాయి. పంచాయితీలో (నసాబ్) వాది, ప్రతివాది, సాక్షులు కూడా ఉంటారు. ఇతర నాయకులు

న్యాయవాదులుగా, తాండా నాయకుడు ప్రధాన న్యాయమూర్తిగా పంచాయితీని జరిపిస్తారు. వాదన, ప్రతివాదన విన్న తరువాత నాయకులు, నాయకుడు అందరు కలిసి తప్పు, ఒప్పులను నిర్ధారణ చేసి తీర్పులను ప్రకటిస్తారు. నాయకుడు చెప్పిన విధంగా ఇరువురు ఒప్పుకోవాలి.

ఒకవేళ వాది ప్రతివాదులలో ఎవరైన తీర్పును ఒప్పుకోకపోతే ఎవరైతే ఒప్పుకోరో వారి కాళ్ళను వాదితో గాని ప్రతివాదితో గాని ఇరువురిని కట్టింపచేస్తారు. పంచాయితీ ఒప్పుకున్నాక విడిచిపెడుతారు. శిక్షలు దండనలు కూడా ఉంటాయి. అయితే ఈ శిక్షలు డబ్బు రూపంలో గాని, క్షమ రూపంలోగాని ఉంటుంది. క్షమ రూపంలో అయితే తప్పు చేసిన వారు ఎదుటి వ్యక్తి కాళ్ళు చేతులు పట్టిస్తారు. పంచాయితీలో అందరు వచ్చినందుకు కొంత డబ్బును వాది, ప్రతివాదుల నుంచి వసూలు చేసి కల్లు సారా తాగుతారు. సభా మర్యాదలను అందురు తప్పకుండా పాటిస్తారు. లేకుంటే శిక్షలకు గురి అవుతారు"[5]

పుట్టుక (జననం) ఆచారం :

తాండాలో గర్భిణీ స్త్రీలు సాధారణంగా బయటి వైద్యానికి వెళ్లరు. తాండాలో ఉండే మంత్రసాని నాయకణ్ దగ్గరకు వెళ్ళి ఆమే చెప్పే విధంగా నాటు వైద్యాన్ని చేయిస్తారు. గర్భం దాల్చిన స్త్రీలు చాలా వరకు బిడ్డను జన్మనిచ్చేంత వరకు తమ పనులతో పాటు, ఇంటి వ్యవసాయం కూలి పనులు చేస్తుంటారు. బంజారాలలో సీమంత ఆచారం ఉండదు. బిడ్డ పుట్టే సమయంలో దగ్గర మంత్రసాని ఉంటుంది. ఈమే బొడ్డు కోసి, మాయిని తీసి ఇంటి దేవర మూలలో 25 పైసలతో పాటు కొద్దిగా జొన్న పిండిని ఒక గుంత తీసి అందులో పూడ్చేస్తారు. అలా చేస్తే ఎటువంటి హాని జరగదని వారి నమ్మకం.

తర్వాత తల్లికి బిడ్డకు వేడి నీళ్ళతో స్నానం చేయిస్తారు. బిడ్డకు కూడా వంటినిండ ఆముదపు నూనే బాగా పట్టించి తర్వాత స్నానం చేయిస్తారు. బాలింతకు వారం రోజుల వరుకు మంచి పిండి వంటలు అంటే పాయసం

(లాప్సి) కాడో అనే సుగంధ ద్రవ్యాలతో కూడిన బెల్లంతో తయారు చేసిన తైలాన్ని తాగిస్తారు/తినిపిస్తారు, కారం చాలా రోజుల వరుకు వాడనివ్వరు.

మూడు రోజుల తర్వాత పురుడు పోస్తారు. ఇంటి పెరట్లొ గుంత తవ్వి బాలింత నెత్తి మీద నీళ్ళ చెంబు, కొన్ని జొన్నలు నవ ధాన్యాలను బాలింతచే ఇనుప కొడవలితో ఏడు గీతలు గీయించి, నీళ్ళు మరియు నవధాన్యాలు గుంతలో పోయించి పూడ్చివేస్తారు. అలా చేస్తే బిడ్డకు తల్లికి ఎటువంటి హాని జరుగదని వారి విశ్వాసం. బిడ్డను నిద్రపుచ్చేటప్పుడు కాళ్ళ క్రింద గాని తల క్రిందగాని ఇనుప వస్తువులను ఉంచుతారు. దీనికి కారణం ఎటువంటి దుష్టశక్తులు తమ వద్దరావని వీరి నమ్మకం. బాలింతకు నెల రోజుల వరకు మంచి పత్యాన్ని చేయిస్తారు. ఆకు కూరలు, పాలు, మాంసం, పప్పు మొదలగు వాటిని తినిపిస్తారు. బిడ్డకు బొడ్డు చుట్టూవాతలు పెడతారు. పచ్చబొట్టు ముగ్గులు పొడిపిస్తారు"[6].

పండుగలు - జాతరలు :

"బంజారాలు (లంబాడీలు) ఆంధ్రప్రదేశ్‌లోని తెలంగాణా ప్రాంతంలో ఎక్కువగా నివసిస్తున్నారు. మహబూబ్‌నగర్, ఖమ్మం, వరంగల్, నల్గొండ, రంగారెడ్డి, మెదక్, మొదలగు జిల్లాలో ఎక్కువగా కేంద్రీకృతమైవున్నారు. వీరు చేసుకునే పండుగలు, జాతరలు, ఉత్సావాలలో నృత్యం గమ్మత్తుగా ఉంటుంది. మగవారు డప్పుకొడుతుంటే ఆడవారు నృత్యం చేస్తూవుంటారు. కొన్ని సందర్భాలలో ఆడ మగవారు ఇరువురు కలిసి నృత్యం చేస్తారు.

వీరు ముఖ్యంగా హోలీ పండుగను అత్యంత వైభవంగా జరుపుకుంటారు. వీరు వీధులలో డప్పుకొట్టుకుంటూనృత్యం చేస్తూ హోలీ మామూళ్ళు ఇతరుల నుండి వసూలు చేస్తారు. అలా సేకరించిన డబ్బుతో పండుగను జరుపుకుంటారు. వీరు హోలితో పాటు దసరా, దీపావళి, సంక్రాంతి, శివరాత్రి మొదలగు హిందూవుల పండుగలు కూడ చేసుకుంటారు. వీరు ఇంక కొన్ని ప్రత్యేకమైన బంజారాల పండుగలను చేస్తారు. వీరు ముఖ్యంగా బాలాజీ స్వామి పూజ చేస్తారు. ప్రకృతి శక్తులతో పాటు సృష్టికర్తకు

పూజచేస్తారు. శక్తి దేవతలను కొలుస్తారు. జంతు బలులు ఇస్తారు. వీరు ముఖ్యంగా తమ పశువులను కాపాడుటకు సీతలా అనే దాటుడు పండుగను చేస్తారు. ఈ పండుగ ఆషాఢ మాసంలో జరుపుకుంటారు. అదే విధంగా తీజ్ అనే బతుకమ్మ పండుగను జరుపుకుంటారు.

బంజారాలు తమ కుల యిష్టదైవము అయిన తుల్జాభవానిని పూజించి జంతు బలులు ఇస్తారు. వీటితో పాటు మేరమ్మ కంకాళీ మైసమ్మ వంటి పండుగలు జరుపుకుంటారు. మేరమ్మ పండుగను ఎండాకాలంలో మంగళవారంనాడు జంతు బలితో జరుపుకుంటారు. వీరు విష్ణువు, రాముడు, కృష్ణుడు, వెంకటేశ్వర స్వామి పూజలు నిర్వహిస్తారు. వాన కాలంలో బంజారాలు తీజ్ (బతుకమ్మ) అనే పండుగను పెండ్లికాని అమ్మాయిలు 9 రోజుల వరకు జరుపుకుంటారు. ఈ పండుగను అమ్మాయిలు చాల భక్తి శ్రద్ధలతో చేస్తారు. తాండాలో జరిగే అన్ని పండుగలు వివాహాలు జాతరలు మంచి చెడులు తాండా నాయకుని ఆధ్వర్యంలో జరుగుతాయి"[7].

వస్త్రధారణ – ఆభరణాలు

ఆడవారు ధరించే వస్త్రాలు :

"సాధారణంగా బంజారా స్త్రీలు తమ బట్టలను తామే స్వయంగా తయారు చేసుకుంటారు. వీరే చేతి పనితో రంగు రంగుల దారాలు చిన్న చిన్న అద్దాలు పెద్ద అద్దాలు వీటిని ఆర్సి అని అంటారు. అదేవిధంగా లాల్డీ అనే చిన్న చిన్న రంగు రంగుల పూసలతో రకరకాల పూలు వేస్తారు. స్త్రీలు తాము తొడిగే లంగాను ఫేటియా అని అంటారు. దీనిని కుచ్చులు కుచ్చులుగా వచ్చే విధంగా నడుము దగ్గర లేపోతో జోడించి కుడుతారు. లేపా పైన చిన్న చిన్న అద్దాలు, రంగు రంగుల దారాలు, చిన్న పూసలు, దారంతో చిన్న చిన్న పూలు వేసి ఆకర్షణీయంగా ఉండే విధంగా తయారు చేస్తారు. దీనిని తయారు చేయటానికి 15 రోజులు పడుతుంది. తర్వాత కాళీ అనే రవికను తయారు చేస్తారు. ఇది పూర్తిగా కాకుండా స్త్రీ స్తనాలు చేతులు, కడుపు భాగం వరకు కప్పే విధంగా తయారు చేస్తారు. వెనుక

భాగం ఖాళీగా ఉంచుతారు. పైన కింద రెండు దారాలతో కట్టుకుంటారు. రవికకు రెండు చేతులకు ఖవ్వా ను అద్దాలతోను వెండి మువ్వలతోను చక్కగా తయారు చేసి జోడిస్తారు.

తలపై ముసుగుగా కప్పుకునేందుకు స్త్రీలు టుక్రీ అనే ఎర్రటి బట్టను వాడుతారు. దానికి కింది అంచు, పై అంచుకు పాటో అనే పట్టిని జోడిస్తారు. అది తలపై నుండి జారిపోకుండా ఉండేందుకు ఘుంటొను పెద్ద అద్దాలు రంగు రంగుల దారాలతో ఎంబ్రాయిడరీ చేసి ముందు వైపు వెండి మువ్వలు (ఘుగర) జోడిస్తారు. ఇది చాల అందంగా కనబడుతుంది"[8].

ఆడవారు ధరించే ఆభరణాలు :

"స్రీలు సాధారణంగా తలలోని వెంట్రుకలను రెండు భాగాలుగా జడలాగా వేసుకొని వాటికి వెండితో తయారు చేసిన ఘుగరి మరియు టోపలి అనే చెంపకు రెండు వైపుల పెద్ద మువ్వలను ధరిస్తారు. వెంట్రుకలు పక్కకు రాకుండ ఉండేందుకు పక్క పిన్నులను వెండితో తయారు చేసిన వాటిని వాడుతారు. టోపలి మరియు ఘుగ్రిని కలిపి చోట్ల అని అంటారు. తర్వాత మెడలో రూపాయి బిళ్ళలతో తయారు చేసిన హారాన్ని ధరిస్తారు. అదేవిధంగా వెండితో తయారు చేసిన హంసలి అనే వెండి కడియాన్ని, ముక్కుకు భూరియా అనే ముక్కు పుడకను ధరిస్తారు. చేతులకు బాజుభంద్ (వెండి కడియాలు) చెవులకు కన్య చేతి వ్రేలుకు ఛల్లా అనే ఉంగరాలు, కాళ్ళకు వాంకడి, కొల్డ (కడియాలు) కస్సె(పట్టీలు) గర్త్తణి అంకుతల (మెట్టెలు) చటికి మొదలగు వాటిని ధరిస్తారు. ఇవన్ని ధరించే సరికి బంజారా స్త్రీలు అందంగా ఆకర్షణీయంగా కనబడుతారు. బలియా అనే దంతపు గాజులను రెండు చేతులకు పైనుండి క్రింది వరకు నిండుగా తొడుగుతారు"[9]

మగవారు ధరించే వస్త్రాలు – ఆభరణాలు :

"బంజారాలలో పురుషులు చిన్న జాంగియా అనే నెక్కరు, జగలా అనే అంగీ రుమాల్ అనే తలపాగా ధోతి తువ్వాలాలు ధరిస్తారు. చేతులకు వెండి కడియాలు, నడుముకు కొణధరో అనే వెండి మొల త్రాడు, చెవులకు

రింగులు ధరిస్తారు. దాదాపు లంబాడాలు తలపాగాకు ఎర్రటి, నీలి రంగు అందులో తెల్లటి చారలుగల తల పాగా (రుమాళ్ళు)ను వాడుతారు. బంజారాల (లంబాడీలు) స్త్రీ పురుషులను సులభంగా గుర్తుపట్టవచ్చు."[10]

జాంగడ్ (పెంపుడు కుమారుడు లేదా కుమార్తె) :

"బంజారాలలో కొంత మందికి సంతానం లేని వారు వారిలో పుట్టిన బిడ్డను కాకుండా, బంజారేతరుల బిడ్డలను పెంచి పోషించుకుంటే అటువంటి వారిని (జాంగడ్) పెంపుడు కుమారుడు అని అంటాడు. ఈ పెంపుడు కుమారునితో గాని కుమార్తెతో గాని బంజారాల పిల్లలతో వివాహం చేయరు. అదే సంతతికి (జాంగడ్) చెందిన వారితో వివాహలు జరిపిస్తారు.

ఈ విధంగా ఏడు తరాల వరకు జాంగడ్ చెందిన వారితో వివాహలు జరిపిస్తారు. ఏడు తరాల వరకు వీరిని (జాంగడ్) బంజారాల సమాజంలో కల్పుకోరు. ఏడు తరాల తర్వాత తాండా నాయకుల సమక్షంలో చుట్టు ప్రక్కల ఉన్న తాండా నాయకులందరిని పిలిచి విందు కార్యం ఏర్పాటు చేసి తాండా నాయకులంత తిని, ఎంగిలి చేసిన భోజనాన్ని జాంగడ్ వారికి తినిపిస్తారు. ఈ రోజు నుండి జాంగడ్ అని ఎవరు పిలువకూడదు. అలా పిలిస్తే వారు శిక్షార్హులు అని ప్రకటన చేస్తారు. ఈ విధంగా ఏడు తరాల తర్వాత జాంగడ్ (పెంపుడు కుమారులను) బంజారాల సమాజంలో కల్పుకొని బంజారాల పిల్లలను వారితో వివాహాలు జర్పుకుంటారు. ఈ విధంగా బంజారాల సమాజం చాలా కట్టుదిట్టమైన సంస్కృతితో కొనసాగుతూవస్తుంది"[11]

సూచికలు

1. సుగాలి సంస్కృతి - భాషా సాహిత్యాలు డా॥ గోనా నాయక్. యం - పుట. 27.
2. బంజారా చరిత్ర సంస్కృతి ప్రగతి - చిన్యా నాయక్ .బి. - పుట. 10.11

3. ఎ.పి. ట్రైబల్ లైఫ్ – చిన్న వెంకటేశ్వర్లు భూక్యా. – పుట 37.
4. సుగాలి సంస్కృతి భాషా సాహిత్యాలు డా॥ గోనా నాయక్. యం. – పుట. 27,30,31
5. కరీంనగర్ జిల్లా లంబాడీల ఆచార్య వ్యవహారాలు – శంకరయ్య జె. పుట–153, 154.
6. సుగాలి సంస్కృతి – భాషా సాహిత్యాలు డా॥ గోనా నాయక్ యం. పుట – 47,48.
7. బంజారా చరిత్ర సంస్కృతి –ప్రగతి:–చిన్యానాయక్ బి. –పుట – 17.
8. కరీంనగర్ జిల్లా లంబాడీల ఆచార్య వ్యవహారాలు – శంకరయ్య. జనపాల– పుట, –81 నుండి81 వరకు
9. బంజారా చరిత్ర సంస్కృతి ప్రగతి – చిన్యానాయక్.బి. –పుట–210 నుండి 239 వరకు
10. బంజారా చరిత్ర సంస్కృతి – ప్రగతి – చిన్యానాయక్ బి. పుట 14,15,20
11. సుగాలి సంస్కృతి – భాషా సాహిత్యాలు డా॥ గోనా నాయక్. యం.పుట –60,61,62
- లావుద్యా లచ్యా, వయస్సు: 80 సంవత్సరములు, అజ్మీర తాండా. నూతనకల్ మండలము, నల్లగొండ జిల్లా, సేకరణ మౌఖికం
- గుగులోతు తేజ్య – వయస్సు 80 సంవత్సరాలు, సోమ్లా తాండా, నూతనకల్ మండలము, నల్లగొండ జిల్లా, సేకరణ మౌఖికం
- అజ్మీర చంద్రిబాయి, వయస్సు : 60 సంవత్సరాలు అజ్మీర తాండా నూతనకల్ మండలము, నల్లగొండ జిల్లా, సేకరణ మౌఖికం.

III. బంజారాల

వివాహ ఆచార పద్ధతులు

బంజారాల వివాహ ఆచార పద్ధతులు

బంజారాల సంబంధాల ఏర్పాటు (సగాయి)

"ఏ వివాహ వ్యవస్థలోనైన నిశ్చితార్థం ముఖ్యం. అలాగే బంజారాల వివాహాలలో మొట్ట మొదటి ఘట్టం సంబంధాల ఏర్పాటు. బంజారాలలో ప్రధానంగా నాల్గుగోత్ర నామాలు గలవు. వీరు పమార్, రాథోడ్, చౌహాన్, వడిత్యా అనేవి. తమ మాతృ గోత్రమైన వారు వేరే గోత్రం వారికి ఇచ్చు పుచ్చుకునే ఆచారం గలదు. బంజారాలు తమ వంశ వృక్ష మైన గోత్రంలోని పిల్లలను కాకుండా వేరే గోత్రాల వారిని వివాహం చేసుకుంటారు. అనగా పమార్ వారు, పమార్ వారిని చేసుకోరు. వేరే చౌహన్, రాథోడ్ వడిత్యా వారి పిల్లలను వివాహం చేసుకుంటారు. అదే విధంగా చౌహాన్ వారు చౌహాన్ నేతరులను పమార్ రాథోడ్ వారిని, అదే విధంగా రాథోడ్ వడిత్యా వారు పమార్, వడిత్యా, చౌహాన్ వారిని అలాగే వడిత్యావారు పమార్, రాథోడ్, చౌహాన్ వారిని వివాహం చేసుకునే కట్టు దిట్టమైన సంప్రదాయం బంజారాలలో యిప్పటికి చెక్కు చెదరకుండా ఉన్నది. వీరు తమ బంధుమిత్రుల సహాయ సహకారాలతో వధూవరులను వెతుక్కోని అమ్మాయి తండ్రి తన బంధువులను వెంట పెట్టుకొని మంచి రోజునాడు బాలాజీ భగవాన్‌కు పూజ చేసుకొని సంబంధం ఏర్పాటుకు అబ్బాయి వారి ఇంటికి వెళ్ళుతారు.

బంజారాలు తమ యుక్త వయస్సు వచ్చిన పిల్లలకు వివాహం చేయాలని నిర్ణయించుకున్నప్పుడు వేరే గోత్రీకుల ఇంటికి అబ్బాయివారు గాని, అమ్మాయివారు గాని వెళ్ళి మంచి చెడులు, కట్నకానుకల గురించి

మాట్లాడుకుంటారు. ఆ తాండా ఈ తాండా పెద్ద మనుషులు అందరు కలిసి ఊరికి బయట ఒక ప్రదేశంలో గుమిగూడి వివాహ సంబంధం ఏర్పర్చుకుంటారు. దీనినే సగాయి (పెండ్లి సంబంధం) అని అంటారు. దీనినే వీరు గోళ్ ఖాయెరొ నొక్తా అని అంటారు. ఈలాంటి సమయంలో అమ్మాయి వారు, అబ్బాయివారు తమాషాగా పసుపు కుంకుమను నూనెలో కలిపి రంగులు పూసుకుంటారు. వీరు వారు చలోక్తులతో మాట్లాడుకుంటారు.

అబ్బాయి వారింటికి వెళ్ళిన తర్వాత ఆ తాండా నాయకుని అధ్వర్యంలో కట్నకానుకలు మాట్లాడుకుని తాండా బయట తాండా జనం, బంధు మిత్రులందరు మర్రి చెట్టు క్రింద వలయాకారంగా కూర్చొని బెల్లం తెచ్చి కల్లు సారా అందరికి అందిస్తారు. ఈ శుభ సందర్భంలో అందరి నోళ్ళు తీపిగా ఉంచుటకు మొదటగా బాలాజీ భగవాన్ గురు పేరు మీదుగా కొబ్బరి కాయను తీసుకొని మంగలివాడు వలయాకారంగా కూర్చున్న పెద్దలదరికి, 'నారళ్‌లో నారళ్'లో అని అందరి చేత ఆ కొబ్బరి కాయను తాకిస్తారు. ఆ కొబ్బరి కాయను చివరగా కొడుతారు. ఆ తర్వాత రూపాయి బిళ్ళను తీసుకొని 'సాక్‌లో సాకలో' అని అందరి సాక్ష్యంగా రూపాయి బిళ్ళను అబ్బాయివారికి ఒక్కటి, అమ్మాయి వారికి ఒక్కటి చెరొక బిళ్ళను అందిస్తారు. ఈ సంబంధానికి ఈ రూపాయి బిళ్ళయే సాక్ష్యమని భావిస్తారు. ఆ తర్వాత మంగలివాడు తన దగ్గర ఉన్న అద్దాని తీసుకొని అందరు ముఖం చూసుకునే విధంగా చుట్టు తిప్పుతూ తాండా నాయకుని అందిస్తారు. బెల్లం పంచి అందరిని పలకరిస్తారు. అమ్మాయి, అబ్బాయి వారికి కొన్ని బంజారాల గత చరిత్రను గుర్తు చేస్తారు. ఈ విధంగా బెల్లం తీపి కార్యం అయిన తర్వాత అమ్మాయివారు అబ్బాయి తల్లికి బట్టలు సొమ్ములు ఇచ్చేది ఖరారు చేస్తారు. తర్వాత అబ్బాయి వారు అమ్మాయివారికి నాల్గు కోడెదూడలను ఇచ్చే సంప్రదాయం ఉన్నది. దీనిని "కరార్ –ధరార్" అంటారు. అలా కోడెలు లేని పక్షంలో వాటి ఖరీదు కట్టిస్తారు.

ఏ కారణం చేత సంబంధం నచ్చకపొతే అబ్బాయివారు, అమ్మాయి వారికిచ్చిన రూపాయి బిళ్ళ సాక్ష్యాన్ని మంగలివానితో పంపిస్తారు. అలాగే అమ్మాయివారు అబ్బాయి వారికి ఇచ్చి పంపిస్తారు. ఇలా ఇరువురికి జరిమానగా 'ఘుంటేర్ పచ్చిస్ అనగా' 25 రూపాయాల జరిమాన గాను, సాక్యార్ సాట్ అనగా 60 రూపాయలను జరిమానగా యిరువురిలో ఎవరిది తప్పుఅయితే వారు చెల్లించే ఆచారం బంజారాలలో కనబడుతుంది"[1]

పురోహితుడు లేకపోవుట :

"బంజారాల వివాహ వ్యవస్థలో పెళ్ళి జరుపుటకు పురోహితుడు ఉండడు. వీరి వివాహ సందర్భాల్లోగాని, ఏదైన దైవ పూజలలోగా వీరు ప్రత్యేకంగా హిందువుల్లాగా పురోహింతుడిని పిలువరు. వీరిలోనే తాండాలోగాని ప్రక్క తాండాలలో గాని ఉన్న గోర్ పురోహితుడు ఉంటాడు. ఇతనినే భగత్ అని బావ (పూజారి) అని పిలుస్తారు. ఇతడు లేకపోతే తాండా నాయకుడే వివాహ కార్యక్రమాన్ని జరిపిస్తాడు.

కట్న కానుకలు (కరార్ - ధరార్):

బంజారాల్లో ఒకప్పుడు కట్నకానులకు బదులుగా ఆడ పెళ్లివారు, మగ పెళ్లివారికి గుర్రాలు, ఏనుగులు ఇచ్చేవారట. కాని ఇప్పుడు వాటికి బదులు ఎద్దులు, ఆవులు, కట్న రూపంలో ఇస్తారు. అలా ఎద్దులు, ఆవులు లేనివారు వాటిని ఖరీదు (ధరను) కట్టిస్తారు. దీనినే కరార్, ధరార్ అని వ్యవహరిస్తారు. ఇది బంజారాల వివాహాల్లో చాల ముఖ్యమైన ఘట్టం.

కరార్ అనగా ఒప్పందం. ఈ ఒప్పందం ప్రకారం ఆడపెళ్ళి వారు తమ అమ్మాయికి నాలుగు ఆవులను లేదా ఎద్దులను ఇచ్చేందుకు అంగికరిస్తారు. దీనిని కరార్ (ఒప్పందం) అని అంటారు.

ధరార్ అనగా ధర (విలువ, ఖరీదు) అని అంటారు. ఈ ఖరీదును డబ్బు రూపంలో చెల్లిస్తారు. ఆడ పెళ్ళి వారి దగ్గర ఆవులు ఎద్దులు లేకుంటే వాటి ఖరీదును చెల్లిస్తారు"[2]

అలంకరణలు : (పెళ్ళి కుమారుడు)

"పెండ్లి కుమారునికి చొక్కా, ధోవతి ఎర్ర రుమాలు ఖొళ్ అనే ఎర్రటి దుప్పటి, భుజం మీద కఠారి (కత్తి) ధరింపచేస్తారు. భుజానికి కొతళా (సంచి) అనే దానిని బంజారా స్త్రీలు రంగు రంగుల దారాలతో తయారు చేస్తారు. రెండు చేతులకు వెండి కడియాలు, చెవులకు వెండి కమ్మలు, కొణదరో అనే మొల త్రాడును నడుంకు, భుజం మీద ఎర్రటి శాలువను కప్పుతారు.

పెండ్లి కొడుకు ఎప్పుడైతే ఆడ పిల్ల వారి ఇంటికి రాగానే అమ్మాయి తమ ఇల్లు వదలి తమ బంధువుల ఇంట్లోనే ఉంటుంది. ఆ సమయంలో అమ్మాయి తన కాళ్ళకు మోకాలు వరకు తాండాలో ఉన్న అందరి అమ్మాయిల గజ్జెలను తెచ్చి కట్టుకుంటుంది. తాను పెళ్లి అయ్యేంత వరకు ముసుగును ధరిస్తుంది. ముసుగు జారిపోకుండా ఉండేందుకు గజ్జెలతో తయారు చేసిన తితరి అనే అద్దాలతో తయారు చేసిన దానిని కుట్టుకుంటారు.

పెళ్ళి కొడుకు దుప్పటి కప్పుకోవడం

దీనినే బంజారా భాషలో ఖ్వాళ్ ఓడేరొ నొక్తా అని అంటారు. అనగా దుప్పటి కప్పుకోవటం. ఈ కార్యక్రమం పెళ్ళి కొడుకు వారి ఇంట్లో వదాయి లేదా సాడి తాణేరొ అనే కార్యం ఉంటుంది. వదాయి రోజు అనగా మగ పెళ్ళి వారి ఇంట్లో విందు భోజనం రోజు దుప్పటి కప్పిస్తారు. ఈ దుప్పటి దాదాపు 12 మూరల వరకు పొడవుగా ఎర్రగా ఉంటుంది. దీనిని పెద్దలందరూ కలిసి మడత పెట్టి పెళ్ళి కొడుకుకు పై నుండి క్రింది వరకు తన శరీరాన్ని ఇతరులకు కనబడకుండ కప్పుతారు. తలకు ఎర్రటి తలపాగాను భుజం మీద ఖడ్గము, చంకలో సంచి దీనినే కొతలో అని అంటారు వీటిని ధరింపచేస్తారు. ఈ దుప్పటిని తాండా నుండి వేతడు (పెళ్ళి కొడకు) ఆడ

పెళ్ళి వారింటికి పోయే ముందు కప్పిస్తారు. దీనిని తాండాలోని నాయకులు నలుగురు పట్టుకొని అందులో ఒక రూపాయి బిళ్ళను వేస్తారు. అది దొర్లుతూ పొర్లుతూ చివరగా బొమ్మ బొరుసు చూసి, అప్పుడు పెళ్ళి కొడుకును అమ్మాయి వారి ఇంటికి పంపిస్తారు.

పెళ్ళి కొడుకు తన తల్లిదండ్రులను బంధువులను కౌగిలించుకొని ఏడుస్తాడు. ఎందుకంటే ఆడ పిల్ల తల్లి దండ్రులు ఏలాంటి వారో, తాండా వారు ఏలాంటి వారో, తాండా నాయకుడు ఏలాంటి వాడో తాండా ఎక్కడ వుందో అక్కడ ఎన్ని రోజులు గడపాలో ఇవన్ని తలచుకొని భయంతో ఏడుస్తాడు

మగపెళ్ళివారు అమ్మాయివారి తాండాకు సమీపంలో వచ్చి నిలబడతారు. అప్పుడు తాండా నాయకునికి కబురు పంపుతారు. తాండా నాయకుని అనుమతితో తాండాలో ప్రవేశించి, ముందుగా తాండా నాయకుని ఇంటికి వెళ్ళి తమ నమస్కారాన్ని రాం రాం అని శ్రీరాముని పేరు మీదగా పలకరిస్తారు. వారు కూడా రాం రాం అని చెప్పి, క్షేమ సమాచారాన్ని అడిగి తెలుసుకుని కంచు చెంబులో మంచి నీళ్ళు ఇస్తారు. తర్వాత ఈతాకులతో అల్లిన చాపపై కూర్చో బెడతారు. తర్వాత తాండా నాయకుడు ఆడ పెళ్ళి వారికి కబురు పంపుతాడు. తాండా నాయకుని సమక్షంలో పెళ్ళి కొడుకుని పెళ్ళి కుమార్తె వారి ఇంటికి తీసుకుపోతారు.

వరుడు ప్రతి రోజు పెళ్ళి ప్రారంభం నుండి పెళ్ళి చివరి వరకు తమ ఇంటికి చేరే వరకు దుప్పటిని ముసుగుగా (ఘుంటో) కప్పుకొని నిండుగా ఉండాలి. కొత్త పెళ్ళి కొడుకు (వేతడు) ప్రతి రోజు తాండా నాయకునికి ఉదయాన్నే ఆకు వక్కలతో హుక్కాను తన రెండు చేతులతో నమస్కరించి అందించాలి. అప్పుడు నాయక్ సంతృప్తి చెందకపోతే తోడి పెళ్ళి కొడుకు (లేరియా)తో పెళ్ళి కొడుకుకు మంచి సంప్రదాయాన్ని పాటించమని చెప్పి పంపుతారు"[3]

పెళ్ళి విందు – (వదాయి) :

"వదాయి అనగా వడుగు అని అర్థం. ఈ కార్యం బంజారాలలో పెళ్ళి కుమారుని ఇంట్లో చేసే కార్యమిది. ఇది పెళ్ళికి శుభ ముహుర్తంగా ఆదివారం రోజు అబ్బాయి వారి ఇంట్లో జరిగే కార్యం. ఈ కార్యం తాండా నాయకుని ఆధ్వర్యంలో జరుగుతుంది. బంధుమిత్రుల సమక్షంలో తాండా వారి సమక్షంలో గోసాయి బాబా సాక్షిగా ఈ కార్యాన్ని నిర్వహిస్తారు. పెళ్ళి కుమారునికి, స్నానం చేయించి రాత్రి వేళలో ఒక సూదిని తీసుకొని మోదుగు కాడాకు గుచ్చి దీపం మీద బాగా ఎర్రగా కాల్చి పెళ్ళి కుమారునికి ఎడమ భుజంపై ఒక వాత పెడుతారు. తర్వాత పెళ్ళి కుమారుని తమ్ముడికి కూడా ఈ వాత పెడుతారు. ఒక వేళ పెళ్ళి కుమారుడికి తమ్ముళ్ళు లేకుంటే ఒక ఓక్రా పెడుతారు. ఓక్రా అనగా గోనె సంచి అందులో ధాన్యాన్ని ఉంచి ఆ ధాన్యపు బస్తాకు వాత పెడతారు. వదాయి కార్యం ధేమా గురువు అయిన బంజారాల ధనవంతుని తలచుకొని, అతను నియమించిన గోసాయి బాబాను (మంత్రి) స్మరించుకొని ఈ వాత పెడతారు. ఈ వాత పెట్టేటప్పుడు గోసాయి బాబా మంత్రాన్ని చదువుతారు.

ఈ వాత పెట్టె ముందు తాండాలోని ప్రజలందరి సమక్షంలో గోసాయి బాబా మంత్రం క్రింది విధంగా ఎడుసార్లు చదివి వాత కార్యం నిర్వహిస్తారు.

'కోళిఆవా – కోళిజావ
ధోళోఘెడో – హంసలో
కోతలి – కటార్ ఛ
తల్లి అతర – ధాల్ ఛ
ముంగే అతర– వేర్ఛ
గోసాయి బాబా – సదా సదార్" అని చదువుతారు.

తాత్పర్యం : నీవు ఈ రోజు నుండి ఆహారం కొరకు ప్రయాస పడవద్దు. తెల్లటి గుర్రమనే నీ కోరికల మనసుకు కళ్ళెం వేస్తున్నాం. నీ చేతిలో ఖడ్గం పెడుతున్నాం. ఇప్పుడు నీవు రాజువు. యుద్ధం

వస్తే దానిని పెసర గింజగాను, నువ్వుల గింజలాగా భావించి, ఈ సూదితో వేసిన వాతకన్నా చురుకుగా ఉండాలి. నీ కర్తవ్యం నీవు నిర్వర్తించు, గోసాయిబాబా నిన్ను సదా రక్షించుకుంటాడు. అని మంత్రం చదువుతు వాతలు పెడతారు. ఇది బంజారాల్లో ధర్మదీక్ష కార్యం. ఈ కార్యక్రమం లేకుంటే మగాడు వివాహ యోగ్యుడు కాడు.

తాండా నాయకుడు పెండ్లి కుమారునికి అతని తమ్మునికి వాతలు పెడుతారు. ఒక వేళ పెండ్లి కుమారుడికి తమ్ముడు లేకపోతే గోనే సంచికి వాతలు పెడతారు. పెండ్లి కుమారుని తమ్ముడికి ఒక సారి వాత పెడితే తిరిగి అతని పెళ్లికి వాత పెట్టరు. ఇలా పెట్టుటకు గల కారణం మోసగించి వేరే వివాహం చేసుకోకూడదని ఈ ఆచారం ద్వారా తెలుస్తుంది.

ఈ గోసాయి బాబా ఎవరు అనగా పూర్వం పమార్, రాఠోడ్, చౌహాన్, వడ్త్యియా అనే బంజారాల నాలుగు గోత్రాల వారందరికి ధన ధాన్యాన్ని యిచ్చే పెద్ద భూస్వామి. పమార్, రాఠోడ్, చౌహాన్ రాజుల దగ్గర నుండి కప్పం వసూలు చేయటానికి గోసాయి బాబాను దేమా గురువు నియమించాడు. ఈ గోసాయిబాబా బంజారాల నుండి కప్పం వసూలు చేసే బాబాగా నియమింప పడ్డాడు. బంజారాలకు అన్ని విధాల చేదోడు వాదోడుగా సహాయ సహకారాలను అందించి, బంజారాల వ్యాపారానికి పరోక్షంగా ప్రోత్సహించిన గురువుగా భావిస్తారు. అతని నామ ధేయాన్నే పెళ్ళికి ముందు అతను రక్షిస్తాడని నమ్మి వారి పేరు మీదుగా వాతలు పెడతారు. దీనినే 'గోసాయి బాబార్ దాగేర్ గీద్' అని అంటారు. బంజారాలు మంత్రం ఏడు సార్లు చదివి చివరిగా చురుకు అంటిస్తారు.

పెళ్ళి కుమారునికి ఎర్రటి బట్టతొ తయారు చేసిన 12 మూరలు కల్గిన దుప్పటి శరీర భాగం మొత్తం కనబడకుండా దుప్పటిని కప్పుతారు. ధోతి, రుమాలు, చొక్కా, చంకకు కొతళో, ఖడ్గం, కటారి దాండీయా, కొన్దరో అనే వెండి మొలత్రాడు చేతులకు వెండి కడియాలు, చెవులకు మర్కి అనే

వెండి పోగులను, మెడలో వెండితో తయారు చేసిన చందర్‌హార్ అనే గొలుసును కంటెను ధరింప చేస్తారు. ఆ తర్వాత పెళ్ళి కుమారుని దుప్పటి వెనుక భాగాన స్వస్తిక్ అనే శుభ ముహూర్తపు బొమ్మను వేస్తారు. ఈ గుర్తును గంధము, పసుపు కుంకుమ ఆముదపు నూనెలో నాల్గింటిని కలిపి చాల మందంగా ఈ గుర్తును పెళ్ళి పెద్దలు దుప్పటి మధ్య భాగంలో వేస్తారు. దీనికి అర్థం ఏమంటే సాధారణంగా బంజారాల వివాహాలలో పురోహితుడు ఉండడు. కుల పెద్ద గాని బావ లేదా భగత్ అనే బాబా ద్వారా వివాహాలు జరిపిస్తారు. బంజారేతరులలో ఈ స్వస్తిక్ గుర్తును శుభ ముహూర్తంగా భావించిన విధంగానే బంజారాలు కూడా చ్వాకోపూరేరో నొక్తా అనగా శుభ ముహూర్తంగా భావిస్తారు. ఈ గుర్తును వేసినప్పటి నుండి పెళ్ళి కార్యక్రమాలు అన్ని శుభంగా జరుగుతాయని వీరి నమ్మకం. పెళ్ళి కుమారునికి అన్ని విధాల రంగుల బట్టలతో అలంకరిస్తారు. దీనినే సాడి కార్యం అని వ్యవహరిస్తారు"[4]

తోడి పెళ్లి కొడుకు (లేరియా) - దూత:

"పెళ్లి కుమారుడు అమ్మాయి వారింటికి వెళ్ళేటప్పుడు అతనితో పాటు ఒక సమర్థుడైన దూతను పంపుతారు. ఇతనే సన్నారుడై వెళ్తాడు. పెళ్లి అయ్యేంత వరకు ఇతనిని తిరిగి రానివ్వరు. ఆడ పెళ్లి వారి తాండాలో ఎన్నో జటిల ప్రశ్నలకు, తమాషాలకు జవాబు ఇవ్వాలి. ఇతనికి అన్ని రకాల యోగ్యత పరీక్షలు అవమానాలు ఉంటాయి. వాటన్నింటిని సమర్థవంతంగా పూర్తి చేయాలి. పెళ్ళి ప్రారంభం నుండి చివరి వరకు పెళ్ళి కుమారునికి తోడుగా ఉండాలి."

బంజారాల వివాహాలలో ముఖ్యంగా ఐదు కార్యక్రమాలు జరుగుతాయి.

అమ్మాయి వారి ఇంట్లో జరిగేవి

1) ఘోటారో నొక్తా అనగా బెల్లం పానకం తయారు చేసే కార్యక్రమం.
2) వాయారొ నొక్తా అనగా? పెళ్లి కార్యక్రమం.
3) చూడేరొ నొక్తా అనగా? ముత్తైదు కార్యక్రమం.

4) గొటేరా నొక్తా అనగా? విందు భోజనము.

5) నవలేరిన్ ఒళాయేరో నొక్తా అనగా? అప్పగింతలు.

పై కార్యక్రమాలన్ని పెళ్ళి కూతురి ఇంట్లో జరుగుతాయి. ఈ కార్యక్రమాలకు అయ్యే ఖర్చులు మొత్తం మగ పెళ్లి వారు భరిస్తారు. ఈ కార్యక్రమాలు దాదాపు రెండు నెలల వరకు పూర్తి అవుతాయి లేదా 15 రోజులలో కూడా పూర్తి చేసుకుంటారు. ఎవరి ఆర్థిక స్థోమతను బట్టి వారు పై కార్యక్రమాలు నిర్వహిస్తారు. అన్ని కార్యక్రమాలు పూర్తి అయ్యేంత వరకు పెళ్లి కొడుకు అమ్మాయి వారి ఇంట్లోనే ఉంటాడు. ఇతనికి ప్రతిరోజు రెండు పూటల స్నానం, మూడు పూటల భోజనం సంతృప్తిగా వడ్డిస్తారు. ప్రతి రోజు పాలు, పెరుగు, పప్పు, నెయ్యి, ఆకు కూరలు, మాంసము, మత్తు పానీయాలు మొదలగు పౌష్టిక ఆహారాన్ని అందిస్తారు. ఈ సమయములో పెళ్లి కొడుకు బాగా లావుగా బలుస్తారు. ప్రతి రోజు కొబ్బరిని నెయ్యిలో నానాపెట్టి అందిస్తారు. బంజారాలు 'రాం, రాం! అనే రెండు సార్లు శ్రీరాముణ్ణి తలచుకొని నమస్కారాలు చేస్తారు"[5].

ఘోటార్ నొక్తా (బెల్లం పానక కార్యం)

"ఈ కార్యక్రమంలో పెండ్లి కొడుకు పెళ్ళి కూతురు ఇద్దరు వేరు వేరుగా, తమ తరపున ఇంటింటికి తిరిగి, ఈ రోజు మా పెళ్ళిలో ఘోటార్ నోక్తా అంటే! పానక కార్యక్రమం ఉన్నది. కావునా అందరూ తప్పకుండా రండి అని పిలుస్తారు. ఈ కార్యక్రమం రాత్రి పూటనే జర్గుతుంది. తాండాలోని పెద్ద మనుషులు, యువతీ యువకులు, తాండా నాయకులు, చిన్న పెద్దలందరూ కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. ఆడవారందరూ కలిసి పెళ్ళి కూతురికి ఏడుపుపాట (ఢావళో) నేర్పిస్తారు. ముత్తైదువలందరు కలిసి ఆట పాటలతో పాటు నృత్యం చేస్తారు. తర్వాత అప్పుడే తెచ్చిన కొత్త కుండలలో తాండా వారందరికి సరిపోయే విధంగా బెల్లం పానకాన్ని తయారు చేసి ఇస్తారు. ఆ సమయంలో బంజారాలు ఒక సామెతను క్రింది విధంగా చెబుతారు.

ఘోటార్ పచార్ (పానకం పలకరింపు)

'ఏ నాయక్ పచారే లాక్, అన్‌పచారే సవాలక్
ఏ నాయక్ చందణేరో సోటాతి, గస్సన్‌కాడే ఘోటా
పచాస్ మాటిన్ సవాసో లోటా వేతుడూ హూబో
అనేతి లో నాయక్ మోటో దలేతీ అని పలకరిస్తారు.

అర్థము : తాండా నాయక్ గారు హూ కొట్టిన వారికి లక్ష నమస్కారాలు గుర్తించిన వారికి లక్షన్నర నమస్కారాలు. ఈ ఘోటాను తయారు చేయటానికి సుగంధ ద్రవ్యాలన్నింటిని చందనపు రోకలి బండతో నూరి చాలా రుచికరంగా బెల్లం పానకాన్ని తయారు చేసి ఉంచినాము. పెళ్ళి కుమారుడు పానకం పంచుటకు సిద్ధంగా ఉన్నాడు. గొప్ప మనస్సుతో ఈ పానకాన్ని తాగి, అందరూ ఆశీర్వదించండి అని పలుకుతారు"[6]

వాయా ఖాందేరో నొక్తా (పెళ్ళి చేయుట):

"ఈ కార్యక్రమము ప్రారంభించిన రోజు పెళ్ళి కొడుకు, లేరియా (దూత) ఇద్దరు కలిసి తాండా వారందరికి ఈ రోజు మా ఇంట్లో శుభకార్యం ఉంది తప్పకుండా రండి అని ఇంటింటికి తిరిగి చెబుతారు. ఆ రోజు ఉదయం కుమ్మరి వారి ఇంటికి వెళ్ళి నాలుగు రకాల కుండలు ఒకటి పెద్దది తర్వాత చిన్నవి ఆ తర్వాత ఇంకా చిన్నవి మరియు నాలుగు రకాల కొల్డీలు (గరిగ ముంతలు) తెమ్మని కుమ్మరి వానికి చెపుతారు. కుమ్మరివాడు రెండు పెద్ద బానాలతో కలిపి మొత్తం నాలుగు వరసలకు సరిపోయే విధంగా కుండలను రంగరించుకుని తీసుకొస్తాడు. తాండాలోని చిన్న పెద్దలందరువచ్చి ఇంటి ముందు ఆవు పేడతో అలికి, ముగ్గులు వేసి ఇంటి ముందు నాలుగు వైపుల నాలుగు గుంజలను పాతి రోకటిని భూమిలో పాతి, నాలుగు కుండలను ఒకదాని మీద ఒకటి పెట్టి అడుగు భాగాన ఒక రూపాయి బిళ్ళను వుంచుతారు. తర్వాత కుండలను కిందికి పడిపోకుండా జిల్లేడు, మోదుగు ఆకులను చుట్టు కుదుతారు. నాలుగు కుండల మధ్య

భాగంలో కాకొటిని అనగా! బంజారాలు రొట్టెలు తయారు చేసేందుకు పూర్వ కాలంలో రొట్టెల పిండి (జొన్న, సజ్జ) కలపడానికి చెక్కతో ప్రత్యేకంగా తయారు చేయించే వారు దీనినే కాకొటి అనేవారు. ఇది వారి సంస్కృతిలో ప్రధానమైనది. ఏ శుభకార్యం జరిగినా దీన్ని వాడేవారు. రాను రాను ఈ పద్ధతి మారిపోయింది. అందరిలాగే వీరు కూడా సిల్వర్, ఇత్తడి, స్టీల్ లాంటి పళ్ళాలు వాడుతున్నారు. దీని ప్రక్కన ఒక రోకటిని పాతి దానికి మెండ్లం అనే అడవి కాయలను తెచ్చి పసువు రాసి వాయారో నొక్తాను కింది విధంగా జర్పిస్తారు"[7]

వాయర్ నొక్తా (పెళ్ళి చేసే కార్యము) :

"బంజారాల వివాహాల్లో వాయ(పెళ్ళి) కార్యానికి చాల ప్రాముఖ్యత గలదు. ఈ కార్యంలో చాలా అంశాలు కలిసి ఉన్నాయి. ఈ కార్యం చేసే ముందు వీరు ఇంటి ముందు ఈ విధంగా వాయ (పెళ్ళి) కార్యక్రమాలను నిర్వహిస్తారు.

బంజారాల వివాహంలో ఇంటి ముందు నాల్గు దిక్కులలో సమానంగా చతురస్త్రాకారంగా నాల్గు మూలాన నాల్గు గుంజలను పాతిస్తారు. ఆ నాల్గు గుంజల మధ్యలో రెండు రొకళ్ళను ఎదురెదురుగా పాతిస్తారు. మొత్తం ఆరు పాదుల్లోను 5 లేదా 10 పైసల బిళ్ళలను వేయిస్తారు. బయట ఉన్న గుంజలకు 3 నుండి 5 కొత్త కుండలను రంగులు వేసి ఆడుగు క్రింది భాగాన కుండలు దొర్ల కుండా చిప్పలను పెట్టిస్తారు. కుండలు కింద పండకుండా ఉండేందుకు జిల్లేడు కొమ్మలను మోదుగు కొమ్మలను చుట్టూంచి, తాడుతో గుంజ చుట్టూ తిప్పి కుండలు పడిపోకుండా ఉంచుతారు. మధ్యలో పాతిన రోకళ్ళకు ఇనుప ఉంగరాలను, మెండ్లం అనే అడవి కాయను, గవ్వలను కడుతారు. ఇవి భూత పిశాచ దుష్ట శక్తుల భారి నుండి తమను కాపాడుతాయని వీరి నమ్మకం. ఎవరైనా మంత్ర తంత్రాలు ప్రయోగిస్తే ఈ నాల్గు పాదులు దాటకుండా బయటనే ఉంటాయని వీరి నమ్మకం. ఆరు బయట బహిరంగంగా స్నానాన్ని నూతన వధూవరులకు

చేయిస్తారు. మామిడాకు తోరణాలు కడుతారు. ఈ ప్రదేశాన్ని ఆవు పేడతో అలికించి ముగ్గులు వేసి రెండు రోకళ్ళ మధ్య కొత్త కుండలలో నీరు నింపి అన్నం ఆరపెట్టుకునే (కాకోటి) చెక్క పళ్ళెంపై వధూవరులకు మంగళ స్నానం చేయిస్తారు. ఈ విధంగా రెండు రోకళ్ళ మధ్యన కొత్త కుండలోని నీళ్ళతో చతురస్త్రాకారంగా 5 కుండలను అమర్చి ఆ ప్రదేశాన్ని రంగ రంగ వైభవంగా తాండాలోని యువతీ యువకులు, నాయకులు బంధుమిత్రులు చిన్నలు, పెద్దలు అందరూ కలిసి ఈ కార్యాన్ని నిర్వహిస్తారు. ఈ కార్యాన్ని నిర్వహించేటప్పుడు బంజారా స్త్రీలు పాటలు పాడుతారు"[8]

అమ్మాయికి మంగళ స్నానం :

"బంజారాలు ఆరు బయట బహిరంగ ప్రదేశంలో మంగళ స్నానానికి అన్ని ఏర్పాట్లు చేస్తారు. నూతన వధూవరులను కొత్త కుండలోని చల్లటి నీటితో పసుపును అమ్మాయి శరీరం మొత్తం పూసి బంజారా స్త్రీలు మంగళ స్నానం చేయిస్తారు. ఇలా మంగళ స్నానం చేయించేటప్పుడు అమ్మాయిని కాకొటి అనే చెక్క పల్లెంపై కూర్చోబెట్టుతారు. స్త్రీలు దుప్పటిని అడ్డంగా పట్టుకొని స్నానం చేయిస్తారు. కొత్త గుడ్డను నల్గురు స్త్రీలు దుప్పటిని అడ్డంగా పట్టుకొని స్నానం చేయిస్తారు. కొత్త గుడ్డను నల్గురు స్త్రీలు అటు ఇటు పట్టుకొని అమ్మాయి తలపై నీళ్ళతో స్నానం చేయిస్తారు. ఈ స్నానాన్ని అమ్మాయికి వదినె వరసైన వారు చేయిస్తారు. పెళ్ళి కూతురు తల్లి అమ్మాయి వెంట్రుకలను వెనుకకు సరి చేసి అందులో నుండి కారే నీటిని నోట్లో పోసుకొని ఉమ్మేస్తుంది. ఇలా ఎందుకు చేస్తారంటే తల్లి ప్రేమానురాగం ఈ విధంగా వ్యక్తమవుతుంది. ఇదేవిధంగా వదినలు కూడా అమ్మాయి వెంట్రుకల నుండి కారే నీటిని త్రాగుతారు. ఈ సమయంలో వదినె మరదళ్ళు అమ్మాయి చిన్ననాటి చిలిపి చేష్టలను గుర్తుచేస్తూ అమ్మాయిని రకరకాలుగా తిడుతూ వివిధ శృంగార గేయాలు పాడుతారు.

అబ్బాయికి మంగళ స్నానం :

అమ్మాయికి స్నానం చేయించిన తర్వాత తాండా నాయకులు పెళ్ళి కుమారునికి మంగళ స్నానానికి ఆహ్వానిస్తారు. బంజారాలు ఈ స్నానం

చేయించే ముందు రెండు కొత్త కుండలను తీసుకొచ్చి రాత్రి అందులో నీళ్ళు పోసి మరుసటి రోజు ఉదయం చల్లని నీరుతో స్నానం చేయిస్తారు. ఎంత చలికాలమైనా సరే చల్లని నీటితోనే స్నానం చేయిస్తారు. ఇలా స్నానానికి వరుడు ఇంట్లో నుండి బయటికి వచ్చేటప్పుడు అబ్బాయి బావమరుదులు, మరదళ్ళు జిల్లేడు కట్టెలతో కొడతారు. వీటినన్నింటిని వరుడు సహించాలి. ఆ దెబ్బలను లెక్క చేయకుండా ధైర్యంగా ముందుకు త్రోసుకుంటూ కాకొటి అనే చెక్క పళ్ళెం వద్దకు వచ్చి స్నానానికి నిలబడాలి. అప్పుడు బావమరుదులు, మరదళ్ళు మట్టి బురదతోను ఆవు పేడతోను సరదాగా వీపున రుద్ది స్నానం చేయిస్తారు. తర్వాత పసుపు గంధంతో మంగళ స్నానం చేయిస్తారు.

ఇలా మంగళ స్నానం చేయించేటప్పుడు అబ్బాయి జుట్టు నుండి కారే నీరును పెళ్ళి కూతురు తల్లి ఏడుసార్లు త్రాగుతుంది. దీనికి అర్థము తల దువ్వుతూ అందులో నుండి కారే నీటిని త్రాగుతూ ఇక నుండి ఓ అల్లుడా నా బిడ్డను నీ చేతిలో పెడుతున్నాను. ఆమెకు ఎన్ని కష్టాలు వచ్చిన నీవే దిక్కు సర్వం నీవే అనే అర్థంతో ఈ కార్యం నిర్వహిస్తారు. అటు తర్వాత రెండు రాళ్ళ తీసుకొని అత్త పెళ్ళి కుమారుని చెవులను పట్టుకొని ఎప్పుడైనా నా బిడ్డ మీదుగా నన్ను తిడుతావా అని ప్రశ్నిస్తుంది. తిట్టను అని అనే వరకు రాళ్ళను అలా అదమి పడుతుంది. ఆ తర్వాత పెళ్ళి కుమారుని మెడలో ధోతిని పెట్టి మెడ భాగానికి రోకలితో రెండు వైపుల కొట్టినట్లు అత్తతో చేయిస్తారు. దీనికి అర్థము ఏమనగా ఎప్పుడైన మా అమ్మాయిని తిట్టేటప్పుడు నీ అమ్మని అని నన్ను తిడుతావా అని ప్రశ్నిస్తూ, జవాబు చెప్పేవరకు పంచెను ఉంచే ఆచారం బంజారాల వివాహంలో కన్పిస్తుంది. ఈ విధంగా పెళ్ళికుమారుని సహనాన్ని పరీక్షిస్తారు.

అదే విధంగా మరదళ్ళు అందరూ కలిసి అబ్బాయికి స్నానం చేయించేటప్పుడు రకరకాల పాటలతో ఎత్తి పొడుస్తూ అవమానపరుస్తూ తిడుతూ పౌరుషం వచ్చే విధంగా పాటలు పాడుతూ చాలా కష్టాలు కల్గిస్తారు. అయినా వాటన్నింటిని తేలికగా గడ్డి పోచతో సమానంగా భావించి ధైర్యంగా

ఉంటాడు. ఆ తర్వాత అబ్బాయి తెలివితేటలను పరీక్షించేందుకు పెళ్ళి పీటపై నిలపెట్టి తన భావమరదులు ఒక చిప్పను చేతిలో పట్టుకొని కాళ్ళ దగ్గర ఏడు సార్లు గీస్తారు. ఈ సమయంలో పెళ్ళి కుమారుడు ఆ చిప్పపై కాలు పెట్టి దాన్ని పగుల కొట్టాలి. ఈ విధంగా తెలివిని పరీక్షిస్తారు. ఆ తర్వాత కొత్త బట్టలు కట్టిస్తారు. అబ్బాయి అమ్మాయిని రోకళ్ళ చుట్టు ఏడు అడుగులు ప్రదక్షిణలు చేయిస్తారు. అగ్నిసాక్షిగా వివాహం జరుగుతుంది. తర్వాత అబ్బాయిని, అమ్మాయిని ఇద్దరిని ఎంగిలి (పెర్గన్నం) తినిపిస్తారు. దీనినే "కొళియా ఖోరా ఏరో" అని అంటారు. తర్వాత అబ్బాయికి, అమ్మాయికి కొత్త బట్టలు వేయించి, ఇద్దరిని ఎదురు ఎదురుగా కూర్చోబెట్టి "మాండా రమేరో" అనగా! ఒక పెద్ద పళ్ళెంలో గంజి పూర్తిగా పోసి అందులో గవ్వలు, రూపాయి బిళ్ళ, ఉంగరం వేసి ఇద్దరి చేత ఆడిస్తారు. ఎవరు ముందుగా అందులో చెయ్యి వేసి పట్టుకుంటారో వారే గెలిచినట్లుగా పందెం పెడతారు. తర్వాత అలాగే కూర్చోపెట్టి ఒక పెద్ద ఇత్తడి పళ్ళెం ప్లేటు తీసుకొచ్చి గంజిలో వేయిస్తారు. అబ్బాయివైపు అమ్మాయి, అమ్మాయి వైపు అబ్బాయి గంజి చిల్లి మీద పడేటట్లు ఆడిస్తారు. తర్వాత స్నానం చేయించి ముగిస్తారు.

మరుసటి రోజు పెళ్లి కొడుకు, పెళ్ళి కూతురు రెట్టకు కట్టిన కసాడా జంధ్యంలాగా కట్టిన ఏడు వరుసల దారాన్ని విప్పి స్నానం చేయిస్తారు. ఆ రాత్రి అబ్బాయిని అమ్మాయిని ఒకే దగ్గర మధ్యలో గోనే సంచివుంచి పడుకోపెడుతారు. మరుసటి రోజు స్నానం చేయిస్తారు. దీనితో ఈ కార్యక్రమం ముగుస్తుంది"[9]

సాత్ ఫేరా ఫెరెరో నొక్తా (ఏడు అడుగులు ప్రదక్షిణ చేయుట)

"అబ్బాయి, అమ్మాయిలను మంగళ స్నానం చేయించిన తర్వాత రెండు రోకళ్ళ చుట్టూ మధ్యలో వీరు స్నానం చేసిన కాకొటి ముందు ఒక హోమగుండాన్ని తీసి, అందులో నవ ధాన్యాలు వేసుకుంటూ తాండా నాయకుడు గాని, భగత్ గాని కొళి అవా కొళి జావ అనే మంత్రం చదువుతూ,

అమ్మాయి చేతిని అబ్బాయి పట్టుకొని ఏడు అడుగులు నడిపిస్తారు. ఇలా అమ్మాయి వెనుకకు అడుగులు వేస్తుంది. అలాంటప్పుడు ఆమెకు సహాయంగా తన వదినలు వెంటవుండి ఏడు అడుగులు వేయిస్తారు. తర్వాత సాడి అనే ఖద్దరు ఎర్రటి రంగు కల్గిన బట్టలను అబ్బాయికి, అమ్మాయికి కట్టిస్తారు. అమ్మాయికి అడ్డ బట్టను కట్టిస్తారు. అబ్బాయికి ఎర్రటి బట్టలో తయారు చేసిన లాగును తొడిగిస్తారు. ఆ తర్వాత పెళ్లి పెద్ద తెల్లటి దారాన్ని తీసుకొని అమ్మాయి చుట్టూఏడు వరుసలు చుట్టించి, ఆ దారాన్ని ఏడు ముడులు వేసి అబ్బాయి మెడలో వేస్తారు. ఆలాగే అమ్మాయి చేత అబ్బాయికి చుట్టు ఏడు వరుసులు దారం చుట్టించి అమ్మాయి మెడలో వేయిస్తారు. ఆ తర్వాత ఎర్రటి గుడ్డలో మెండ్లంకాయ, గవ్వలు, సూదిని వుంచి అబ్బాయి, అమ్మాయి కాళ్ళకు చేతులకు ఖాల్దా అనే తాయెత్తును కట్టిస్తారు. ఇలా ఎందుకు చేస్తారంటే వేరే భూత, పిశాచ, దుష్ట శక్తుల బారి నుండి వేరే వారి దిష్టి తగల కుండా ఉండేందుకు ఈ కార్యం చేయిస్తారు. ఈ ఏడు అడుగులు తిరుగుతున్నప్పుడు తాండా స్త్రీలు పాటలు పాడుతుంటారు. ఇలా బ్రహ్మముళ్లు వేసిన తర్వాత పెళ్ళి పందిరిలో నలు దిక్కున అమర్చిన కుండలను తాండా స్త్రీలు, పిల్లలు, పెద్దలు ఎవరికి వారు కుండలను తీసుకొని తమ ఇళ్ళకు వెళ్ళిపోతారు. ఆ కుండలను అతి పవిత్రంగా భావిస్తారు. ఇలా బ్రహ్మముళ్ళు వేయించి వధూవరులను ఇంట్లో ఇద్దరిని పడుకోపెట్టి మరుసటి రోజు అందరి సమక్షంలో ఈ బ్రహ్మ ముళ్ళను, వధూవరుల చేత దారం తెగకుండ అతి జాగ్రత్తగా అందరి సమక్షంలో విప్పిస్తారు. ఈ విధంగా ఏడు ముళ్ళు కట్టించి విప్పించే ఆచారం బంజారాల వివాహ వ్యవస్థలో కనబడుతుంది. ఈ ఆచారం హిందూ వివాహంలోనూకనిపిస్తుంది. అయితే ఈ పద్ధతి వారిలో ఎందుకు వచ్చిందో ఎవ్వరూ స్పష్టంగా చెప్పలేకపోయారు”[10]

కోళియా ఖోరాయెరో నొక్తా

(వధూవరులకు ఒక చోటనె భోజనము తినిపించే కార్యము)

“నూతన వధూవరులకు ఇద్దరిని అందరి సమక్షంలో జొన్న రొట్టె, బెల్లం, నెయ్యి, కలిపి చేసిన పదార్థాన్ని దీనినే బంజారా భాషలో చూర్మో

అని అంటారు దీన్ని తినిపిస్తారు. దీనినే బంజారాలు "కోళియా ఖాయేరో" అని వ్యవహరిస్తారు. ఈ కార్యాన్ని అమ్మాయి వదినలు చేయిస్తారు. ఒక పళ్ళెంలో చూర్మోను, నెయ్యితో కలిపి ఒక్కొక్క ముద్ద చేసి అబ్బాయి చేత అమ్మాయికి, అమ్మాయి చేత అబ్బాయికి, అబ్బాయి నోట్లో నుండి అమ్మాయికి తినిపిస్తారు. తర్వాత ఒక చెంబులో నీళ్ళు తీసుకొని ఇద్దరితో ఎంగిలి చేయించి ఇద్దరికి త్రాగిస్తారు.

ఈ కార్యం అయిన తర్వాత అబ్బాయి, అమ్మాయిలను ఇంట్లో ఒకే గదిలో పడుకోబెడుతారు. దీనినే బంజారాభాషలో "ఆడియా పాచ సాయేరో" అని అంటారు. అనగా! అబ్బాయి, అమ్మాయిల మధ్య "గూణ్" అనే ధాన్యపు బస్తాను అడ్డంగా ఉంచి ఈ కార్యం చేయిస్తారు. ఈ కార్యం రాత్రి వేళలో అబ్బాయి కొన్ని కొబ్బరి ముక్కలను అమ్మాయికి అందిస్తాడు. ఆమె సిగ్గు పడితే ఆమె పైట కొంగులో బలవంతంగా పడేస్తాడు. అదే రోజు వధూవరులు ఒకే పళ్ళెంలో సామూహికంగా భోజనం చేస్తారు. ఈ విధంగా బంజారాల వివాహంలో నూతన వధూవరులు ఇద్దరూ ఏడు అడుగుల అనుబంధం జన్మాల బంధంగా ఉండాలని, కలకాలం సుఖంగా ఉండాలని వీరి విశ్వాసం"[11]

నుదిటి తిలకం (జాతేర్‌టికో) :

"బంజారాల వివాహాల్లోనూ, బంజారేతరుల వివాహాలలో నుదిటి తిలకానికి చాల ప్రాముఖ్యత గలదు. బంజారేతరులు జీలకర్ర, బెల్లానికి ప్రాధాన్యత ఇస్తారు. వీరు సాన రాతి పై పసుపు చందనాన్ని రుద్ధితీస్తారు. బంజారాల వివాహవ్యస్థలో కంచు పళ్ళానికి చాలా ప్రాముఖ్యతగలదు. ఆ పళ్ళెంలో పసుపు చందనాన్ని భద్ర పరుస్తారు. వధూవరుల ఇళ్ళు నుండి తీసుకొచ్చిన పసుపు చందనాన్ని కలిపి అమ్మాయి అన్నగాని లేదా బావ గాని అమ్మాయి నుదుట చూపుడు వ్రేలుతో పసుపు తిలకాన్ని పెడతారు. అబ్బాయికి కూడా మధ్య వేలుతో బొట్టును పెడతారు. నుదుట తిలకాన్ని పెట్టటంలో ముఖ్య ఉద్దేశ్యం, అమ్మాయి అన్న తన చెల్లెలు నూరేండ్లు పసుపు

కుంకుమతో సౌభాగ్యవతిగా ఉండాలని ఆశీర్వదిస్తారు. ఈ సమయంలో అమ్మాయి తన అన్నను పట్టుకొని ఏడుస్తుంది."[12]

హోకాల్డి ధోకాయేరో (కసువు దిబ్బకు నమస్కారాలు):

"పెళ్ళి కుమారుడు, పెళ్ళి కుమార్తెకు కసుపు దిబ్బ మొక్కిస్తారు. ఆవును అతి పవిత్రంగా భావించే బంజారాలు తమ జీవితంతో ఆవులు ఎంతో ముడి పడి ఉన్నవి. కావున గోలక్ష్మి పూజలు చేయిస్తారు. ఈ పేడ దగ్గరనే ఒకమట్టి చిప్పలో గాజులు, మొలలు, పసుపు, గవ్వలు మొదలైన పూజా ద్రవ్యాలతో కసువు దిబ్బ దగ్గర ఉంచి పూజిస్తారు. దిష్టి దీస్తారు. ఆవు పేడను పూజిస్తారు. ఇలా చేయటంలో గోసంపద ఎక్కువగా అభివృద్ధి చెందాలని వీరి నమ్మకం. బంజారాలకు ఎక్కువ సంఖ్యలో గోవులు ఉంటాయి. వీటి మీదనే పూర్వం గోనె సంచులు వేసి వ్యాపారానికి గోవులను వాహనంగా వాడేవారు. అప్పటి నుండి గోవులను ఎక్కువగా పెంచుతారు. ఇలా గోపూజా అయిన తర్వాత ఇనుప కత్తితో కసువు కుప్ప దగ్గర ఏడు గీతలు గీసి అందులో అమ్మాయి చేత నవ ధాన్యాలు వేయిస్తారు. ఇలా గీతలు గీసి, ధాన్యాలు వేసిన తర్వాత అబ్బాయి, అమ్మాయి వెనక్కు చూడకుండా ముందుకు వెళ్ళి పెళ్ళి పందిరి క్రింద కూర్చో మంటారు. ఆ తర్వాత గవ్వల ఆటను "మాండా రమ్మెరొ" అనే ఆటను పెళ్ళి పెద్దల అందరి సమక్షంలో ఆడిస్తారు"[13]

చోట్టిర్ హోంగోళి (మంగళ స్నానం) :

"చొట్టిర్ హోంగోళీ అనగా మంగళ స్నానం. ఇది పెండ్లి కొడుకుకు బల పరీక్షలాంటిది. దాదాపు రెండు నెలల వరకు అత్త మామల ఇంట్లో పుష్కలంగా తిండి తిన్నవాడు, బలంగా ఉన్నాడా లేదా! సంసారానికి పనకి వస్తాడా సుఖ దు:ఖాలను ఓర్చుకుంటాడా లేదా! సహనం వుందా లేదా అనే పరీక్షలకు గురవుతాడు. ఆడ పెళ్ళివారు వరసకు మరదలు, వదినలు అయినవారు పెండ్లి కుమారునికి బహిరంగంగా ఆరు బయట అందరి సమక్షంలో పసుపు గంధాలతోటి స్నానం చేయిస్తారు.

కాకొటి అనే అన్నం ఆరబెట్టకునే దాని మీద కూర్చోబెట్టి చేయిస్తారు. ఈ సమయంలో అందరు అబ్బాయిని ముందుకు, వెనకకు త్రోసుతారు. వీటన్నింటిని సమర్థవంతంగా పెళ్ళి కొడుకు అనుభవించాలి. ఓపికగా ఎగతాళి కాకుండా తనకు తాను కాపాడుకోవాలి. అప్పుడు పెళ్ళి కొడుకు తల నుండి కారుతున్న నీటి చుక్కలను అత్తగారు తాగుతుంది. తర్వాత తన బిడ్డపేరు మీదుగా తనను తిట్ట వద్దని, బిడ్డను కొట్టవద్దని, ఎప్పుడు ఎలాంటి బాధలకు గురి చేయకూడదని అత్త, అల్లుడికి రోకలి బండతో కొడుతానని చెప్పుతుంది. ప్రమాణం చేయించుకుంటుంది. మరదళ్ళు బావ మరుదులు అందరు కలిసి పెళ్ళి కుమారునికి అనేక ఇబ్బందులు కలగచేస్తారు."[14]

పెండ్లి కుమారుడు పాటించ వలసిన నియమాలు :

"1. పెళ్ళి ప్రారంభం నుండి చివరి వరకు తల ఎత్తి తిరుగరాదు. తల మీద ఎర్రటి శాలువా ముసుగుగా ఎప్పుడూ వేసుకోవాలి.

2. ఎవ్వరితోను గట్టిగా మాట్లాడ కూడదు. తక్కువగా మాట్లాడాలి.

3. ఒంటరిగా ఎక్కడ తిరగరాదు. ఎక్కడికైన పోవాలంటే లేరియా దూతను గాని తన బావమరదులను వెంట తీసుకెళ్ళాలి.

4. తాండాలోని ప్రతి ఒక్కరి యందు వినయ విధేయంగా ఉండాలి. లేకుంటే తప్పుపడతారు.

5. ఆడపెళ్ళి వారింటికి వచ్చే ప్రతి ఒక్కరికి ఆకులు, వక్కలు ఇవ్వాలి.

6. తాండాలోని ఏ వ్యక్తి అయినా సరే ఆడ పెళ్ళి వారి ఇంటికి వస్తే లేచి నిలబడాలి. ఆ వచ్చిన వ్యక్తి కూర్చో మనేంత వరకు అలాగే నిలబడాలి. లేకుంటే తప్పు పడతారు.

పై కార్యక్రమాలను ఎంతో నేర్పుతో బుద్ధి కుశలతతో నిర్వర్తించాలి.

గోటేరో నొక్తా - (విందు కార్యక్రమం) :

బంజారాల్లో గోటేరో (బలి) నొక్తా విందు కార్యక్రమం చాలా ప్రధానమైనది. ఈ కార్యక్రమం పెళ్ళి చివరి రోజులలో పెళ్ళి కొడుకు, పెళ్ళి

కుమార్తె వారి బంధువులకు తాండా నాయకునికి తాండా ప్రజలకు అందరికి కలిపి విందును ఏర్పాటు చేస్తారు. ఈ విందు తమ పూర్వీకులకు సంతృప్తిని కల్గించుటకు ఉద్దేశించింది. ఇందులో ఒక ధాన్యపు బస్తాను పెట్టి దాని ముందు కొంచెం ఆవు పేడతో అలికి గుండ్రంగా ముగ్గు వేసి అందులో ఒక రూపాయి బిళ్ళను పెట్టి కల్లు సారా పోసి నైవేద్యం పెట్టి గొర్రె పోతు గాని మేకను గాని బలి ఇస్తారు. ఆ మాంసాన్ని వండి తాండా వారికి సామూహికంగా విందు ఏర్పాటు చేస్తారు. విందులో మత్తు పానీయాలు వాడుతారు"[15]

గోట్ కార్యంలో చ్యాకో పూరేర్ (విందు కార్యంలో ముగ్గు వేయుట) :

"బంజారాల వివాహంలో గోట్ అనగా విందు అని అర్థం. ఈ విందు కార్యానికి అయ్యే ఖర్చు మగపెళ్ళివారు భరిస్తారు. తాండాలోని నాయకుని ఆధ్వర్యంలో ఈ కార్యం అమ్మాయి వారి ఇంట్లో జరుగుతుంది. ఈ కార్యం చేసేటప్పుడు తాండా వారందరికి ఈ విందును ఏర్పాటు చేస్తారు. ఈ కార్యంలో అమ్మాయి వారి ఇంటి ముందు ఆవు పేడతో అలికి ఒక పీట మీద ధాన్యపు బస్తాను ఉంచి, బస్తా ముందు పిండితో గుద్రంగా ముగ్గును గీస్తారు. దీనినే బంజారులు చ్యాకొ అని వ్యవహరిస్తారు. ఈ ముగ్గులో ఆముదపు నూనే తో చిన్న దీపాన్ని, కల్లు సీసాను, సారాను ఉంచుతారు. దీనిని దేవతలను తృప్తి పర్చటానికి ఇలా చేస్తారు. కాని ఇంక కొంతమంది ఆ ముగ్గు వేసిన తర్వాత వేరే దుష్టశక్తులు మా కార్యానికి ఆటంక పర్చకూడదని కొంత మంది వాదన. ఏది ఏమైనావీరి ఆచారం మాత్రం విచిత్రమైంది. ఈ విధంగా గోట్ కార్యంలో జంతు బలులు ఇస్తారు. మేక, గొర్రెను బలి ఇస్తారు. అలా బలిలో రక్తం, ఉప్పు మరియు చింత పండును కల్పి రక్తం పట్టు కుంటారు. మాంసాన్ని బాగా ఉడికించి, అందులో రక్తం కల్పి "సొళాయి" అనే నల్లను తయారు చేసి వివాహనికి వచ్చిన బంధు మిత్రులు, తాండా నాయకుడు, ప్రజలందరికి సొళాయి పంచుతారు. వీరందరికి సరిపోయే విధంగా కల్లు సారా మత్తు పానీయాలను అందిస్తారు.

తర్వాత బంతిగా కూర్చోపెట్టి అందరికి మోదుగాకు అందించి అందరికి ఈ సొళాయిని పంచుతారు. బంజారాలు సొళాయి లేనిది ఏ కార్యం చేయరు. ఆ తర్వాత అందరికి భోజనం పెట్టి ఈ కార్యన్ని ముగిస్తారు. ఇలా చేయుటకు కారణం ఆడ పెళ్ళి వారు మగ పెళ్ళి వారి ఇంటి కెళ్ళినప్పుడు మార్గమధ్యలో గాలి, పిశాచి, భూత, దుష్ట శక్తులు తొలగిపోతాయని, బలి ద్వారా అవి ఏవి దగ్గరకు రావని వీరి నమ్మకం. ఈ కార్యక్రమానికి అయ్యే మొత్తం ఖర్చు మగపెళ్ళి వారు భరిస్తారు. ఇది తరతరాలుగా వస్తున్న సంప్రదాయం. ఏదైనా శుభకార్యములో ఈ విధంగా సంస్కృతిలో చిన్న పెద్ద, తేడా లేకుండా మాంస మద్యాలను సమానంగా సేవిస్తారు.

హుక్కా వర్తమానం :

ఇది పెళ్ళి కుమారుడు ప్రతి రోజు తాండాలోని పెద్దలందరికి గంట చుట్టను స్వయంగా తానే ఇవ్వాలి. ఆలాంటప్పుడు కింది విధంగా అందరిని ఉద్దేశించి పలకరిస్తారు.

"హెట్ గరి ఉంపర్ థమ్
థమేపర్ అమేరి
అమేరిమా కస్తూరి
కస్తూరిమా లాల్ లో నాయక్ హుక్కా"

అర్థము : గౌరవనీయులైన సభా పెద్దలారా కింది ఇత్తడి డొప్ప పైన స్తంభం దానిపై మట్టి చుంగా అందులో కస్తూరి ఉన్నది. హుక్కా పీల్చి మమ్ములను దీవించండి. అని దీని అర్థము"[16]

ఏడుపు పద్ధతి (మళెరో):

"బంజారాల తాండాలలో ఉండే ముఖ్యమైన పద్ధతి ఏడవటం. ఇది ఇతర జాతుల వారికి వింతగా అనిపించవచ్చు, ఎందుకంటే ఈ ఏడుపు సాంప్రదాయం ఇతర సమాజంలో కూడా ఉంది. పెళ్ళి సంధ్బములో "నాలేరి" అనే పెళ్ళి కూతురుకు, కుల స్త్రీలు అందరు కలిసి మళేరా (ఢావళో) నేర్పిస్తారు.

ఏ సందర్భంలో ఏ విధంగా ఏడవాలో కూడా శిక్షణ ఇస్తారు. తల్లితండ్రులను అన్న తమ్ముళ్ళను, అక్క చెల్లెళ్ళను, తన బంధువులను, ఇరుగు పొరుగు వారిని ఏ విధంగా సంబోధించి ఏడవాలో పాట రూపంలో ఏడుపు పాట నేర్పిస్తారు. ఇది మొదటగా "ఆహీయా" అనే చరణంతో ప్రారంభిస్తారు. ఈ పాట విభిన్న రీతులలో నేర్పిస్తారు. ఈ పాట వీరి సంప్రదాయకంగా, తరతరాలుగా వస్తున్నటువంటి ఆచారం.

పెళ్ళి అయిన స్త్రీలు, తనను పెంచి పోషించిన తల్లిదండ్రులను, తన బంధువులను, తన జన్మ స్థలాన్ని ఉన్నటుండి ఒకేసారి అన్ని బంధాలనుండి దూరం వెళ్ళలేక, తన బాధను దు:ఖాన్ని ఏడ్పు పాట ద్వారా వివరిస్తారు. ఇప్పటికి కూడా వీరిలో ఏడుపు పాటను మరువలేదు"[17]

అన్న భార్యను తమ్ముడు చేసుకోవటం :

"బంజారాల్లో అన్న భార్యను తమ్ముడు వివాహమాడే పద్ధతి ఉంది. అనగా వితంతువు పునర్వివాహాలు అంగీకరిస్తారు. ఏదైన ప్రమాదంలో అన్న చనిపోతే అతని భార్యకు అతని పిల్లలకు తోడుగా ఎవరు ఉంటారని వదినను మరిది పునర్వివాహం చేసుకుంటారు. ముందుగానే వివాహం అయినట్లైతే రెండవ భార్యగా కూడా స్వీకరిస్తారు. వీరిలో కూడా బహు భార్యత్వం ఉన్నది. వదిన వయస్సులో పెద్దదైన సరే ఆమెను వివాహం చేసుకుంటారు. ఒక వేళ తమ్ముడు ప్రమాదంలో చనిపోతే అతని భార్యను కూడా అన్న వివాహం చేసుకుంటాడు. దీనకి కారణం అన్న చనిపోయిన తర్వాత వదిన వయస్సులో ఉండగానే ఆమె ఎక్కడైన ఎవరితోనైన పరాయి మగవాడితో అక్రమ సంబంధం పెట్టుకుంటుందేనమోనని భావించి వదినను వివాహమాడుతారు. ఒక వేళ అలాపునర్వివాహలు చేసుకోకపోతే ఆమె ఎవరితోనైన అక్రమ సంబంధం పెట్టుకుంటే తాండాలోని మిగిలినావారు హేళన చేస్తారు. అందుకే ఈ పద్ధతి ఇష్టం ఉన్నా, లేకున్నా పునర్వివాహాలు చేసుకుంటారు. భార్య చనిపోతే ఆమె చెల్లెల్ని వివాహ మాడే పద్ధతి, అన్న చనిపోతే వదినను చేసుకునే ఆచారం అనాది కాలంగా వీరిలో సంప్రదాయంగా వస్తున్నది"[8]

ఇల్లరికము (ఘర్ జమాయి) :

బంజారాల్లో కూడా ఇల్లరికం పద్ధతి ఉన్నది. ఈ ఇల్లరికం మూడు రకాలుగా వుంటుంది.

1) కొడుకులు పుట్టకుండా ఆడ పిల్లలే జన్మిస్తే, ఆడ కూతురు వారు తమకు ముసలితనంలో ఆలనా పాలనాచూసుకోవటానికి తమ ఆస్తినంతా అల్లుడి పేరు మీద రాసి ఇచ్చి ఇల్లరికం తెచ్చుకుంటారు.
2) ఒక కొడుకు, కూతురు ఉన్నట్లైతే కొడుకుకు తోడుగా ఉండటానికి అల్లుడిని ఇల్లరికం తెచ్చుకుంటారు. ఆస్తిలో సగభాగం అల్లుడి పేరున రాయిస్తారు.
3) సంతానం లేని వారు కూడా తమ తమ్ముని కూతురిని దత్తత తీసుకొని ఆమెకు వివాహం జరిపించి, అల్లుడికి తమ ఇంటి వద్ద తీసుకొచ్చి తమ ఆస్తిని అతని పేరున రాయిస్తారు.

బంజారాల్లో ఇల్లరికం అంత సులభంగా ఉండదు. ఇల్లరికం పోయే వ్యక్తి తల్లిదండ్రులు కూడా సమ్మతించాలి. ఇల్లరికం పోయే వ్యక్తికి కొన్ని షరతులు విధిస్తారు.

1) తాండాలోని వ్యక్తులందరితోను నాయకునితో కలిసి మెలసి మెలగాలి.
2) ఇల్లరికం పోయినప్పటి నుండి అత్తమామల చాకిరి వారి ఇంటి పని పొలం పనులు సంసార బాధ్యతను ఇతనే నిర్వర్తించాలి.
3) అందరి చేత మెప్పుపొందాలి. అప్పుడే ఇల్లరికంగా వచ్చిన వాడికి ఆస్తిపాస్తులు లభిస్తాయి.

చూడెరో నొక్తా (రెట్ట గాజులు తొడగించడం) :

బంజారాలలో తాళిబొట్టు కట్టుకోరు. రెట్ట గాజులే వారికి తాళితో సమానం. ఈ కార్యక్రమం చేసే ముందు తాండాలోని ముత్తైదువలు (స్త్రీలు) అందరూ కలిసి సాయత్రపు పూట ఆడ పెళ్ళి వారింటికి చేరుకుంటారు. అబ్బాయి వారు ఇచ్చే బెల్లం కుడక (కొబ్బరి)ని తింటారు. స్త్రీలు అందరూ

కలిసి అమ్మాయిని మధ్యలో కూర్చోబెట్టి పాటలు పాడుతారు. పెళ్ళి కూతురు తల దువ్వి ఘుగరి (చోట్లా) అనే చెంపకు వెండితో తయారు చేసిన టోప్లి అనే మూడింటిని జడకు కడుతారు. తర్వాత రెట్టకు గాజులు తొడిగిస్తారు. ఈ సమయంలో అమ్మాయి చాలా ఏడుస్తూ ప్రతిఘటన చేస్తుంది. అయితే ముత్తైదువలు అందరు కలిసి ఒదారుస్తారు. మోచేతి నుండి భుజం వరకు రెట్ట గాజులు "బలియ" అనే దంతపు గాజులు తొడిగిస్తారు. ఆ సమయంలో అక్కడికి వచ్చిన చిన్న పెద్దలందరిని కౌగిలించుకొని ఏడుస్తుంది. అందరి దీవెనలను తీసుకుంటుంది.

ఎప్పుడైతే రెట్ట గాజులు తొడిగిస్తారో అప్పటి నుండి పెళ్ళి కూతురు స్త్రీగా మారుతుంది. అనగా ! ముత్తైదువగా రెట్ట గాజులనే తాళిబొట్టుగా భావిస్తారు"[20]

అప్పగింతలు (నవలేరిన్ వళాయేరో నోక్తా)

"పెళ్ళి కూతురిని అప్పగింతలు చేసే కార్యక్రమం చాలా అద్భుతంగా బంజారాల్లో కనబడుతుంది. పెళ్ళి కుమార్తెను అత్తవారింటికి సాగనంపుటను అప్పగింతలు అంటారు. ఈ కార్యక్రమం ఆడ కూతురు వారు తాండా మొత్తం ఇంటింటికి తిరిగి తమ అమ్మాయిని ఇంటి నుండి బయటికి తీసి అత్తవారింటికి సాగనంపుదాం రండి అని కబురంపుతారు.

తాండాలోని నాయక్, చిన్న పెద్దలు, ముత్తైదువలు, అందరూ కలిసి పెళ్లి కూతుర్ని తమ ఆచారం ప్రకారం తమ రంగు రంగుల బట్టలు, నగలు అన్నింటిని తొడిగించి అలంకరిస్తారు. తర్వాత ముత్తైదువలు అందరు కలిసి అప్పగింతల పాట పాడుకుంటూ పెళ్ళి కూతుర్ని ఇంటి నుండి బయటికి తీసుకొస్తారు. ఆ సమయంలో పెళ్ళి కూతురు కన్నీరు మున్నీరుగా ఏడుస్తూ, తమ ఇంటి గుమ్మాన్ని గట్టిగా పట్టుకొని వ్రేలాడుతుంది. ముత్తైదువలందరూ చేతులు విడిపించి, అతికష్టంగా ఇంటి నుండి బయటికి తీసుకొస్తారు. తర్వాత చక్కగా అలంకరించిన ఎద్దుపై అమ్మాయిని నిలబెట్టి "హవేలి" పాటను పాడిస్తారు.

ఆడ కూతురు వారు ఇచ్చిన బట్టలను గూణ్ అనే గోనె సంచిలో రెండు వైపుల అన్ని రకాల సామాన్లు అందులో ఉంచుతారు. ఆ గూణ్‌ను ఎద్దు వీపుపై రెండు వైపుల సమానంగా ఉండేటట్లు వేసి, అమ్మాయిని ఎద్దుపై ఎక్కించి హవేలి ని చేయిస్తారు. ఈ హవేలిలో పెళ్ళి కూతురు తన తాండా గూర్చి, తన తాండా నాయకుని గూర్చి, తన తల్లిదండ్రుల గురించి, అన్నదమ్ములు అక్కా చెల్లెళ్లు, బంధువులు ఇరుగు పొరుగు వారిని ఉద్దేశించి తన దు:ఖాన్ని ఏడుపు పాట ద్వారా విలపిస్తుంది.

తర్వాత తన పేరు ప్రతిష్టలను తన తాండా పేరును నాయకుని పేరును తల్లిదండ్రుల పేరు ప్రఖ్యాతలను కాపాడుతాను. అత్తవారింటిలో ఆదర్శ గృహిణిగా చలామణి అవుతాను. అత్త మామలకు ఎదురు చెప్పక వారి అడుగు జాడల్లో నడుచుకుంటాను. భర్తకు తోడు నీడగా ఉండి అతనికి సేవ చేస్తాను. అందరి చేత మన్ననలను పొందుతాను అని ప్రతిజ్ఞ చేస్తుంది. తర్వాత తాండాలోని ప్రతి వారిని కౌగిలించుకొని, తన వియోగాన్ని ఏడుపు పాట ద్వారాతెలియచేస్తుంది. అప్పుడు తాండా వారు ఎంతో కొంత బహుమానంగా అమ్మాయి చేతిలో డబ్బులు వుంచుతారు. దీనీనే "హత్‌గాలేరా" అని బంజారాలు వ్యవహరిస్తారు.

ఈ కార్యక్రమం అయిన తర్వాత ఎద్దుపై ఉంచిన గూణ్ సంచిని తీసి, ఒక చాప పరచి దానిమీద కొత్త దంపతులను ఇరువురిని కూర్చుండబెట్టి మధ్యలో "గూణ్" ను ఉంచుతారు. అమ్మాయిని పడమర ముఖంగా, అబ్బాయిని తూర్పు ముఖంగా కూర్చుండపెడుతారు. తర్వాత అబ్బాయితో ఐదుమంది కలిసి ఒకే పళ్ళెంలో భోజనం చేస్తారు. అలాగే పెళ్ళి కూతురు తన స్నేహితులు ఐదు మంది కలిసి ఒకే కంచంలో సామూహికంగా భోజనం చేస్తారు. కట్న కానుకలు సమర్పించుకుంటారు. తర్వాత దూరాన్ని బట్టి బండ్లు లేదా బస్సుల రవాణా ద్వారా అమ్మాయిని, అబ్బాయి వారింటికి సాగనంపుతారు"[21].

ఘరేమాలేరో నొక్తా (ఇంట్లో ప్రవేశింపచేసే కార్యక్రమం):

"పెళ్ళి కూతుర్ని అత్త వారింటికి పంపినప్పుడు మగ పెళ్ళి వారింట్లో జరిగే కార్యక్రమాలు. పెళ్ళికి వెళ్లిన ఆడ కూతురు వారు మరియు పెళ్ళి కూతుర్ని తాండా బయట చాప మీద కూర్చోపెడతారు. తర్వాత తాండా నాయకుని అనుమతితో కొత్త పెళ్ళి వారికి తాండాలో ప్రవేశం లభిస్తుంది. ఈ ఆచారం ఇతర ఏ సమాజంలో కనబడదు. కట్టు దిట్టమైన ఆచారం బంజారాలలో కనబడుతుంది. మగపెళ్లి వారింట్లో కొన్ని రకాల కార్యక్రమాలు జరుగుతాయి.

పెళ్ళి కుమారుని ఇంటికి "తాంగడి" వస్తుందని ముందుగా తాండాలోని వారందరు అబ్బాయి వారి ఇంటికి చేరి ఉంటారు. వీళ్ళందరు "మంగళ" హారతితో బంజారా భాషలో పాటలు పాడుతారు. ఆడ పెళ్ళి వారు వేచి వున్న ప్రదేశానికి వెళ్ళి అక్కడ అందరికి కుంకుమ పసుపు పెడుతారు. తర్వాత అమ్మాయి తన తల్లిదండ్రుల ఇంటి నుండి తెచ్చిన "చుర్మో" (బియ్యపు పిండి, బెల్లం, నెయ్యి)ను అబ్బాయి వారందరికి పంచి పెట్టి తర్వాత పెళ్ళి కూతుర్ని, ఆమె వెంట వచ్చిన వారికి పాటల రూపంలో మగ పెళ్ళి వారు తిట్టుకుంటూ తమ ఇంటికి తీసుకెళ్తారు. ఈ సమయంలో మంచి శృంగార, హాస్య పాటలు పాడుతారు. ఈ పాటలు సరదాగా చాల వినసొంపుగా ఉంటాయి.

ఇంటికి తీసుకెళ్ళిన తర్వాత మగ పెళ్ళి వారు తయారు చేసిన పాయసం (లాప్సి)ని దేవునికి నైవేద్యం పెట్టి, కొబ్బరి కాయ కొట్టి అగరువత్తులు ముట్టించి, దీపం వెలిగించి నూతన వధూవరులను ఇంట్లోకి ఆహ్వానిస్తారు. అప్పుడు గుమ్మం దగ్గర ఆడ బిడ్డలు, వదినలు అందరు కలిసి అడ్డగిస్తారు. వారికి కొంత డబ్బును కట్నంగా బహుమతి ఇవ్వాలి. కొత్త పెళ్ళి కూతురు మాత్రం మూరెడు ముసుగు (ఘుంటో)ను ముఖం ముందుకు ఎప్పుడు ఉంచుకోవాలి. ఇతరులను ముసుగు లేకుండా చూడకూడదు. తన ముఖాన్ని ఇతరులకు చూపించవద్దు ఇలా 15 రోజుల నుండి ఒక నెల వరుకు కొత్త పెళ్ళికూతురు (నవలేరి)ను ఉంచుతారు.

దాంతణీయా దేరో నొక్తా (పళ్ళ పుల్ల ఇప్పించే పరిచయ కార్యం):

పెళ్లయిన కొత్త అమ్మాయి చేత మగ పెళ్ళివారు తమ తాండాలోని అన్ని కుంటుంబాలకు పళ్ళ పుల్లలు యిప్పిస్తారు. ఇలా ఇంటింటికి తిరిగి ఉదయాన్నే తన ఆడ కూతుర్ని గాని తోటి కోడళ్ళను గాని వెంట తీసుకొని పళ్ళ పుల్లలు ఇత్తడి చెంబులో పెట్టి యిప్పిస్తారు. ఇలా చేస్తూ అందరి కాళ్లను మొక్కుతూ పెద్దల ఆశీర్వాదాలు తీసుకుంటుంది. ఇది చాలా అద్భుతమైన పరిచయ కార్యక్రమం. ఇంకా తాండా పెద్ద మనుషులకు కాళ్ళు పట్టిస్తారు. ముఖ్యమైన వ్యక్తులకు స్నానాలు కూడా చేయిస్తారు.

"తాంగడి ఖోళేరో నొక్తా" (పెళ్ళి కుమార్తె సామాన్లు చూపించుట) :

పెళ్ళి కూతుర్ని ఇంట్లో తీసుకున్న తర్వాతా సాయంత్రం 3 గంటలకు, సాగనంపటానకి వచ్చిన ఆడ పెళ్ళివారు తిరిగి వెళ్ళే సమయంలో వారు మగ పెళ్ళి వారికి ఇచ్చిన వస్త్రాలు, ఆభరణాలు, వంట సామాన్లు మొదలగు వస్తువులన్నింటిని మగ పెళ్ళి వారి ఇంటి ముందు బహిరంగంగా ప్రదర్శిస్తారు. అమ్మాయి అత్తగారు తాండాలోని స్త్రీలందరిని పురుషులను నాయకుని పిలుచుకొస్తుంది. అందరి సమక్షంలో ఆడ పెళ్ళి వారు తెచ్చిన వస్తువులనుచూపిస్తారు. అత్తకు మామకు, ఆడ కూతురికి, తోడి కోడళ్ళకు ఏ ఏ వస్తువులు తీసుకొచ్చిందో అని అందరు చూస్తారు. అందరికి తెచ్చిన వస్త్రాలను అందరికి తొడిగిస్తారు. తమాషాగా జోకులు వేసుకుంటూ సరదాగా సామానులు చూస్తారు. ఈ కార్యక్రమం పూర్తవుతుంది. తర్వాత ఆడపెళ్ళివారు తమ ఇంటికి వెళ్లిపోతారు. పెళ్ళి కూతురుకి అన్ని విధాల బుద్ధులు చెప్పి మంచి, చెడుల గురించి అత్తవారింట్లో ఏ విధంగా మసలుకోవాలో చెప్పి ఒకరి నొకరు కౌగిలించుకొని తమ ఎడబాటుకు గుర్తుగా ఏడుస్తారు. అలా వారు వెళ్తున్నప్పుడు "ఢోలో" అనగా వీడ్కోలు చెబుతారు. ఈ విధంగా ఈ కార్యక్రమం ముగుస్తుంది"[22].

సూచికలు

1. రత్నావత్ మాల్యధాడి వయస్సు 80సం॥లు - గాయంవారి గూడెం, సూర్యాపేట మం., నల్లగొండ జిల్లా - సేకరణ మౌఖికం
2. సుగాలి సంస్కృతి భాషా సాహిత్యాలు –డా.గోనా నాయక్. యం. పుట - 34
3. కరీంనగర్ జిల్లా లంబాడీల ఆచార వ్యవహారాలు - శంకరయ్య జె.పుట –51,52,53.
4. బంజారా చరిత్ర సంస్కృతి ప్రగతి. చిన్యా నాయక్. బి. పుట - 180, 181, 182.
5. సుగాలి సంస్కృతి భాషా సాహిత్యాలు డా॥గోనానాయక్ యం. - పుట –34,37,38.
6. కరీంనగర్ జిల్లా లంబాడీల ఆచార వ్యవహారాలు - శంకరయ్య జె.పుట–53.
7. బంజారా చరిత్ర– సంస్కృతి - ప్రగతి. చిన్యానాయక్ .బి. పుట - 180,181.
8. సుగాలి సంస్కృతి భాషా సాహిత్యాలు - డా॥గోనానాయక్ యం.– పుట–51–56
9. కరీంనగర్ జిల్లా, లంబాడీల ఆచార వ్యవహారాలు–శంకరయ్య జె. పుట– 59.
10. సుగాలి సంస్కృతి - భాషా సాహిత్యాలు - డా॥గోనానాయక్ యం.– పుట–53,54
11. కరీంనగర్ జిల్లా లంబాడీల ఆచార వ్యవహారాలు - శంకరయ్య జె. పుట–61–95 నుండి 95వరకు.
12. బంజారా చరిత్ర - సంస్కృతి ప్రగతి.–చిన్యా నాయక్ బి. పుట– 185–192.

13. సుగాలి సంస్కృతి భాషా సాహిత్యాలు. - డా॥గోనా నాయక్ యం. పుట 39-43.

14. సుగాలి సంస్కృతి భాషా సాహిత్యాలు, డా॥గోనా నాయక్ యం. - పుట - 46,53,54,57.

15. బంజారా చరిత్ర - సంస్కృ ప్రగతి. చిన్యానాయక్. బి. - పుట - 186,187.

16. బంజారాల చరిత్ర-సంస్కృతి-ప్రగతి. చిన్యా నాయక్ బి. పుట - 191, 192.

17. లకావత్ సొమ్లా వయస్సు 80 సంవత్సరాలు, అజ్మీర తాండా (తాళ్ల సింగారం), నూతనకల్ (మం.) సేకరణ మౌఖికం

18. బంజారాల చరిత్ర-సంస్కృతి-ప్రగతి. - చిన్యా నాయక్ బి. పుట - 194,195.

19. లకావత్ సొమ్లా వయస్సు 80 సంవత్సారాలు, అజ్మీరతాండా (తాళ్ల సింగారం), నూతనకల్ (మం) సేకరణ మౌఖకం

20. సుగాలి సంస్కృతి భాషా సాహిత్యాలు. డా॥గోనా నాయక్ .యం - పుట - 50.

21. చంద్రి బాయి వయస్సు 70 సం. అజ్మీర తాండా, నూతనకల్ మండలము,

నల్లగొండ జిల్లా - సేకరణ మౌఖికం

22. కరీంనగర్ జిల్లా లంబాడీల ఆచార వ్యవహారాలు, శంకరయ్య జె. - పుట. 88 - 95 వరకు.

IV. బంజారాల
వివాహ ఆచార గేయాలు

బంజారాల వివాహ ఆచార గేయాలు

1. గోళ్ ఖావ జన్నార్ గీద్. (బెల్లం తినేటప్పుడు పాడే పాట)

"ఆవోరే రామి రామి
జావోరే రామి రామి
సమది చాలోరే రామి, రామియే
ఛ్వారీరీ ఘరే యాంగ పామేణ ఆయే
సమేలక దీయో ఝులరే
దాణా పాణీరో హత్ ఛే
పరసమియావో పర్ వాతఛే"

సందర్భం : సగాయి అనగా సంబంధం ఏర్పాటు పప్పన్నం తినటానకి అబ్బాయి వారు అమ్మాయి వారి ఇంటికి వస్తున్నప్పుడు, అమ్మాయి వారు ఎదురుగా వెళ్ళి పై పాటను పాడుతారు.

భావం : రండి రండి వియ్యంకుల్లారా మీ కందరికి నమస్కారాలు. మీరు రావచ్చు పోవచ్చును. అన్ని వేళల మీకు మా నమస్కారాలు. అమ్మాయి వారి ఇంటికి చుట్టాలు వస్తున్నారు. ఎదురుగా వెళ్ళి దీపం, హారతి పళ్లెం పట్టండి. అబ్బాయి వారు ధనవంతులు, మన అమ్మాయికి ఎటువంటి లోటు ఉండదు. సమాజంలో అబ్బాయి వారికి మంచి పేరు, ప్రతిష్టలు ఉన్నాయి. అని పాట రూపంలో అబ్బాయి వారి గూర్చి, అమ్మాయి వారు తెలియచేస్తారు.

2. "గోళ్ ఖావ జన్నా ఛ్వారావాళేర్ పచార్" (సగాయి)

(బెల్లం తినేటప్పుడు అబ్బాయి వారి పలకరింపు)

"సామళార్ భాయిన్ సేగా పాంచ్ పచారే

రాజ, భోజారి సభా పచారే లాక్, అన్ పచారే సవాలాక్
భాయిన్ సేగా పచారే జగత్, పాంచ్ మలక్ ఖోదా మలక్
పాంచేయేన్ కీదే కారి కత్తినై తుటనో హోరి
హడేసూ హడ్ మలగే, ఛీతల్ భాయి ఛాతీయా ఏగే
దేశ్ ఛోడన్ పర్‌దేశేతి అయో సగా
హరో మాల్ లాల్ టోపి
కాచ్చి సపారి పోక్కొ పాన్
సగే సగేరో ఏగో మాన్
ఖ్యాల్ ధుండుతో కస్తూరి
ఖోళుతో కూన్, నై ఖోళుతోకూ
పూరిన్! పూరియ నాయక్
మన్ ఛంగా కాకొటిమాజ్ గంగా
సముద్రే మాయిరో కాంక్రా
మస్తాన్ పూరిరి ఢాళ్ ఏక్ సగాజ్
మళో హీరా మాయిరో లాల్
ఆంగ్ ఘాలి ఖాణ్ లార ఘాలి సక్కర్
సే మిటోజ్ మిటో ఆంగేర్ జలమ్ కుణ్ దిటో నాయక్
భోళ్‌క, ఢాళ్ సరమేరి తారి క్యాళ్ ఛనాయక్".

సందర్భం : అబ్బాయి, అమ్మాయిలకు సంబంధం ఏర్పాటు చేసిన తర్వాత అమ్మాయివారు, ఐదు గురు సభ్యులతో కూడి మంచిరోజు చూసుకొని, అబ్బాయి వారింటికి వచ్చి, తెలుగు వారి పప్పన్నం లాగా బంజారాలు 'బెల్లంతో' అందరిని తృప్తి పరుస్తారు.. ఈ సందర్భంలో బెల్లం తినేటప్పుడు మొదటగా అబ్బాయివారు, అక్కడికి వచ్చిన చిన్న పెద్ద వారందరిని బంధు మిత్రులందరిని పై విధంగా పలకరిస్తారు.

అర్థం : వినండి ఓ అన్నదమ్ముల్లారా వియ్యంకుల్లారా ఐదుమంది కలిసే రాజ, భోజ మహారాజుల సభ లాంటిది ఇది. ఇక్కడికి వచ్చిన వారందరికి లక్షసార్లు, లక్షన్నరసార్లు నమస్కారాలు తెలియచేస్తున్నాం. తగు జాగ్రత్తగా

వినండి. మన అబ్బాయికి, అమ్మాయి నివ్వటానికి ఐదు ప్రదేశాల నుండి వియ్యంకులు వచ్చారు. అయినా ఈ సంబందం ఏర్పాటు చేసి, ఐదుగురి సమక్షంలో చేసిన ఈ కార్యాన్ని ఎవరు జవదాటకూడదు. ఎక్కడ విడిపోకూడదు. దేశాలు, రాజ్యాలు కూలినా మన సంబంధం మాత్రం విడకూడదు. మనము చిందర వందర అయినా సరే, మన ఇంటికి వచ్చిన వారికి ఆకులు వక్కలు, కోతలో అనే సంచిలో నుండి తీసి అందించాము. ఓపూరియా నాయకుడా వినండి. మన మనస్సులు గంగానది వలే ప్రశాంతంగా సముద్రంలోని రాయివలే గట్టిగా కల్చినాయి. మీరు మస్తాన్ పూరి అనే చారిత్రకమైన ప్రదేశం నుండి వచ్చారు. మీరు, మేము గుడ్డులోని తెల్లసోనా పసుపు సోనాలాగా కలిసినాము, మన ముందు చరిత్ర చూస్తే అంతా మంచిదే, కావున ఇప్పుడీ తీపి పదార్థాన్ని అందిస్తున్నాము తిని ఆనందించండి. భవిష్యత్తులో జరిగే వాటిని ఎవరు ఊహించగలరు. ఓ నాయకుడా మేము చేసిన మా ఈ చిన్న ఉపదేశాన్ని మనస్పూర్తితో అంగీకరించండి.

3. ఛ్వారి వాళేర్ – "పచార్" (అమ్మాయి వారి పలకరింపు) :

ఆవోర్ భాయిన్ సగే పాంచ్ పచార్
రాజ, బోజారి సభా పచారే లాక్ అన్ పచారే సవాలాక్
భాయిన్ సగా పచారే జగత్
పాంచ్ మలక్ ఖోదా మలక్
పాంచేనే కేదే కారీ కత్తినై తుటనో హారి
హడేసూ హడ్ మలగే ఛీతల్ భాయి ఛాతీయ ఏగే
దేశ్ ఛోడ్ పర్‌దేశేతి ఆయో సగా
హరో మాల్ లాల్ టోపి
కాచ్చి సపారి పాక్కో పాన్
సగే సగేరో ఏగో మాన్
ఖ్వాళ్ ధుండుతో కస్తూరి
ఖోళుతో కూన్ నై ఖోళుతో కూ

పూరిన్ పూరియా నాయక్
మన్ ఛంగా కాకోటిమాజ్ గంగా
మస్తాన్ పూరిర్ ధాళ్ ఏక్ సగాజ్
మళో హీరా మాయిరో లాల్
క్వారేర్‌తో మటేర్ గడ్ మటేర్ ఖీలా
అపణ్ గోరుర్ భీలియా బోమారి
ఏజ్ గడ్! ఏజ్ ఖీలా నాయక్
భోళ్‌క ధాళ్ సమజ్‌ల నాయక్
ఆంగ్ ఘాలి ఖాణ్ లార ఘాలిచక్కర్
సే మిటోజ్ మిటో నాయక్
అంగేరో జలమ్ కుణ్ దిటో నాయక్
ఖ్యాళ్ దినే కొచళా దినే, హర్‌దినే బేటి
ఫెరన్ ఘాలు బేటి ఈ జల్మా జల్మి కత్తి నై కరనో ఖోటి.

సందర్భం : అబ్బాయి, అమ్మాయిలకు సంబంధం ఏర్పాటు అయిన తర్వాత అమ్మాయి వారు ఐదుగురు సభ్యులతో కూడి అబ్బాయి వారింటికి వెళ్తారు. తాండా నాయకుడు, బంధు మిత్రులు, అందరి సమక్షంలో తాండా బయట అందరు కూర్చోని, కట్నకానుకలు మాట్లాడుకోని చివరగా బెల్లం తింటారు. ఆ సందర్భంలో అబ్బాయివారు అమ్మాయి వారిని, అమ్మాయి వారు అబ్బాయి వారిని పై విధంగా పరికరిస్తారు.

అర్థం : వినండి ఓ అన్న దమ్ముల్లారా వియ్యంకుల్లారా ఐదు మంది కలిసే రాజ, భోజమహారాజుల సభ లాంటిది ఇది. ఇక్కడికి వచ్చిన వారందరికి లక్షసార్లు, లక్షన్నరసార్లు నమస్కారాలు తెలియచేస్తున్నాం. తగు జాగ్రత్తగా వినండి మన అబ్బాయికి అమ్మాయి నివ్వటానికి ఐదు ప్రదేశాల నుండి వియ్యంకులు వచ్చారు. అయినా ఈ సంబంధాన్ని ఏర్పాటు చేశాం. ఐదుగురి సమక్షంలో చేసిన ఈ కార్యాన్ని ఎవరు జవదాట కూడదు. ఎక్కడ విడపోకూడదు. దేశాలు, రాజ్యాలు కూలిన మన సంబంధం మాత్రం

వీడకూడదు. మనము చిందర వందర అయినా సరే పరాయి దేశం నుండి మన వియ్యంకుడు వచ్చాడు. అతనకి ఆకులు వక్కలు, కోతలో అనే సంచిలో నుండి తీసి ఇచ్చాము ఓ పూరియా నాయకుడా వినండి. మన మనస్సులు గంగానది వలే ప్రశాంతంగా, సముద్రంలోని రాయివలే గట్టిగా కలిసింది. మస్తాన్ పూరి అనే చారిత్రకమైన ప్రదేశం నుండి వచ్చారు. వారు, మీరు గుడ్డులోని తెల్లసోన పసుపు సోనలాగా కలిశాము. మన ముందు చరిత్ర చూస్తే అంత మంచిదే. కావున ఇప్పుడీ తీపి పదార్థాన్ని అందిస్తున్నాం. తిని ఆనందించండి. భవిష్యత్తులో జరిగే వాటిని ఎవరు ఊహించగలరు ఓ నాయకుడా మేము చేసే ఈ చిన్న ఉపన్యాసాన్ని మనస్ఫూర్తితో అంగీకరించండి. బంజారేతరులకి స్థిర నివాసాలుగా బంగళాలు ఉన్నాయి. కానీ మన బంజారులకు ఇదే అడవి. ఇవే గుడిసెలు ఇదే మన సంప్రదాయం దీనిని ఏవ్వరు ఉల్లగించరాదు. తెలిసో తెలియకో ఈ విధంగా మన చరిత్రను గుర్తిస్నున్నాం. నాయకుడా పెద్ద మనస్సుతో అర్థం చేసుకోండి. ముందు, వెనుక కూర్చున్న వారందరికి బెల్లం అందించాం. కాని భవిష్యత్తులో జరిగే వాటిని ఎవరు ఊహించగలరు. మా అమ్మాయికి అన్ని రకాల వస్తు సామగ్రిని ఇచ్చి మీకు అప్పగించాలని అనుకున్నాం. జన్మ జన్మల వరకు మా అమ్మాయిని మీ చేతిలో పెడుతున్నాం. కావునా మాకు ఎటువంటి చెడ్డ పేరు రాకూడదని పలకరిస్తారు.

4. "వేతడున్ ఖ్వాళ్ ఓడావజన్నా ఎలేర్ రపీయార్ గీద్"

(పెళ్ళి కుమారుడికి దుప్పటి కప్పించేటప్పుడు పాడేపాట)

"బావ మరేటాలాగీ తారి సపారి
బావ ఎలేర్ రపీయా సగటేపర్
బావ కీడి ముంగేరో జోడా సగటేపర్
బావ ఛుటి ఘేరీ తారి పూటేపర్
బావ పాటేరో సేలా తారి కాందేపర్
బావ సొనేరి కోతలి తారి కాంకేమా

బావ రూపేరి జాంజే తారి హతేమా
బావ టాంగేరో తోడా తారి తళవాపర్"

సందర్భం : పెళ్ళి కుమారునికి కొత్తగా దుప్పటిని కప్పిస్తారు. అందులో ఒక రూపాయి బిళ్ళను వేసి చుట్టుతారు. ఆ సందర్భంలో పై పాటను పాడుతారు.

వివరణ : పెళ్ళి కుమారునికి దుప్పటి కప్పించేటప్పుడు, తాండా నాయకుని సమక్షంలో దుప్పటిని నల్గురు పట్టుకొని అందులో ఒక రూపాయి బిళ్ళను వేస్తారు. ఆ దుప్పటిని నల్గురు చుట్టుకుంటూ పెళ్ళి కుమారునికి కప్పిస్తారు.

భావం : ఓ పూజారి లాంటి పెళ్లి కుమారా నీవు ఇచ్చిన తమలపాకులు తియ్యగా ఉన్నాయి. నీ దుప్పటిలో వేసిన రూపాయి బిళ్ళ మాకందరికి చెందినది. ఓ పూజారి. చీమకు, పప్పు ధాన్యానికి స్నేహం ఉన్నట్లుగానే ఈ రోజు నుండి ఈ దుప్పటికి, నీకు మాకు అలాంటి స్నేహం ఉండాలి. పట్టు శాలువా నీ భుజంపై ఉన్నది. నీ చంకలో బంగారంతో చేసిన సంచి ఉన్నది. నీ చేతికి వెండి కడియాలు ఉన్నాయి. నీ కాళ్ళకు ఎర్రటి దారం కట్టినారు. అని బంజారా స్త్రీలు పెళ్ళి కుమారుడిని తయారు చేసేటప్పుడు పాడే పాటది.

5. "వేతడున్ హుబారకాడ జన్నార్ గీద్"

(పెండ్లి కొడుకును తయారు చేసేటప్పుడు పాడే పాట)

"మారో ఠాడు ఏన్ నజర్ దేకూ
మారే మాళీయా భాందతూ హరేలాగీ
మారే సాడలీ రంగావుతూ హరేలాగీ
మారే ముటీయా మోలావుతూ హరేలాగీ
మారే ధోతీ మోలావుతూ హర్‌లాగీ
మారే ఖ్వాళ్ మోలావుతూ హరేలాగీ
మారే కారేటే మోలావుతూ హర్‌లాగీ"

సందర్భం : బంజారాల వివాహ వ్యవస్థలో "ఒడుగు" అనే ఆచారం ఉంది. ఈ ఒడుగుకు ముందు రోజు అబ్బాయికి సూదితో వాత పెట్టి స్నానం చేయిస్తారు. పెళ్ళికి సంబంధించిన బట్టలను ఖోళ్, ధోతి, రుమాల్, ఢాల్ (ఖడ్గం), కొతలో, బర్చి (విల్లు) యుద్ధానికి వెళ్ళే సైనికుడిలాగా కొత్త బట్టలు ధరించి పెళ్ళి కొడుకుగా తయారు చేస్తారు. ఆ సందర్భంలో బంజారా స్త్రీలు పై పాటను అబ్బాయిని దృష్టిలో పెట్టుకొని పాడుతారు.

భావం : పెళ్ళి కొడుకును అలంకరించిన తర్వాత అతను కన్నులు చెదిరేలాగా, అందరి దిష్టి తగిలేలాగా అందంగా కనబడతున్నాడు. అతని తలపాగా చుట్టడానకి అందరు అలసిపోయారు. అతని యొక్క దుప్పటి పై స్వస్తిక్ గుర్తును రంగు రంగులుగా వేయుటకు అలసిపోయారు. అతని చేతి కడియాలు వెండితో చేసిన వాటిని ఖరీదు చేసి అందరు అలసిపోయారు. అతని ధోతి దుప్పటి, పెళ్ళి పత్రికలు అన్నింటిని ఖరీదు చేసే సరికి అందరు అలసిపోయారు. అని అబ్బాయిని, పెళ్ళి కొడుకుగా అలంకరించేటప్పుడు పాడేపాటది.

6. "టేళేర్ టోకణ్‌చ దావజన్నార్ గీద్"

(పెళ్ళి బంతి కొరకు అన్నం వండేటప్పుడు పాడేపాట)

ఘరీయే హమారోన్ బారి యే హమారో
ధణీ తమారో యే మారి స్వాకో
ఏకే అరామా కాందా పడేచ
రాందన ఖావోయే మారి స్వాకో
ఏకే అరమా చావళ పడేచ
రాందన ఖావోయే మారి స్వాకో
కొత్త పల్లిరో కోచళోయే సాతణో
రాందన ఖావోయే సాతణో
భూకి కోయి రిజోమత్
ఎకేరాసే రాణియా జాంగియా పేరాణీయా

ఢాలే పడి తరవారేపడీ, కోయి లడజో
మతకోయి కోయి పోడేజో మత్

సందర్భం: పెళ్ళి కొడుకును తయారు చేసిన మరుసటి రోజు తాండావారందరికి బంధువులకు విందు ఏర్పాటు చేస్తారు. ఆ విందు భోజనం వండేటప్పుడు పై పాటను బంజారా స్త్రీలు పాడుతారు.

భావం : ఇల్లు వాకిలి మొత్తం మావి కాని మా మొగుళ్ళను మీకిచ్చినాం. ఓ సవతుల్లారా ఒక గదిలో ఉల్లిగడ్డలు, ఇంకో గదిలో బియ్యం ఉన్నవి. అవి తీసి వండి తినగలరు. కొత్తపల్లి నుండి తీసుకొచ్చిన ఇత్తడి పళ్ళాలు, సింగారం అనే ఊరి నుండి తీసుకొచ్చిన బిందెలు ఉన్నవి. వాటిని ఉపయోగించి ఎటువంటి గొడవలేకుండా హాయిగా తినండి. ఓ స్నేహితుల్లారా మీ కందరికి కావలసిన సాధన సామగ్రీలు సిద్ధంగా ఉంచాము. ఎటువంటి గొడవ లేకుండా తిని వెళ్లిపోండి. ఓ స్నేహితుల్లారా. అని బంజారా స్త్రీలు సరదాగా తిట్టుకుంటూ పై పాటను పాడుతారు.

7. టేళేరో 'పచార' – జిన్నా ఖాళీ ఖాందేర్ సాకీ"

(బంతి తిరిగేటప్పుడు వేసే "పొడుపు కథ")

1. సాకీ (పొడుపు)

"చాలేకి రస్తా భాందూ
బేసేకీ సాద్రీ ఘాలు
బొల బొలరే హరి వాడిరో కాందావో బొలరే
బేసేకి పలక్ భాందూ
ఖాయేకి థాళీ బాందూ
పీనేకా ఝూరీ బాందూ
బొల బోలరే! హరి వాడీరో కాందావో బోలరే"

(2) 'వదడ్' (విడుపు)

"వడ్ కాటు వడియాళీ కాటు

వడేరో కాటు గేదా సాట్ బళదేరో పలాణ్ బాందూ
ఘర్ భాందూ తేలా ఘరేపర్ భారీ
భారీపర్ ఝారీ ఆంగ్ బేటి ఘుంటే వాళీ
లారబేటి చూడాలేవాళ్ ఛోడ్ ఛోడ్ మర్ధేరీ థాళీ"

సందర్భం : పెళ్ళి కొడుకును తయారు చేసి మరుసటి రోజు ఉదయం అబ్బాయివారు బంతి భోజన కార్యాన్ని చేస్తారు. ఆ భోజనానికి వచ్చి కూర్చున్న వారందరు తినే ముందు ఒక పొడుపు కథను వేసి, దాన్ని విప్పే వరకు భోజనం చేయకూడదు. ఈ సందర్భంలో బంజారాలు పై పొడుపు కథను వేస్తారు.

1. **భావం :** నడిచేందుకు రహదారిని వేస్తాం. కూర్చునేందుకు చాపను వేస్తాం చెప్పండి, చెప్పండి ఓ పచ్చని చేలో పండిన ఉల్లిగడ్డలాంటి వియ్యంకుల్లారు. చెప్పండి కూర్చునే చాపను కట్టేశాం (ఆపేశాం). తినే పళ్ళాన్ని కట్టేశాం త్రాగే చెంబును కట్టేశాం ఓ ఉల్లిగడ్డలాంటి చుట్టాల్లారా చెప్పండి అని పొడుపు కథను అన్నం తినే ముందు అమ్మాయి వారు, అబ్బాయి వారికి, అబ్బాయి వారు అమ్మాయి వారికి వేసుకుంటారు.

2. **భావం :** మర్రి చెట్టును నరికి వాటి కర్రలతోనూ ఆకులతోనూ అరవై ఎడ్లకు గోడకట్టి పాక నిర్మిస్తాం. గోడపై దూలాన్ని దూలంపైన కర్రలను ఆపైన ఆకులను వేసి అందమైన ఇల్లును నిర్మిస్తాం. ముందు కూర్చున్నవారు. అద్దాల ముసుగు ధరించినవారు, వెనుక కూర్చున్న చివరి ఇంటివారు, మీరు మగవారు అనిపించుకుంటే దీని అర్థం చెప్పండి.

8. టేళేరో గీద్ (బంతి కార్యం పాట)

"టేళేరే తమాసేన్ కుణే ఆయో
టేళేరే తమాసేన్ సమిది ఆయో
మారు హికాళేన చారరే

కోయి దేకో తమాసో
టేళేరే తమాసేన్ కుణే ఆయో
టేళేరే తమాసేన్ దేవర్ ఆయో
మారు హికాళేన చారరే
కోయి దేకో తమాషో
టేళేరే తమాసేన్ కుణే ఆయో
టేళేరే తమాసేన్ భనోయి ఆయో
మారు లావణేతి చారరే
కోయి దేకో తమాసో
టేళేరే తమాసేన్ కుణే ఆయో
టేళేరే తమాసేన్ సమదణే ఆయీ
మారు సోటాతి చారరే
కోయి దేకో తమాసో
టేళేరే తమాసేన్ కుణే ఆయీ
టేళేరే తమాసేన్ భోజాయి ఆయీ
మారు లామణేతి చారరే
కోయి దేకో తమాసో"

సందర్భం : అబ్బాయిని పెళ్లి కొడుకుగా చేసిన మరుసటి రోజు తాండా వారికి నాయకునికి, బంధువులకు విందు ఇస్తారు. ఆ విందులో అందరు సామూహికంగా భోజనం చేస్తున్నప్పుడు, బంజారాల స్త్రీలు సరదాగా పై పాటను పాడుతారు.

భావం: విందు కార్యానికి ఎవరేవరు వచ్చారు. విందు కార్యానికి అమ్మాయి తండ్రి వచ్చాడా. ఒక వేళ వస్తే అతనికి నాల్గు తన్ని భోజనం పెట్టండి. ఇంకా ఈ కార్యానికి ఎవరు వచ్చారు. మా మరదులు, మా బావలు కనుక వస్తే వాళ్ళను లంగాతో కొట్టి భోజనం పెట్టండి. ఇంకా ఈ కార్యానికి అమ్మాయి తల్లి వస్తే ఆమెను నాల్గు దెబ్బలు రోకలితో కొట్టండి. ఈ కార్యానికి మా వదినలు కనుక వస్తే వాళ్ళను కూడా లంగాతో

కొట్టి భోజనం పెట్టండి. అని వరుసకు బావలు, మరుదులు, మరదలు, వియ్యంకులు, వియ్యపురాలు, వదినలు మొదలగు వారిపై సరదాగా పై పాటను పాడుతారు.

9. వేతడున్ ఓర్ యాడీ మళేరో - ధావలో

(పెండ్లి కుమారునికి తన తల్లి పట్టుకొని ఏడవటం)

"భచేడా భేఫకరేరి జీవడా
ఫకరేమా పడగోరే మారో
లాడు ఖోడువురో బచేడా – "యా.హీయా"
బచేడా తారి యాడియేనా
కుణసి వాతేరే హిమతే
బందాయేచియేనా హడయేన,
ధూల హుబరేగో లాడకా – "యా. హీయా"
లాడేకా తారేయాడి బాపుయేనా
హత్‌భరో ఛేటి కరదేనా
జాతేరో ఫక్‌ధూండి వాటేడి
ఝులలిదో లాడకా – "యా. హీయా"

సందర్భం : పెళ్ళి కుమారునికి తన మామ ఇంటికి పంపేటప్పుడు తన కొడుకును పట్టుకొని తన తల్లి పరిపరి విధాలుగా ఏడుస్తుంది.

భావం : కుమారా ఎప్పుడు కష్టాలు ఎదుర్కోనని నీ జీవితం ఇప్పుడు కష్టాలలో పడుతుంది. స్వేచ్ఛగా హాయిగా తిరిగే వాడివి. ఇప్పుడు నీకు పెళ్ళి చేసి, సంసార జీవితంలో పంపుతున్నాం నాయనా ఓ కుమారా నీవు నీ తల్లిదండ్రులను ఒకంత దూరం చేసి వెళ్ళిపోతున్నావు.

10. 'వేతడున్ ససరేర్ ఘర్ మేల జన్నార్ గీద్'

(పెళ్ళి కొడుకును తన మామ ఇంటికి పంపేటప్పుడు పాడే పాట)

"తారే ధాలే వాజీరే
బారే పూలారీ ఏస్

తేరే నవసారీ ఏస్
ఛ్యారా తారీ ఢాలే వారాణీ ఎస్
యాడీరో బెటావో తారీ ఢాలే వజానీరే"

సందర్భం : బంజారాల వివాహంలో అబ్బాయిని పెళ్లి కొడుకుగా తయారు చేసి విందు కార్యం ఏర్పాటు చేసి మరుసటి రోజు అబ్బాయిని తన మామ ఇంటికి పంపిస్తారు. అలా పంపేటప్పుడు బంధు మిత్రులు, తాండా వారందరు స్త్రీ పురుషులు కలిసి సాగనంపుతారు. ఆ సందర్భంలో పై పాటను స్త్రీలందరు పాడుతారు.

భావం : ఓ అబ్బాయి నీవు అడుగులు అందంగా వేస్తున్నావు. నీ దుప్పటి పన్నెండు మూరలుగా ఉన్నది. నీ అలంకరణ నవ రత్నాలుగా కనపడుతున్నది. ఓ అబ్బాయి నీవు ఇప్పుడు నిజంగా తల్లిదండ్రుల బిడ్డగా, మహారాజుగా కనబడుతున్నావు. అని అబ్బాయిని ఉద్దేశించి తాండా ముత్తైదువులు పాట రూపంలో పాడి సాగనంపే ఆచారం వీరిలో కనబడుతుంది.

11. "వేతదు ఝోలో దజన్నార్ గీద్! (పెండ్లి కొడుకు చెయ్యి ఊపడము)

అంగఛాయే నీలిసియో వావాడీ
ధ్వాళీ ధోతి అసనాన కరలారే
"పంతమేరో పంతీయా"
లారే ఛాయే తారే బాపేరో మళావో
హటో ఫరన్ ఝోలో దేలారే
"పంతమేరో పంతీయా"
లారేఛాయే తారే ససరేరో మళావో
హతాజోడి హోక్కా దేలారే
"పంతమేరో పంతీయా"
లారే ఛాయే తారే యాడివురో ఝురలో
హటో పరన్ ఝోలో దేలారే

"పంతమేరో పంతీయా"
ఆంగాఛాయే తారే సాసువురో ఝురలో
హతా జోడి రామి రామి కరలారే
"పంతమేరో పంతీయా"

సందర్భం : పెళ్ళి కుమారున్ని తన మామగారింటికి పంపేటప్పుడు స్త్రీలు అందరు కలిసి పరిశుభ్రత గూర్చి నీతులు పాట రూపంలో చెప్పుకుంటూ సాగనంపుతారు. ఆ సందర్భంలో పై పాటను పాడుతారు.

భావం : ఓ అబ్బాయి ముందు ఉన్నది పాల సముద్రం లాంటి బావి. అక్కడ నీ యొక్క అందమైన వస్త్రాలను అవసరమైనప్పుడు, శుభ్రంగా ప్రతి రోజు ఉతుక్కోని స్నానం చేసుకోగలవు. నీ వెనకనే మీ తండ్రి గారి బంధువులంతా ఎదురుచూస్తున్నారు. వాళ్ళందరికి వెనుదిరిగి నీవు వీడ్కోలు చెప్పగలవు. నీ ముందే ఉన్నారు మీ మామ గారి బంధువులు, అక్కడికి వెళ్లిన తర్వాత వాళ్లందరికి, చేతులెత్తి నమస్కారాలు చెయగలవు. హుక్కా వర్తమానాన్ని అందించి మెప్పించగలవు. నీవెనకనే ఉన్నారు, మీ బంధువులు వారందరికి వెనకకు తిరిగి చెయ్యి ఊపగలవు. నీ ముందే ఉన్నది మీ అత్తగారి బంధువులు వారందరికి చేతులెత్తి నమస్కారాలు చేయగలవు.

12. "వేతడు హోక్కా తాండేర్ నాయకేన దఋన్నార్ –గీద్"

(హుక్కాను, పెళ్ళికొడుకు తాండా నాయకునికి అందించేటప్పుడు పాడే పాట)

"సింగా రామేరీ తొలియే తమాకు
కందా గట్లారీ గాంజోయే
ఆంగే బ్యాటోయే నంగరీరో నాయక్
హోక్కా హూయెూయే దోయి హతేమా
గటకలేరీ తొలియే తమాకు
పాతర్ల పాడేరో గాంజోయే
ఆంగే బ్యాటో నంగరీరో నాయక్

హోక్కా హూయో హతరే
కాయి జలమే హుయి రాతరే"

సందర్భం: పెళ్ళి కొడుకు మొట్ట మొదటగా తన మామగారి తాండాకు చేరిన తర్వాత ఆ తాండా నాయకుని ఇంటికి వెళ్ళి, ఆకు వక్కలు హుక్కా వర్తమానాన్ని అందించాలి. అని నీతులుచెబుతూ పై పాటను అబ్బాయి వారి తరపు స్త్రీలు పాడుతారు.

భావం : తాళ్ళ సింగారం అనే గ్రామంలో పండించి, మొదటి పంటలోని తాజాయైన ఘాటైన పొగాకు, కందగట్ల అనే ఊరి వడ్రంగి చేసిన చూడ ముచ్చటైన హుక్కా ఉన్నది. నీ ముందే తాండా నాయకుడు కూర్చున్నాడు. కాబట్టి రెండు చేతులతో ఆ హుక్కాను ఆ నాయకునికి అందించగలవు. అదే విధంగా గట్టికల్ అనే గ్రామంలో పండించిన ఘాటైన పోగాకు, పాతర్ల పాహడ్ అనే గ్రామ వడ్రంగి చేసిన అందమైన హుక్కాను నీ ముందు కూర్చున్న తాండా నాయకునికి మర్యాద పూర్వకంగా రెండు చేతులతో అందించగలవు. అని తాండా నాయకునికి హుక్కా వర్తమానం అందించమని తాండాలోని స్త్రీలు పాడేపాటది.

13. వేతడు ఆవజన్నా ఛ్యారీ వాళేర్ గీద్

(పెళ్ళి కొడుకు వచ్చినప్పుడు అమ్మాయి వారు పాడేపాట)
ఖ్వాళజ్ ఘాలీయతో బెసియా మారోలాల్
ఝుణ్ కారియే లాల్
బాయి బాయి కీయతో బెసియా మారో లాల్
ఝుణ్ కారీయే లాల్
ధోక్ దూ కీయతో బెసియా మారో లాల్
ఝుణ్ కారీయే లాల్
ధోతి ఘాలీయతో బెసియా మారో లాల్
ఝుణ్ కారీయే లాల్.

సందర్భం: పెళ్ళికుమారుడు అతని దూత తన బంధుమిత్రులు అందరు

కలసి, తాండా నాయకుని ఇంటికెళ్ళీ అమ్మాయి వారికి వర్తమానం పంపుతారు. అమ్మాయి వారు అబ్బాయిని తమ ఇంటికి తీసుకెళ్ళి, చాపపరిచి అందర్ని కూర్చో బెడుతారు.. కాని పెళ్ళి కొడుకు అలాగే నిలబడి ఉంటాడు. అతనిని కూర్చోమనే వరకు కూర్చోకూడదని పై పాటను బంజారా స్త్రీలు పాడుతారు.

భావం : వజ్రం లాంటి ఓ వరుడా దులిపి నీయొక్క దుప్పటిని పరుస్తే మేము నీకు కూర్చోనిస్తాము. అక్క అక్క అని మాకందరికి పేరు పేరునా పిలిస్తే కూర్చోనిస్తాం. అందరికి దండం పెడుతూ నమస్కరిస్తే కూర్చోమంటాం. నీ ధోతిని పరుస్తే కూర్చోమంటాం. ఆ నీవు తర్వాత ఒక ఘడియ హాయిగా నిద్రించవచ్చు అని పై పాటను పాడుతారు.

14. వేతడు అవజన్నా-ఘరేమా లేర్ గీద్

(పెండ్లి కొడుకును ఇంట్లోలోకి ఆహ్వానించుట)

బాయి తారో దేవలడియా ఆయోయే
ఓరే కాందేపర్ సేలా ఏలా కరతో ఆయోయే
ఓరే హతే మా హోక్కా ఝోకా కావేతు ఆయోయే
నీలెడిసి ఘోడి కాందో పేరన్ ఆయీయే.

సందర్భం : పెళ్ళి కొడుకుని అమ్మాయి వారి ఇంటి ముందు కూర్చుండపెట్టి, నీళ్ళు అందించి, క్షేమ సమాచారం తెలుసుకొని తర్వాత ఇంట్లోకి ఆహ్వానిస్తారు. ఈ సందర్భంలో అమ్మాయికి ఈ విషయాన్ని తెలియ చేస్తు స్త్రీలు పై పాటను పాడుతారు.

భావం : ఓ అమ్మాయి దేవుడు లాంటి భర్త వచ్చాడమ్మా. అతని భుజం మీద శాలువా ఉన్నది. చాల కష్టపడుకుంటూ మీ ఇంటి ముందు వచ్చాడు. ఆయన చేతిలో హుక్కా కూడా ఉన్నది. అతను నీలి రంగు వర్ణం కల్గిన గుర్రం మీదకూర్చోని వచ్చాడు. ఆ గుర్రం మెడ ఊపుకుంటూ వయ్యారంగా మీ ఇంటి ముందుకొచ్చి ఆగింది. అని పెళ్లి కుమారుని గూర్చి అమ్మాయికి తెలియచేస్తారు.

15. వేతడు ఘరేమా అవజన్నా, ఛ్వారిన్ కరావ జన్నార్ డావళో

(పెళ్ళికొడుకు వచ్చినప్పుడు అమ్మాయి ఏడ్చే పద్ధతి)
"భేపకరేరో జీవేడా ఫకేరేమా
మతేఘాలో యాడీయో – "యా హీయా"
భాళే ఫణేరో సకీయా జీవేడా
ఫకేరేమా మతే ఘాలో యాడి – "యా హీయా"
ఘుంటే కాళేయేరీ యాడీయో
దుదీయాసీ చుడలేరీ యాడీయో "యా హీయా"
రూపేరీ హంసలీవాళీ యాడియో
బాజు బందే, ఛల్లా వాళీ యాడియో – "యా హీయా"

సందర్భం : పెళ్ళి కుమారున్ని ఇంట్లోకి ఆహ్వానించిన తర్వాత అమ్మాయి తరపున ఉన్న స్త్రీలు వదినలు, పెళ్ళి కూతుర్ని మధ్యలో కూర్చో బెట్టి ఏడుపుపాటను నేర్పిస్తారు. ఆ సమయంలో అమ్మాయిపై విధంగా ఏడుస్తుంది.

భావం : సుఖంగా ఉన్నటువంటి నా జీవితాన్ని, దు:ఖ సముద్రంలోకి వేయకుండమ్మా. ఓయమ్మా బాల్యం నుండి నేను చాల సుఖవంతమైన జీవితాన్ని గడిపాను. ఇప్పుడు మీరందురు నాకు దూరం అవుతున్నారు. ఓయమ్మా తలకు అద్దాల పట్టి, శరిరానికి అద్దాల రవికను ధరించినటువంటి ఓయమ్మాలారా. పాలలాంటి తెల్లని రెట్ట గాజులు కల్గిన ఓయమ్మలారా. వెండి కడియాలు వెండికంటెను ధరించిన ఓ యమ్మలారా. చేతికి గాజులు, వేళ్ళకు ఉంగరాలు కల్గిన ఓయమ్మలారా. తళ తళ మెరిసే పైట కొంగు కల్గిన అమ్మాలారా. అని ఏడుస్తుంది.

16. వేతడున్ ఘరేమా లావజన్నార్ – గీద్

(పెండ్లి కొడుకును ఇంట్లోకి తీసుకువచ్చేటప్పుడు పాడే పాట)
ఆన్ ఖడీ చారోళీ బరచీ
రోళదీనే ఓరే మోటె ససరేరే ఘర

ఖాబేటో ఓరీ మోటి సాసురీ హతేరీ బాటి
ఆన్ ఖడీ చారోళి బరిచీ
రోళదీనే ఓరే వచేటే ససరేరే ఘర
ఖాబేటో ఓరీ వచేటేసాసురీ హతేరీ బాటి
ఆన్ ఖడీ చారోళీ బరచీ
రోళదీనే ఓరే నానిక్యా ససరేరే ఘర
ఖాబేటో ఓరీ నానకీ సాసువోరీ హతేరి బాటి.

సందర్భం : పెళ్ళి కొడుకు తన మామ ఇంటికి మొదటిసారిగా ప్రత్యక్షంగా వెళ్ళకుండా, తన చిన్న పెద్ద మామల ఇంటికి వెళ్లి కూర్చుంటాడు. తరువాత తనకు అమ్మాయిని ఇచ్చే మామ ఇంటికి వెళ్ళుతాడు. ఆ సందర్భంలో పై పాటను బంజారా స్త్రీలు పాడుతారు.

భావం : పెళ్ళికొడుకు రాజులాగా అన్ని ధరించి, చేతిలో తళ తళ మెరిసే ఖడ్గాన్ని పట్టుకొని, అతని పెద్ద మామ ఇంటి ముందు వచ్చి కూర్చున్నాడు. అక్కడ వాళ్ల పెద్ద అత్తయ్య చేతి వంటకాలు తిన్నాడు. తర్వాత రెండవ మామ ఇంటికి వెళ్ళి రెండవ అత్త చేతి వంటలు తిన్నాడు. ఆ తర్వాత తన చిన్న మామ ఇంటికెళ్ళి చిన్నత్త చేతి వంటకాలు తిన్నాడు. అని అబ్బాయిపై అమ్మాయి బంధువులైన స్త్రీలు పాట పాడుతారు.

17. ఘోటా ఘోళ జిన్నార్ గీద్

(బెల్లం పానకం తయారు చేసేటప్పుడు పాడే పాట)

ఘోళ లాయో కుణ్ మంగాయో కుణ్
ఆడో భీంత లాండో కుణ్
ఘోటా ఘోళోకుణ ఘోళాయో కుణ్
ఆడోభీంత లాండో కుణ్
టోపర్ లాయోకుణ్ మంగాయోకుణ్
ఆడోభీంత లాండో కుణ్

ఘస్ గసాలో లాయోకుణ్ మంగాయోకుణ్
ఆడోభీంత లాండో కుణ్
కాళీ మిర్చి లాయోకుణ్ మంగాయోకుణ్
ఆడోభీంత లాండో కుణ్
లేజో ఛ్వార లేజో హత్లీమా ఘాలన్ లేజో
ముటీమా గోకన్ లేజో ఖోల్లీమా ఘాలన్ లేజో
మారడా నాన నానారీ తారీ ఢాకణీ.

సందర్భం : బంజారాల వివాహంలో బెల్లం పానకం తయారు చేస్తారు. అప్పుడు పై విధంగా పాటను పాడుతారు.

భావం : బెల్లం తెచ్చింది ఎవరు తెప్పించింది ఎవరు? పానకం తయారు చేసింది ఎవరు. కొబ్బరి కుడకలు తెచ్చింది ఎవరు తెప్పించింది ఎవరు. సుగంధ ద్రవ్యాలు (గస్ గసాలు, మిరియాలు) తెచ్చింది ఎవరు తెప్పించింది ఎవరు. బెల్లం పానకం తయారు చేసి అందరికి, అడ్డంగా నిలువుగా కూర్చున్న వారికి అందించింది ఎవరు. అని పై పాటను పాడుతారు.

18. ఘోటార్ -పచార్

(బెల్లం పానకం పలకరింపుగా 'సామ్యోర్ బాయి' అని పలకరిస్తారు.)

మధూరూరిరో మసాలో
తాడియారో గోళ్ వేరిరో పాణి
లాన్ ఘోళే ఘోటా పూంచోక లోటా
పూంచేకా నై పూంచే, నాయేక్
లోటా మా ఘోటా కం జాదా వతో
సదర్‌లో సమజ్‌లో నాయక్.

సందర్భం : బంజారాల వివాహంలో "ఘోటార్ నొక్తా" అంటే బెల్లం పానకం తయారు చేసి, తాండా వారందరికి ఇచ్చే పద్ధతి ఉన్నది. అప్పుడు తాండా వారందరికి, తాండా నాయకుని ఆధ్వర్యంలో బెల్లం

పానకం అందరికి అందిస్తారు. అప్పుడు పై విధంగా పలకరిస్తారు.

భావం : వినండి అన్నాల్లారా మధురానగరి నుండి మసాల తీసుకొచ్చాం. తాడేపల్లి నుండి బెల్లం, సెలయేటి నీరు తీసుకొచ్చి బెల్లం పానకం తయారు చేసి అందరికి అందించాం. అది అందిందో లేదో ఒక్కసారి మీరు చూడండి నాయక్ గారు చెంబులో పోసి అందించాం. ఎక్కువ తక్కువ అయితే సర్ధుకొమ్మని చెప్పగలరు నాయక్ గారు అని పలకరిస్తారు.

19. ఛ్వారీర్ ఘుగరా ఛోడ జన్నార్ – గీద్

(అమ్మాయి కాళ్ళ గజ్జెలు తీసేటప్పుడు పాడేపాట)

'కురే వేరీ హటేరే ముంగే మోలాయి ఘుగరా
తోళాతీ తోళాభరే ముంగే మోలాయి ఘుగరా
సోనేరే తారేదేన రూపేరీ డాండీ ఘాలేన
తోలాయి ఘగరా బండీ రపీయారో పెచ్చు
భాందానా తోలాయి ఘుగరా
అందారి రాతేమా టూటే జావతో
చాందణే రాతేమా దీవేలో బాళనే
గుంతాయీ ఘుగరా
దనీయారీ ఛ్వారీఓ గుంతాయియేన
సణ్ సుంతలియోనే మహుసణీయే
పాటేరీ ఛాడామా గుంతాయి ఘుగరా'

సందర్భం : బంజారాల ఆచారంలో పెళ్ళి కాని అమ్మాయిలందరు కాళ్ళకు గజ్జెలు కట్టే ఆచారం ఉంది. పెళ్ళి సందర్భంలో అమ్మాయి కాళ్లకున్న గజ్జెలను ఆచారం ప్రకారం తన స్వంత అన్నయ్య విప్పాలి. ఆ సందర్భంలో అమ్మాయి తన అన్నను పట్టుకొని ఏడుస్తూ పై పాటును పాడుతుంది.

భావం : కురివి అనే బంజారాల వస్తువులను అమ్మే సంత నుండి, ఖరీదైన

కాలి మువ్వలను తులం తులంగా ఖరీదు చేసి కొన్నాను. ఈ మువ్వలను బంగారు త్రాసులో తూకం వేయించాను. వెండి కాంటతో బరువును తూకం వేయించాను. రూపాయలు ఒక వైపు నా మువ్వలను ఒక వైపు వేసి సరి సమానంగా నా యిష్ట ప్రకారం కొన్నాను. ఆ మువ్వలను చీకటి రాత్రిలో ఎవ్వరూ చూడకుండా తగు జాగ్రత్తగా అల్లించాను. వెన్నెలలో వాటిని కాళ్ళకు కట్టుకున్నాను. నా స్నేహితురాళ్ళు అందరు గోగు నారతో అల్లించారు. కాని నేను మాత్రం పట్టు దారంలో తయారు చేసిన సన్నని తాడుతో అల్లించాను. అని అమ్మాయి తన కాళ్ళకు ఉన్న మువ్వలను పెళ్ళికి ముందు తన స్వంత అన్న లేక తమ్ముడు తీసేటప్పుడు మువ్వలపై మోజును గూర్చి అమ్మాయిచే పాట పాడిస్తారు.

20. ఘుగరా ఛోడజన్నార్ ధావళో

(అమ్మాయి కాళ్ళ గజ్జెలు తీసేటప్పుడు ఏడ్చే పద్ధతి)

'భీయోరే 'యా హియా'
మారే టాంగేరే గుగేరా – 'యా హియా'
తోడలీదేనా 'యా హియా'
మారి టాంగే ఫకీ ఫకీ 'యా హియా'
జాయే లాగీ భీయా 'యా హియా'
భీయోరే 'యా హియా'
మారే ఘుగేరా 'యా హియా'
ఛోడలేనా 'యా హియా'
ఫీళీ జారేరి రాసీ 'యా హియా'
కూ మారేజూ మారేదినో భీయా 'యా హియా'
భీయోరే 'యా హియా'
తారే హతేనే వాఛీ భారీ 'యా హియా'
లాగీయే ఫణేన 'యా హియా'
మారి టాంగేన భారికొని లాగి భీయా 'యా హియా'
భీయోరే 'యా హియా'

మారే ఘుగరా ఛోడలేనా 'యా హియా'
కుణేసి ఛేనేరి 'యా హియా'
భాందూ కరేనా 'యా హియా'
ఛోడరోచి భీయా 'యా హియా'

సందర్భం: అమ్మాయి కాళ్ళకు గజ్జెలు కట్టుకుంటుంది. ఆ గజ్జెలను పెళ్ళి సమయంలో ఒక రోజు తన అన్నతో విప్పిస్తారు. ఆ సందర్భంలో పై విధంగా అమ్మాయి తన అన్నను పట్టుకోని ఏడుస్తుంది.

భావం : ఓ అన్నయ్య మీరు నా కాళ్ళకు ఉన్న గజ్జెలను (మువ్వలు) తీసేస్తున్నారు. అవి తీసేసిన తర్వాత నా కాళ్ళు ఎలాగో సత్వం లేకుండా ఏదో పోగొట్టుకున్న దానిలాగా అనిపిస్తూంది. ఓ అన్నయ్య మీరు నా కాళ్ళ గజ్జెలు తీసేసి పసుపు రంగులో ఉండే జొన్నల రాశి ఏవిధంగా ఒక దగ్గర పోస్తామో ఆ విధంగా నా గజ్జెలన్నింటిని ఒక దగ్గర కుప్పగా పోగేసినావు. ఓ అన్నయ్య నీ చేతికి నీ గడియారం బరువేమో కాని నా కళ్లకు గజ్జెలు బరువు కాదు. ఓ అన్నయ్య మీరు నా గజ్జెలు తీసేసి ఇంకా ఏ చెల్లెలికి కట్టాలని నా గజ్జెలను తీసేస్తున్నారు.. అని అమ్మాయి గజ్జెలను తీసేటప్పుడు చాలా మారాం చేస్తూ, తన గజ్జెల గూర్చి ఏడుస్తుంది. బంజారాలు ఏడ్చే పద్ధతిలో ప్రతి ఏడ్పు పాట చివరనా 'యా హీయా' అనే దు:ఖ చరణం రావటం మామూలుగా ఉంటుంది.

21. వాయా భాందజన్నా లకడీ, గాళార్ గీద్

(పెళ్ళి చేయునప్పుడు కట్టెలకు తాడుతో కట్టే పాట)

'లకడీ లాయోకుణ్ మంగాయో కుణ్ ఆడో భీంత లాండో కుణ్'
ఖారకే లాయోకుణ్ మంగాయో కుణ్ ఆడో భీంత లాండో కుణ్
గాళా లాయోకుణ్ మంగాయో కుణ్ ఆడో భీంత లాండో కుణ్
జాగ్ మాపో కుణ్ మపాయో కుణ్ ఆడో భీంత లాండో కుణ్
సోటా రోపో కుణ్ రోపాయో కుణ్ ఆడో భీంత లాండో కుణ్
మెండల్ భాందో కుణ్ భందాయో కుణ్ ఆడో భీంత లాండో కుణ్

కాకొటి చడో కుణ్ చడాయో కుణ్ ఆడో భీంత లాండో కుణ్
మేదిపిటి ఘస్సో కుణ్ ఘస్సాయో కుణ్ ఆడో భీంత లాండో కుణ్
క్వాళియా ఖాదోకుణ్ ఖోరాయో కుణ్ ఆడో భీంత లాండో కుణ్
రపీయా పకడో కుణ్ పకడాయోకుణ్ ఆడో భీంత లాండో కుణ్.

సందర్భం: బంజారాల వివాహంలో గరిగే ముంతలకు చాలా ప్రాధాన్యత గలదు. అలాగే చిన్న పెద్ద కొత్త కుండలను తెచ్చి వాటికి రంగులు వేసి అమ్మాయి వారింటి ముందు, ఆరు బయట నాల్గు దిక్కులకు కొత్త కుండలను ఒక్కొక్క దాని పై ఒకటి మూడు చోప్పున పెడుతారు. వాటి చుట్టు జిల్లేడు కట్టెలతోను మోదుగు ఆకులతోను తాడుతో కడతారు. ఆ సందర్భంలో పై పాటను బంజారా స్త్రీలు పాడుతారు.

భావం : కట్టెలను తెచ్చింది ఎవరు తెప్పించింది ఎవరు. వాటిని అడ్డంగా, నిలువుగా పేర్చినది ఎవరు. ఇనుప తీగలను తెచ్చిందెవరు. తాడును తెచ్చిందెవరు తెప్పించింది ఎవరు. ఆ తాడును అడ్డంగా కుండలకు కట్టిందెవరు. ఆరు బయట నలు దిక్కులకు సమానంగా భూమిని కోలచింది ఎవరు కొలత వేయించింది ఎవరు. మధ్యలో రోకలిని పాతింది ఎవరు పాతించింది ఎవరు. అడవి కాయలను తెచ్చింది ఎవరు. తెప్పించింది ఎవరు. అన్నం ఆరా పెట్టుకునే కాకొటిని ఎవరు తెప్పించారు, ఎవరు తెచ్చారు. మైదాకును పూసింది ఎవరు పూయించిందేవరు. వధూవరులకు సాముహిక భోజనాన్ని ఎవరు తినిపించారు. రూపాయి బిళ్ళను పట్టిందేవరు. అని పాట రూపంలో స్త్రీలు పాడుతారు.

22. వేతడుర్ కాకోటిపర్ హోంగోళీర్–గీద్ (పెళ్ళి కొడుకును మంగళస్నానం చేయించేటప్పుడు మరదళ్లు పెళ్ళి కుమారుని పై పాడే పాట)

'వేతడురే యాడీ గద్దీ భారి చరావ
ఒరే లారే గద్దా హాలేన చాల

వేతదురీ భోజాయి సూగ్రీ భారి చరావ,
ఓరే లారే సూగ్రో హలేన చాల
వేతదురిబాయి గావడి భారి చరావ
ఓరే లారే సాండీయా హలెన చాల
వేతదురి బేన గొర్లి భారి చరావ
ఓరే లారే గొర్ల హలేన చాల
కా చీ పాకీ సఫారీ సిందాపర్
వేతదురే యాడీ ఇండాపర్'

సందర్భం : బంజారాల వివాహంలో వాయు భాందేరో నొక్తా! పెళ్ళి చేసే కార్యం రోజు వధూవరులకు బహిరంగంగా స్నానం పెళ్ళి పందిట్లో చేయిస్తారు. అలా చేయించేటప్పుడు అబ్బాయిని తిట్టుకుంటూ పై పాటను మరదళ్ళ వరసైన వారు పాడుతారు.

భావం : అబ్బాయి తల్లి గాడిదలు మేపుతుంది. ఆమె వెంట మగ గాడిదలు పరుగులు తీస్తున్నాయి. అబ్బాయి వదినలు పందులు మేపుతారు. వాళ్ళవెంట మగ పందుల గుంపు పరుగులు తీస్తుంటాయి. అబ్బాయి యొక్క అక్కలు ఆవుల మంద మేపుతారు. వారి వెంట ఆంబోతులు గుంపు పరుగులు తీస్తున్నాయి. అబ్బాయి యొక్క చెల్లెలు గొర్రెలను కాపుతుంది. ఆమె వెంట పొట్టేళ్ళు పరుగులు తీస్తుంటాయి. పండుపండనివి, కాయగా ఉన్న వక్కలు మొగ్గపై ఉన్నాయి. అబ్బాయి యొక్క తల్లి గుడ్లను పొదుగుతుంది. అని అబ్బాయి వారి బంధువులందర్ని సరదాగా పాట రూపంలో తిడుతారు.

23. వేతుడున్ కాకోటిపర్ హోంగోలీ కరావణన్నార్ గీద్

(పెళ్ళికొడుకును మంగళ స్నానం చేయించేటప్పుడు పాడే పాట)

'కాకోటిపర్ బేటోర ఖటర్ ఖోలీయా
తూ కస్సోదికాచీరే ఘోల టాటీయా
కాకోటిపర్ బేటోర భూర ముచీయా

తూ కస్సోదికాచీరే ఖటర్ ఖోలీయా
వేతడురే టాంగే హేట గంగా వేయిజా
గంగామారి మిటకిటరాట మారిజా
వేతడురే కానచేసి ధానమాంగరో
వేతడురే చోట్టి ఛేని బొట్టి మాంగరో
వేతడురే కనాళో పాటియా'

సందర్భం : పెళ్ళి కొడుకుకు అన్నం ఆరా పేట్టుకునే చెక్క పల్లెం(కాకొటి)పై బంజారాల ఆచారం ప్రకారం మంగళ స్నానం చేయించేటప్పుడు పై పాటను పాడుతారు.

వివరణ : పెళ్ళి కుమారుడికి మంగళ స్నానం చేయించేటప్పుడు అతని శరీర దారుఢ్యం తెలుసుకునేందుకు, మరదళ్ళు అందరు కలిసి పీటపై నుండి క్రిందికి నెట్టేస్తూ మట్టి బురద అంతా పెళ్ళి కుమారుని వీపుపై పూస్తారు. వాటన్నింటిని నివారించి స్నానం చేస్తాడు. అప్పుడు మరదళ్ళు ఇలా బావపై పై పాటను పాడుతారు.

భావం : పీటపై కూర్చున్న ఓ పొట్టి బావగారు. మీరు కందిరీగలా కనబడుతున్నారు. కానీ మీ మీసాలు గోధుమరంగులో ఉన్నాయి. అవి చూడాలంటే అసహ్యంగా ఉన్నవి. ఓ పొట్టి బావ గారు మీరు స్నానం చేస్తున్నపుడు మీ కాళ్ల క్రింద నుండి నీళ్లు గంగా నదిలాగా ప్రవహిస్తున్నట్లుంది. అందులో కప్పలు అరుచుకుంటూ తెప్పలుగా కొట్టుకొని పోతున్నట్లనిపిస్తుంది. ఓ బావ గారు మీకు చెవులు లేవు గాని అన్నం అడుగుతావు. మీకు జుట్టు లేదు కాని, మాంసాహారం అడుగుతారు. పోడుగాటి చెవులు కల్గిన ఓ బావగారూ అని పెళ్ళి కుమారునిపై మరదళ్ళు అందరు కలిసి ఎగతాళిగా పాటను పాడుతారు.

24. ఛ్వారిన్ కాకొటిపర్ హోంగోళీ కరావణన్నార్ - గీద్

(అమ్మాయిని మంగళ స్నానం చేయించేటప్పుడు ఆమె బాల్యంలో ఏ కొంటె పనులు చేసేదో తెలియ చేసే పాట)

'ఛ్వారీ ఏతితి జనా దాంతీయాన మసీయా
లగాడ తితి చల్ చ్వారియే కాకొటి చడ్ బ్యాటి
ఛ్వారీ ఏతితి జనా చాలతే ఛోరాన్ భాటా
మారతితి చల్ ఛ్వారీయే మేదిపిటి ఘస్స్ బ్యాటీ
ఛారీ ఏతితి జనా చాలతే ఛోరాన్ సైగా
కరతితి చల్ ఛ్వారియే క్వాళీయం ఖా బ్యాటి
ఛ్వారీ ఏతితి ఫణ్ హణే హణ్ కణ్ కణ్
కరతితి చల్ చ్వారియే ఫేరా ఫర్ బ్యాటి
ఛ్వారీ ఏతితి జానా దాంతీయాన మసీయా
లగాడతితి చల్ ఛ్వారియే గోడియా దాబే బ్యాటి'

సందర్భం : పెళ్ళి కూతురికి బహిరంగంగా మంగళ స్నానం చేయించేటప్పుడు, అమ్మాయి వదినలు అందరు ఆమె యొక్క చిన్న నాటి చిలిపి చేష్టలన్నింటిని గుర్తు చేస్తూ పై పాటను పాడుతారు.

భావం : ఓ పిల్లా నీవు చిన్నతనంలో అనేక కొంటె చేష్టలు చేసేదానివి. నీవు అందరికి నల్లనిమసి పూసే దానివి. ఇప్పుడేమో మంగళ స్నానానకి చెక్క పల్లెం పై సిద్ధంగా కూర్చున్నావు. నీవు కన్యగా ఉన్నపుడు, దారిన పోయే యుక్త వయస్సు కల్గిన మగ పిల్లలకు రాయి తీసుకొనికొట్టేదానివి మరి సైగ చేసే దానివి. ఇప్పుడేమో మైదాకు పూసుకొని, నీ భర్త ప్రక్కన మోకాలు అద్ది కూర్చున్నావు. పెరుగన్నంతో ఎంగిలి మెతుకులు తిని కూర్చున్నావు. నీ భర్త వెంట ఏడు అడుగులు తిరిగి అతని ప్రక్కన హాయిగా కూర్చున్నావు. అని అమ్మాయి బాల్యంలో చేసిన కొంటె చేష్టలను చెబుతూ, ముత్తైదువలు అమ్మాయి మీదపాట పాడుతారు.

25. ఛ్వారిన్ కాకోటిపర్ – హోంగోళీ కరావ జిన్నార్ ధావళో

(అమ్మాయికి మంగళ స్నానం చేయించేటుప్పడు ఏడ్చే పద్ధతి)

'యాడియేజే యా హీయా
జాళే నాకీ యేతో యా హీయా

నాని మోటి యా హీయా
మాచళియోరో జీవేడా యా హీయా
కూ ఫందావేజు యా హీయా
తమారీ నానికేయేసి యా హీయా
బేటియేరో జీవడా యా హీయా
ఫందాయే మారి యాడియో యా హీయో
బాళే ఫణేరో సకీయా జీవేడా యా హీయా
ఫకరేమా మతే ఘాలో యాడీయో యా హీయా'

సందర్భం : పెళ్ళి కూతురుకి మంగళ స్నానం చేయించేటప్పుడు తన బాల్య జీవితంలో గడిపిన సుఖమైన అనుభవాలను తలుచుకొని రాబోయే కష్టాలను ఏడ్పు పాట ద్వారా వ్యక్తపరుస్తూ పై విధంగా ఏడుస్తూంది.

భావం : ఓయమ్మలారా బాల్యం నుండి హాయిగా, సుఖంగా పెరిగిన నా జీవితం. ఈ రోజు నుండి కష్టాలు అనుభవించబోతున్నది. అది ఏలానంటే జాలరి వాడు వల వేసినపుడు వలలో చిన్న, పెద్ద చేపలు ఏ విధంగా చిక్కుతాయో ఆ విధంగా ఈ రోజు నుండి చేపలాగా నా జీవితం అయిపోతుందేమోనని భయంగా ఉందమ్మా. ఓ అమ్మలారా నా సుఖాలన్ని పోతున్నవి. అని అమ్మాయిని తన గత జీవితాన్ని భవిష్యత్తును ఊహించుకొని ఏడ్చే పద్ధతి.

26. డొరణ్ భాంద జన్నార్ – గీద్

(దారంతో బ్రహ్మ ముడులు వేసేటప్పుడు పాడే పాట)

'లాడీరీ గళేపర్ సోనేరో మాళా
లాడారి గళేపర్ లాకడేరో మాళా
కూ ఛూటే లాడీ కూ ఛూటే లాడీ
సమీయే సాందేరో ఆజీయే రాతేరో మాళా
కూఛూటే లాడీ కూఛూటే లాడీ

తారే నాయకే బావురే హతేరో బాధవో
డోరణే కూ ఛూటే లాడీ కూ ఛూటే లాడీ
సమీయే సాందేరో ఆజీయే రాతేరో మాళా
కూఛూటే లాడీ కూ ఛూటే లాడీ
రామ లచమణేరో హతేరో డోరణ
చోడుకా నై ఛోడుకా
భారీ బాదారీ డోరణే
కూఛూటే లాడీ కూ ఛూటే లాడీ

సందర్భం : బంజారాలలో తాళి బొట్టు ఉండదు. కాబట్టి వీరు తెల్లటి దారాన్ని తీసుకొని వధూవరుల చేత ఒకరి చేత ఒకరికి దారం శరీరం చుట్టు ఏడుసార్లు చుట్టించి, ఆ దారాన్ని ఏడు బ్రహ్మముడులు వేసి మెడలో వేయిస్తారు. అలా వేయించిన ముడులను దారం తెగకుండ అందరి సమక్షంలో తగు జాగ్రత్తగా విప్పిస్తారు. ఆ సందర్భంలో పై పాట తాండా స్త్రీలు పాడుతారు.

భావం : అమ్మాయి మెడలో బంగారు తీగలతో బ్రహ్మ ముడులు వేశాం.. అబ్బాయి మెడలో చెక్కలతో చేసిన ముంగలు గల హారం వేశాం.. ఈ రెండు బ్రహ్మ ముళ్ళు ఏ విధంగా విప్పాలి. నడి రేయి నుండి తెల్లవారే వరకు ఎన్ని కష్టాలు పడి విప్పిన ఈ ముళ్ళు రావటం లేదు. ఈ బ్రహ్మ ముడులను తాండా నాయకుని చేతితో వేయించినాము. ఈ బ్రహ్మ ముడులు గల దారం ఏ విధంగా విప్పిన రావటం లేదు. మధ్య రాత్రి నుండి ప్రయత్నిస్తున్నాము. అయినా ముడులు రావటం లేదు. బహుశా ఈ ముడులు, రామలక్ష్మణులు వేసి ఉంటారు. వారిద్దరు ఒకరిని విడిచి ఒక్కరు ఉండలేరు. కాబట్టి ఇద్దరికి వేసిన బ్రహ్మముడులు విడదీయటం కష్టంగా ఉన్నది. అని బ్రహ్మముడులు వేసి, విప్పేటప్పుడు ఈ పాటను ముత్తైదువలు అందరు కలిసి సామూహికంగా పాడుతారు.

27. ఛ్యారీ ఛ్యారన్ - సాత్ ఫేరా ఫేర జన్నార్ గీద్"

(అబ్బాయి, అమ్మాయిలను హోమ గుండం చుట్టు ఏడు అడుగులు తిప్పుతూ పాడే పాట)

'ఏకజ్ లటకో ఫరియాయే లాడీ
ఫరీయా ఫరియాయే లాడీ
దీజ్ లటకో ఫరియాయే లాడీ
ఫరియా ఫరియాయే లాడీ
తినజ్ లటకో ఫరియాయే లాడీ
ఫరీయా ఫరియాయే లాడీ
చారజ్ లటకో ఫరియాయే లాడీ
ఫరీయా ఫరియాయే లాడీ
ధపే రోపన్ ఫరియాయే లాడీ
ధపే రోళ ధపే రోళయే లాడీ
ఫరీయా పరీయాయే లాడీ'

సందర్భం : వధూవరులను మంగళ స్నానం చేయించిన తర్వాత తడి బట్టలతో కొంగు ముడి వేసి, ఇరువురిని రోకళ్ళు, కాకొటి అనే చెక్క పళ్ళెం చుట్టూ, మధ్యలో హోమ గుండం తీసి, అగ్ని సాక్షిగా ఏడు అడుగులు తిప్పుతారు. ఆ సందర్భంగా పాటను స్త్రీలు పాడుతారు.

భావం : ఓ అమ్మా నీవు నీ భర్త వెంబడి, అతని అడుగులో అడుగులు వేసుకుంటూ ఒక చుట్టూ వరుస తిరిగి రావమ్మా. నీ అడుగులు తొందర పాటు లేకుండా నిదానంగా అడుగులు వేస్తూ తీస్తూ, జింక పిల్లలాగా వయ్యారంగా వేస్తూన్నావు. రెండవ అడుగు వేయమ్మా. అదే విధంగా మూడవ అడుగు, నాలుగవ అడుగులు ఈ విధంగా ఏడు అడుగులు వేస్తూ, నీ భర్త అడుగు జాడలలో నడుచుకోవమ్మా. అని అమ్మాయికి నీతులు చెబుతూ ఏడు అడుగులు ఏ విధంగా నడవాలో అమ్మాయి బంధువులు అయిన స్త్రీలు నేర్పుతారు.

28. ఛ్యారిన్ వాంకడీ పేరావ జన్నార్ – గీద్

(అమ్మాయి కాళ్ళకు కడియాలు తొడిగించేటప్పుడు పాడే పాట)

'జాతేరో సోబో మన కొని సోవయే యాడివో
జాతేరో సోబో మారి భావజనే సోవయే యాడివో
జాతేరో కుందో ఖాందో ధుండీ ధాండో సోబో
మారీ జావ ణేరో సోబో మనకోని సోవయే యాడివో'

సందర్భం : పెళ్ళి కూతురుకి పెళ్ళి ముందు రోజు కాళ్ళకు "వాంక్డీ" అనే మువ్వల కడియాలను తొడిగించటానకి ఊరికి తీసుకెళ్ళుతారు. అమ్మాయి వెంట కొంతమంది స్త్రీలు కలిసి వెళ్ళుతారు. ఆ సందర్భంలో పై పాటను అమ్మాయి పాడుతుంది.

భావం : పరాయి ఆడవాళ్ళు వేరే గోత్రం వారు ధరించినటువంటి వస్త్రాలు నాకు వద్దమ్మా. ఓయమ్మాలారా వేరే వారు ధరించిన వస్తువులు మా వదినలకే కాని నాకు వద్దమ్మా. ఓ అమ్మలారా ఎక్కడో వెతికి పాతబడిన వస్తువులు, వస్త్రాలు నాకు వద్దమ్మా. అవన్నీ మా స్నేహితురాళ్ళకు ఇచ్చేయండి నాకు కొత్తివి మాత్రమే ఇవ్వండి. అని అమ్మాయికి నూతన వస్త్రాలంకరణ, నగలు ధరింప చేసేటప్పుడు పాడే పాటది.

29. చూడేర్ నొక్తార్ – గీద్

(రెట్టా గాజులు తొడిగించే టప్పుడు పాడే పాట.)

'మతే ఘాలోయే మారీ పరదేశణ్ యాడీ
ఘుగరీయేరి జోల్ ఘాలోరీయో జోల్
మతే ఘాలోయే పరదేశణ్ యాడీ
ఘుంటే టోపలివాళీ యాడీ ఘాలేరియే జోప్
మతే ఛోడియే మారీ పరదేశణ్ భావజో
మారీ సోనే పటడియేరి టోప్'

సందర్భం : బంజారాలలో తాళి బొట్టు ఉండదు. కావున వీరు రెట్ట గాజులనే తాళి బొట్టుతో సమానంగా భావిస్తారు. వీరి వివాహంలో అన్ని కార్యాలు

పూర్తి అయిన తర్వాత బంజారా స్త్రీలందరు అమ్మాయికి రెట్టగాజులు అబ్బాయి చేత తొడిగిస్తారు. ఈ సందర్భంలో అమ్మాయి పాట రూపంలో తన బాధను వ్యక్త పరుస్తుంది.

భావం : అమ్మలారా మీరందరు కలిసి నాకు రెట్ట గాజులు తొడిగిస్తున్నారు అవి నాకు వద్దమ్మా. నేను ఎప్పుడు మీ ఇంట్లో చిన్న పిల్లలాగే ఉండాలని ఉంది. నాకు అద్దాల ముసుగు, అద్దాల రవికా, చెవుల దగ్గర మువ్వలు కాళ్ళకు మువ్వలు కాళ్ళకు కడియాలు ఇవన్ని నాకు వద్దమ్మా. నన్ను కన్న ఓ అమ్మలారా నన్ను పెళ్ళి కూతురుగా మార్చకండి. బాలికగానే ఉండనీయండి అని అమ్మాయి పాడేపాట అది.

30. ఛ్యారీర్ చూడోతిపజన్నా రాతేన్ శేరావేరో -గీద్

(అమ్మాయికి, రెట్టా గాజులు తొడిగించేటప్పుడు రాత్రిని వేడుకునే పాట)

"తూ ఘడీ ఏక్ వదశ్, వదేశయే ఛాందణేరియే రాత్
తూ వదేశతో మారి మడేగీయోరో గోదేమా సోయుయే రాత్
తూ ఘడీఏక్ వదేసయే తారే పూజా కరియుయే చాందణేరియేరాత్
తూ వదేసతో మారి యాడీయేరి గోదేమా సాయుయే రాత్"

సందర్భం : అమ్మాయికి రెట్ట గాజులు తొడిగించిన తర్వాత రెండు వెండి తొడుగులను గాజులకు అమరుస్తారు. అది అమర్చిన రోజే అమ్మాయిని ఇంటి నుండి బయటికి తీసి కూర్చుండ పెడతారు. అప్పుడు ఆ రాత్రి అలాగే తెల్ల వారకుండా ఉండిపోవాలని, పెళ్లి కూతురు రాత్రిని శరణు వేడుకునే సందర్భంలో పై విధంగా పాట పాడుతుంది.

భావం : నీవు ఒక్క ఘడియా పెర్గమ్మా వెన్నెలలో తెల్లగా మెరిసే ఓరాత్రీ నీవు ఒక నిమిషము ఆలస్యంగా తెల్లారితే, నేను మా అమ్మ ఒడిలో హాయిగా నిద్రించవచ్చు. అలా కనుక నీవు నాకు సహాయపడితే ఎల్లప్పుడు నీకు పూజలు చేస్తానమ్మా అని అమ్మాయి రాత్రిని శరణు వేడుకుంటుంది.

31. "చూడో తీపి జన్నా – భీయాన్ మళేరో ధావళో"

(రెట్ట గాజులు ఎక్కించేటప్పుడు పెళ్ళి కూతురు తన అన్నను పట్టుకుని ఏడ్చే పద్ధతి)

'వీరే నారే మన తీపే గడచరే – "యా హీయా"
సోనేస్ చాంద్ ణేరో భీయా "యా హీయా"
సాతి భాయిరీ హుస్సేణ్ భేన్ "యా హీయా"
జరా ఢీలో ఘాలోరే భీ యా "యా హీయా"'

సందర్భం : పెళ్ళి కుమార్తె రెట్ట గాజులకు, వెండితో చేసిన రెండు తీగలను చుట్టుతారు. ఆ సమయంలో పెళ్ళి కుమార్తె తన అన్నను పట్టుకొని ఏడుస్తుంది.

భావం : ఓ అన్నయ్య నీవు చూట్టే ఈ వెండి తీగలు నాకు కుచ్చు కున్నాయి. బంగారం, వెండిలాంటి ఓ అన్నయ్య నేను మీ ఏడుగురు అన్నదమ్ములకు ఒకే ఒక ఆడపిల్లను. అన్నయ్య మీరు అందరు నాకు దూరమవు తున్నారు. ఓ అన్నయ్య మీరు ప్రేమగా వేసే ఈ వెండి తీగలు చాలా జాగ్రత్తగా చుట్టండి. లేకుంటే అవి గుచ్చుకుంటాయి. అని అమ్మాయి తన అన్నను పట్టుకుని ఏడుస్తుంది.

32. ధ్యారీర్ భీయా టికో లాగాడజన్నార్ ధావళో

(అమ్మాయికి, తన అన్న నూదుటి తిలకం పెట్టెటప్పుడు అమ్మాయి ఏడ్చే పద్ధతి.)

'భీయోరే యా హీయా
తారీ భేనేన యా హీయా
జాతేరో హళదేరోటికో యా హీయా
మనకొని ఖలే భీయా యా హీయా
భీయోరే యా హీయా
సింగారామేరి యా హీయా
ఆడీ తెడి యా హీయా

బేజారేమా యా హీయా
ఖుందీ ఖాందో యా హీయా
హాళదేరో టికో యా హీయా
మారి భావజోనే యా హీయా
సోవ పణేన యా హీయా
మన కోని సోవ భీయా యా హీయా'

సందర్భం : బంజారాల వివాహ వ్యవస్థలో వధువుకు పసువు బొట్టు పెట్టే ఆచారం ఉంది. ఆ బొట్టును తన స్వంత అన్నయ్య చేత పెట్టిస్తారు. ఆ సందర్భంలో అమ్మాయి తన అన్నను పట్టుకుని ఏడుస్తుంది.

భావం : ఓ అన్న ఈ రోజు నుండి నీ ముద్దుల చెల్లెలికి పరాయి ఇంటి స్త్రీగా మారుస్తున్నారు. నాకు నీ చూపుడువేలుతో నుదిటిన పసుపుతో తిలకము దిద్దుతున్నావు. ఇది నాకు వద్దన్నా. నేను ఎల్లప్పుడు మీతోనేకలిసి ఉండాలని ఉన్నదన్నా. ఓ అన్న ఆ పసుపును ఊరి బజార్లో అందరు తొక్కి పడేసిన పనకిరాని పసుపుతో నాకు తిలకం దిద్దుతున్నావు. ఇది నాకు వద్దన్నా. బజార్లో అడ్డం, దిడ్డంగా తొక్కబడిన పసుపు తిలకం మా వదినలకే పెట్టండి నాకు వద్దన్న. అని అమ్మాయి తన అన్నను మెడపట్టుకుని ఏడ్చే పద్ధతి బంజారాల్లో కన్పిస్తుంది.

33. గోటేర్ నొక్తార్ –గీద్ (బంతి కార్యం పాట)

"కానకరేలా ఖలరిచ మోతిరే
మారో తాండేరో నాయకే బాపు
సిక్‌ద సికదరే బా తారీ సికేనా
ఏక్ హట్‌భాందూ ఛేటిరే వాట్
మళల మళలరే బా తారీ బేటినే
ఘడి ఏక్ మళలరే బా
సిక్‌దా సికదరేబా తారీ బేటియేన
ఘడి ఏక్ సికదరే బా"

సందర్భం : బంజారాల్లో గోట్ అనగా విందు కార్యం రోజు మేకలు, గొర్రెలను దేవతలకు బలి ఇస్తారు. అప్పుడు బంధు మిత్రులు, తాండా నాయకుడు, ప్రజలు అందరు ఈ కార్యంలో పాల్గోంటారు. ఆ సందర్భంలో తాండా నాయకుని పట్టుకుని అమ్మాయి ఏడుస్తుంది.

భావం : తండ్రిలాంటి ఓ తాండా నాయకుడా. నీ చెవులకు ముత్యపు రింగులు ధరించినావు. నీవు ఒకసారి నేను అత్తవారింట్లో ఏ విధంగా మెసులుకోవాలో నా చెవులలో చెప్పు తండ్రి. నీ నీతులను మూట కట్టుకుని నా కోపాన్ని ద్వేషాన్ని చాలా దూరం చేసేస్తాను. ఒక్కసారి నన్ను నీ మెడ పట్టుకుని మనస్ఫూర్తిగా ఏడవనివ్వు నాయనా. ఒక నిమిషం నా బాధను నీతో చెప్పుకో నివ్వు తండ్రీ. నీ మాటలను నేను జవదాటను తండ్రీ. బంగారం లాంటి నీతులు చెప్పు తండ్రీ. అని అమ్మాయి తాండా నాయకుని పట్టుకుని ఏడ్చే సంప్రదాయం బంజారాలలో ఉన్నది.

34. ఛ్వారీ కుకడేన, బాపేన, తాండేర్ నాయోకేన శేరావ జన్నార్–గీద్

(అమ్మాయి కోడి పుంజును, తండ్రిని, తాండా నాయకుని వేడుకుని పాడే పాట)

'తూ ఘడీ ఏక్ బొలేస మతరే
మారే దాదావురో పాళో పోసో బాంగే వాళో కుకాడో
తూ భోలీసేయేతో మారే దాదావోరీ
కానేమా సొరా పడియరే కుకాడో
తూ ఘడీఏక్ మత బొలేసరే
మారే బాపువోరో పాళోపోసో బాంగే వాళో కుకాడో
తూ బోలిసియతో మారే బాపువోరీ
కానేమా సోరా పడియరే కుకాడో
తూ ఘడీఏక్ మత్ బొలేసేరే
మారే కాకావురో పాళో పోసో కుకాడో

తూ బోలి సియతో మారే కాకావోరే
కానేమా సోరాపడియరే కుకాడో
తుసుతోరే లాంబో లచ్
తారే కుంటి తాణన్ సుతోక
జాగోరే బా తారీ బేటియేమా
ఆజేయే రాతేరో సమియో సాందేరో
ఏక్ అక్కర పడేరే బా తోనే
కూ నింద్ అవరిచే బా
తూ సుతోక జాగోరే మారో
సంగరీరో నాయక్ బా'

సందర్భం : అమ్మాయికి పెళ్ళి అయిన తర్వాత మరసటి రోజు అత్తవారింటికి పుంపుతారు. అలా అప్పగింతలు చేసే ముందు రోజు అమ్మాయి తన తాండా నాయకుని, (కోడి కూత కూసే) కోడి పుంజును శరణం వేడుకుంటుంది. ఆ సందర్భంలో అమ్మాయి పాడే పాటది.

భావం : మా నాన్నగారు పెంచి పోషించిన పెద్దగా అందమైన జుట్టు కలిగిన ఓ కోడి పుంజా. నీవు ఒక రోజు కూత పెట్టడం మానేస్తే, నేను ఈ రోజు హాయిగా మా తాత గారి ఒడిలో నిద్రించవచ్చు. ఓ కోడి పుంజూ నీవు ఒక ఘడియ ఆలస్యంగా కూస్తే, నేను ఒక రోజు మా నాన్న మా చిన్నానా, మా అమ్మ ఒడిలో పడుకొా వచ్చు. నీవు కనుక రోజులాగా కూస్తే మా తాత, మా నాన్న, మా చిన్నాన్న చెవిలో నీ కూత పడుతుంది. వారందరు లేసి నన్ను అత్తవారింటికి సాగనంపుతారు. కనుక నీవు ఒక రోజు కూత కూయ వద్దని ప్రార్థిస్తుంది. తర్వాత ఓ నాన్న నీవు హాయిగా నిటారుగా కొంతసేపు కాళ్లు చేతులు ముడుచుకొని పడుకుంటున్నావు. నీ కూతురితో ఋణం తీరిపోయిందని అనుకుంటున్నావా నాన్నా. నీకు బాధగా లేదా, నీకు నిద్ర ఎలా వస్తుంది. అని తన తండ్రి గారు పడుకున్న విధానాన్ని

తెలియజేస్తూ, తన తాండా నాయకునికి కూడా నీవు నిద్రిస్తూన్నావా లేక నా గూర్చి చింతిస్తున్నావా నాయకుడా అని అందరిని పలకరిస్తున్నట్లుగా శరణు వేడుకుంటున్నట్లుగా పాట రూపంలో అమ్మాయిచే బంజారా స్త్రీలు పాడిస్తారు.

35. ఛ్వారీన్ ళళద్ (డోలియా) –చడావ ఙన్నార్ – గీద్

(అమ్మాయిని ఎద్దు పై ఎక్కించేటప్పుడు పాడే పాట.)

'డోలీయావోరే, ఝూమేరీ ఝోలేరో ఖడ్ ఖాలేనా
దూదియా తళావేరో పాణీ పిలేరే డోళీయా
డోళియవోరే తాతి ఛూటో ధ్వాళో ఖాడునే
మాతి ఛూటి మారే బాపూవోరీ మడేగి డోళియా
డోళీయావోరేసోనేరీ సాంకళీయేన తోడలేనా
రూపేరో ఖుంటా హోకడలేన ధాంసేజో డోళీయా
డోళీయావోరే తారే సింగేనా సింకడీ ఖలేనే
తారే తపాళేనే ఛాందీయా ఖ లరే డోళీయా
ఢోళీయావోరే తోనా మారో హుసేణే బావు
హంకే భారీ మారరోచ ఢోళీయా'

సందర్భం : బంజారాల జీవితంలో ఎద్దులు, ఆవులతో ప్రత్యేకమైన అనుబంధం ఏర్పడింది. కావున పెళ్ళి అయినతర్వాత అమ్మాయిని ఎద్దుపై ఎక్కించి హవేళి అనే కార్యం చేయిస్తారు. ఆ సందర్భంలో అమ్మాయి ఎద్దును ఉద్దేశించి తన బాధను వ్యక్తపర్చుకుంటూ పాట పాడుతుంది.

భావం : ఓ వృషభమా "ఝూమేరి" అనే పేరు గల దట్టమైన పచ్చిక బైళ్లల్లో గడ్డిమేసి, పాలలాంటి చెరువులోని నీల్లు తాగి హాయిగా ఉన్నావు. ఓ వృషభమా నీతోటి మా నాన్నా గారి తెల్లావుల మందలు దూరమవ్వదు కాని, నాకు మా నాన్నగారి ఇల్లు దూరమవుతుంది వృషభమా నీకు రోజు వెండితో చేసిన మేకుకు బంగారు తాడుతో కట్టేస్తారు. దానిని

నీవు తెంపుకొని ఎక్కడికైనా పారిపో గలవు. ఓ వృషభమా నీ కొమ్ములకు రంగు రంగులతో అలంకరిస్తారు నీకు అవన్నీ అందాన్ని ఇస్తాయి. నీ తలకు వెండి నగలు ధరింపచేస్తారు అవి నీకు అందాన్నిస్తాయి. ఆ విధంగా నిన్ను నన్ను మా నాన్న పెంచిపోషించి, నీన్ను తన దగ్గర ఉంచుకుని నన్ను అత్తవారింటికి పంపుతున్నాడు. అని అమ్మాయిని ఎద్దుపై ఎక్కించి హవేళి చేయించేటప్పుడు ఎద్దుగూర్చి తన గూర్చి పోల్చుకొని అమ్మాయి పాడే పాట అది.

36. ఛ్వారీన్ బళద్ చడావ జన్నార్ – ధావళో

(అమ్మాయిని ఎద్దుపై ఎక్కించేటప్పుడు ఏడ్చే పద్ధతి)

'మడేగీయే యా హీయా
తారేన మారో యాహీయా
తగాదా తూటేరీ వేళా యా హీయా
అవేన ఖవేగే మడగీ యా హీయా
మడేగీయే మారే కోచళెరే యా హీయా
క్వాళేన సాంసీ పణేనా యా హీయా
తోనే కొని సాంసీ మడగే యా హీయా'

సందర్భం : పెళ్ళి కూతురును ఎద్దుపై ఎక్కించి "హవేలి" చేసే కార్యం బంజారాలలో ఉన్నది. ఆ సందర్భంలో తన తండ్రి గారి కుటుంబం గూర్చి ఏడ్పు పాట ద్వారా తన బాధను వ్యక్త పరుస్తుంది.

భావం : మా తండ్రి గారి ఇల్లు పరిసర ప్రాంతాలు అన్ని ఈరోజు నుండి సర్వం నా నుండి దూరం అవుతున్నాయి. ఓ నా స్వతంత్ర సామ్రాజ్యమా నేను మా ఇంట్లో ప్రతి రోజు తినే కంచు పళ్ళానికి దూరమవుతున్నాను. నేను మా నాన్న గారి ఇంట్లో అల్లారుముద్దుగా ఉన్నాను. అటువంటి నా సర్వ స్వాతంత్ర్య హక్కులు గల మా నాన్న గారి ఇల్లు ఈ రోజు నుండి విడిపోతుందని అమ్మాయి, తన పుట్టింట్లో ఏవిధంగా పెరిగిందో తలచుకొని గత వైభవాన్ని గుర్తుంచుకొని దు:ఖిస్తుంది.

37. ఛ్వారీ మడేగిన్ సెరావజన్నార్ ధావళో

(అమ్మాయి, తన పుట్టింటిని తలుచుకొని ఏడ్చే పద్ధతి.)

"మడేగియే తారిమాయు "యా హీయా"
శాంతి శాంతియేన భారీ ఏలాకిదీ మడేగి "యా హీయా"
మడేగియే తారేమాయు "యా హీయా"
ఖాయేరి క్వాళేనే సాంసి పణేన "యా హీయా"
తోనే కొని సాంసీ మడేగి "యా హీయా"
మడేగియే తారొనే, మారో "యా హీయా"
తగాదో తుటేరీ ఏళా "యా హీయా"
ఆవేన ఖవేగీ మడగీ"యా హీయా"
మడేగీయే తారీ మాయు "యా హీయా"
పాంచీ ఆంకలీ డోబళుతూ "యా హీయా"
కుణీ లుంగు ధారే ఛూటి మడేగి "యా హీయా"

సందర్భం : అమ్మాయికి పెళ్ళి కార్యం మొత్తం పూర్తి అయిన తర్వాత మరుసటి రోజు ఉదయం పెళ్ళి వారిని సాగనంపుతారు. ఆ ముందు రోజు రాత్రి అంత దిగులుతో అమ్మాయి రాత్రిని తెల్లారకూడదని వేడుకుంటుంది. ఆ సందర్భములో పై విధంగా ఏడుస్తుంది.

అర్ధము : ఓ మా నాన్నగారి సామ్రాజ్యమా నేను మా ఇంట్లో ఎన్నో రకాల శాంతి పూజలు, వ్రతాలు చేశాను. నేను మా నాన్న గారింట్లో ఒక ముద్ద తినకుండా ఉపవాసం ఉండి ఇంటి చాకిరి చేశాను. అలాంటి మా పరిసరాలతో ఇప్పుడు విడిపోయే సమయం ఆసన్నమైనది. కావున ఓ సామ్రాజ్యమా పిడుగులాగ కాకుండా ఎల్లకాలం నిశ్చింతగా ఉండే విధంగా మా తండ్రిని కాపాడు. నేను మానాన్న గారింట్లో నా ఐదు వేళ్ళు మునిగే విధంగా, ఇష్టం వచ్చిన తిండిని భుజించానని, అమ్మాయి తన గత అనుభూతులను తలచుకొని ఏడుస్తుంది.

38. 'మదేగిరో – గీద్ (తన సపరివారలను తలుచుకొని పాడే పాట)

'మదేగియే, ఛూటతూ ఛూటమతే జాయసే
మారి బావువోరీ లాగీలాల్ మడగీ
మదేగియే తారీ మాయివో శాంతి శాంతియే నా
భారీ బారీ ఏలా కిది మడగీ
మదేగియే తారి మాయు తెలియేరో ఘణీ
కూ ఫరజు ఫరీ మడగీ
మదేగియే మారే భీయావునే గొకలీదీయేనే
మనేజ్ ధకలనే బళదువోరి ఖుంటా లంగాదీని మడగీ
మదేగీయే బాయవురీ బాయి కూ పూరకరజు
తారేనే మారీ వారదీ పూరీయేగి మడగీ
మదేగీయే తోన ఖేవే వాళో మారో బాపుయేనా
మన ఖేవే వాళో కొయిజ్ ఛేని మడగీ'

సందర్భం : పెళ్ళి అయిన అమ్మాయి అత్తవారింటికి వెళ్ళే ముందు తన పరిసరాలను తలచుకొని తన బాధను పాట రూపంలో వ్యక్తపరుస్తుంది.

భావం : ఓ నా తండ్రిగారి పరిసరమా నేను నీవు విడలేక విడిపోతున్నాం. నేను మా నాన్న గారి పరిసర ప్రాంతాలను ఎల్లపుడు చల్లగా ఉండాలని కోరుకున్నాను. ఏనాడు కూడ విడిపోవాలని అనుకొలేదు. కాని ఇప్పుడు విడిపోయే సమయం వచ్చింది. నేను మా నాన్న గారింట్లో మంచి అలవాట్లు, ఆహార పదార్థాలు అనుభవించాను. అలాంటి ఓ పరిసరమా మా అన్నదమ్ములను నీ దగ్గరనే ఉంచుకున్నావు, కాని నన్ను మాత్రం ఎడ్లను కట్టేసే పాకలను దాటించావు. ఓ పరిసర ప్రాంతమా ఒక జీతగాడు జీతం ఉండి తన గడువు కాలం అయిపోయిన తర్వాత యజమాని నుండి ఏ విధంగా విడిపోతాడో అలాగే మన మీమిద్దరం విడిపోతున్నాం. నీకు నాకు మధ్య దూరం పెరగపోతుంది. నీకు చూసుకునేవాడు మా తండ్రి గారు కాని నన్ను చూసుకునే వారు

ఎవరు అని తన పరిసర ప్రాంతాన్ని తలచుకొని, భాధను పాట రూపంలో వ్యక్తపరుస్తుంది.

39. "తాంగడి బార్ కాడ జన్నా ఛోజాయిన మళేరో - డావలో"

(పెళ్ళి కుమార్తె తన వదినలను పట్టుకొని ఏడ్చె పద్ధతి)

'భావేజే మ తమారి ఘరేమా "యా హీయా"
పూలే ఫళేరో జీవడా పగర్మా పడేగో భావజో "యా హీయా"
భావేజో పూలేడాసో పాళో పోసో సకీయ జీవడా
లబ్బరేర్ నైనవగో భావజో "యా హీయా"
భావేజో కూణ్సే ఫగరేమా ఘూలదినే భావజో "యా హీయా"
భావేజో మారే యాడి బాపువోరి ఏకలి "యా హీయా"
లాకే రపీయారీ జీవడా పగరేమా పడేగో భావజో "యా హీయా"

సందర్భం : పై పాటను పెళ్ళి కుమార్తెను అత్తింటి వారికి సాగనంపేటప్పుడు తన వదినలను పట్టుకొని, తన బాధను ఏడ్పు పాట రూపంలో వ్యక్తపరుస్తారు.

వివరణ : పెళ్ళైన కొత్త అమ్మాయి ఒకే సారి తన తల్లితండ్రులను, అన్నలను, అక్క చెల్లెళ్లను వదినెలను అందరిని వదలుకోలేక తన దు:ఖాన్ని ఏడ్పు పాట ద్వారా వ్యక్తపరుస్తారు.

భావం : ఓ వదినల్లారా నేను మన ఇంట్లో హాయిగా సుఖంగా పూల మొగ్గల వలె జీవించాను. ఇప్పుడేమో అత్తవారింటిలో కష్టాలు పడబోతున్నాను. ఓ వదినలారా పూలలాగాపెంచి పోసించినా నా జీవితం, రబ్బరులాగా వంచవలిసిన అవసరం వచ్చింది. మీరు నాకు కష్టాల్లో పడేస్తున్నారు. నేను మా అమ్మా నానుకు లక్షల రూపాయల విలువ గల ధన సంపద లాంటి దాన్ని, అటువంటి నా జీవితం కష్టాలు అనుభవించబోతుంది. అని అమ్మాయి గత, భవిష్యత్తు కాలాన్ని దృష్టిలో పెట్టుకొని ఏడుస్తుంది.

40. తాంగడీ ఆవ జన్నా 'ఛ్వారా, ఛ్వారీర్ భారేమా సాసుపర్ – గీద్'

(అబ్బాయి, అమ్మాయిని దృష్టిలో పెట్టుకొని అత్త మీద పాడే పాట)

గొట్టా సాళేరో ధాన ఘూలమేలీ
వుతో ఛ్వారీన్ గోటలిస కరమేలీ
సోనా మసూరిరీ ధాన ఘూలమేలీ
వుతో వేతడునా లాంబోలచ్ కరమేలీ

సందర్భం : బంజారాల వివాహ ఆచారంలో అబ్బాయి, అమ్మాయి వారి ఇంట్లో దాదాపు నెల నుండి మూడు నెలల వరకు ఉంటాడు. ఆ సమయంలో అత్త, అల్లుడికి మంచి వంటకాలు చేసి పెడుతుంది. ఎదుకంటే అమ్మాయికి ఏ లోటు రాకుండా చూసుకుంటాడని ఆ సమయంలో అమ్మాయి మీదా శ్రద్ధ తగ్గిస్తారు. అల్లుడిని తగు జాగ్రత్తగా చూసుకుంటారు. అప్పుడు అబ్బాయి మీద పై పాటను పాడుతారు.

భావం : అత్త తన అమ్మాయి (కూతురు) కొరకు గొట్టెవడ్ల బియ్యంతో అన్నం వండి, అమ్మాయికి పెడుతూ బక్కగా పొట్టిగా చేసింది. అబ్బాయి (అల్లుడు) కొరకు, సోనా మసూరీ బియ్యంతో అన్నం వడ్డించి అబ్బాయిని లావుగా, పొడుగ్గా అయ్యేటట్లు చేసిందని భావం.

41. తాంగడీలార్ అవజేన సేన ఖేళన్ ఖాండేర్ గీద్

(అమ్మాయిని సాగనంపటానికి పెళ్లికి వచ్చిన వారందరిని సరదాగా తిట్టే పాట)

(ఎ) 'తాంగ్డీలార్ ఆయియే సడాతీన్ జణీయ
కుత్రా తమారో ధణియ డస్సక్, డస్సక్ జణీయ
తాంగ్డీలార్ అయియే సడాచార్ జణీయ
ఉందర్ తమార్ ధణీయ డస్సక్, డస్సక్ జణీయ
తాంగ్డీలార్ ఆయియే సడా పాంచ్ జణీయ
గద్దా తయార్ ధణీయే డస్సక్, డస్సక్ జణీయ'

సందర్భం : పెళ్ళి అయిన తర్వాత నూతన వధూవరులను అమ్మాయి వారి ఇంటి నుండి అబ్బాయి వారి ఇంటికి తీసుకొస్తారు. ఆ సందర్భంలో

పెళ్ళికి వచ్చిన అమ్మాయి వారి బంధువులను, అబ్బాయి వారి బంధువులు సరదాగా పై పాటను తిట్టుకుంటూ స్త్రీలు పాడుతారు.

భావం : పెళ్ళి వెంట వచ్చినవారు, మూడున్నర మందిని కన్నారు. కుక్క మీ మొగుడమ్మా కుక్కలాగే ప్రసవించారు. పెళ్ళి వెంట వచ్చినవారు నాల్గున్నర మంది పిల్లలను కన్నారు. ఎలుక మీ మొగుడమ్మా ఎలుక లాంటి పిల్లలను కన్నారు. పెండ్లి వెంట వచ్చినవారు ఆయిదున్నర మందికి జన్మనిచ్చారు. గాడిద మీ మొగుడమ్మా, గాడిదలాంటి పిల్లలను కన్నారు. అని పెండ్లి వెంట వచ్చిన వారిని అనగా, అమ్మాయి వారి బందువులను, అబ్బాయివారి బందువులు తిట్టే హాస్యరూపంలో పాడే పాటది.

(బి) 'పైరా మార్చారీ భుకళీ మాటలామా
ఛణకో ఛణకోరే సమ్దణేరి ఫెటియామా
ఆబ్ జాయేదో లంబడీన ఖళీయామా
ఆబ్ ధుంకేదో లంబడీన ధుంకణాతీ
ఆబ్ ధోయేదో లంబడీన రుంకేళ్యామా'

సందర్భం : పెళ్ళికి వచ్చిన అమ్మాయి వారిని, అబ్బాయి వారు సరదాగా పాట రూపంలో తిట్టే ఆచారం బంజారాల వివాహవ్యవస్థలో కనబడుతుంది.

భావం : పైరా మిర్చకాయ కారము కుండలలో సిద్ధంగా ఉన్నది. ఆ కారం తీసి వియ్యపురాలు కళ్ళలో చల్లండి తర్వాత ఆమెను కాలువకు పోనివ్వండి. తర్వాత ఒక విసన కర్ర ఇవ్వండి. ఆమే కారం మంటను చల్లబర్చుకుంటుంది. తర్వాత ఆమెను వాగుకు పోనివ్వండి. అక్కడ శుభ్రంగా కారము కడుక్కుంటుంది. అని అమ్మాయిని సాగనంపుటకు అమ్మాయి వారు వచ్చినప్పుడు సరదాగా, అబ్బాయి వారు పాడే పాటది.

ముగింపు

5.1. గిరిజన విజ్ఞానం :

"భారత దేశానికి ఆర్యులు ఆసియా మధ్య బాగం నుండి రాక పూర్వం ద్రావిడులు వచ్చారని ఆ ద్రావిడులు రాక పూర్వం దేశంలో ఉన్న వారిని ఆదిమ నివాసులు అంటారని చరిత్రకారుల అభిప్రాయం. ఇలా మన దేశం ఆదిమ జాతుల్ని అధిక సంఖ్యలో కల్గిన దేశంగా పరిగణింపబడుతుంది. భారత దేశంలోని మొత్తం జనాభాలో దాదాపు 7% ఆదిమ జాతులు ఉన్నట్లు చెప్పబడుతుంది. భారత ప్రభుత్వం 1950 లో 571 ఆదిమ జాతుల్ని Scheduled Tribesగా పరిగణించింది.

ఆదిమ నివాసుల్ని Aboriginals అంటారు. వీరు చిన్న చిన్న ముఠాలుగా నివసిస్తారు. వీరు అనాగరికులు. వీరి ఆచార వ్యవహారాలు, సంప్రదాయాలు, పద్ధతులు అన్ని కూడా భిన్నంగా ఉంటాయి. ఆంగ్లంలో ఇలాంటి వారిని Tribes అంటారు. ఆంగ్లంలో కులం అంటే Casteఅని డా॥.అ యిప్పన్ హిందూ మతం అవలంబించే వారిని Caste అనే పేరుతోను తక్కిన వారిని Tribes అనే పేరుతో పిలిచారు. ఈ జాతుల పునరుద్ధరణ నిమిత్తం. ఆదిమ వాసుల సాంస్కృతిక నాగరికత దశలను బట్టి చేయబడ్డ వర్గీకరణాన్ని అనుసరించి వీరు మూడు వర్గాల వారుగా విబజింపబడ్డారు.

1. సాంస్కృతికంగా గ్రామీణ నాగరిక కుంటుంబాల వారితో ఎలాంటి పొత్తు లేని జాతులు.
2. నాగరికత ప్రభావానికి లోనై దాని వలన సంభవించిన సమస్యల్ని ఎదుర్కొంటున్న జాతులు.
3. గ్రామీణ నాగరిక జనులతో పొత్తు కల్గి ఉండి తత్ఫలితంగా ఏర్పడ్డ బాధల్ని, సమస్యల్ని, అధిగమించి నేటి గ్రామీణ నాగరిక సంస్కృతితో పొత్తు కలిసిన జాతులు.

మన సంస్కృతిలో మూడు రకాలైన దశలు కనపిస్తాయి 1) అరణ్య జీవన స్థితి 2) అనాగరిక స్థితి 3) నాగరిక స్థితి. వీటిలో జానపదులు అనాగరిక స్థితికి చెందిన వారు. అందులో వీరు అటు నాగరికులు కాదు ఇటు అటవికులు కాదు. వీరి మీదా ప్రకృతి ప్రబావం నాగరికుడి ప్రభావం కొట్టొచ్చినట్టు కన్పిస్తుంది. నాగరికుడ్ని అనుసరించటానికి, అనుకరించటానకి జానపదులు ప్రయత్నిస్తారు.

పై పేర్కొన్న సంస్కృతిలోనే మూడు దశలను 1) ఆదిమ వాసుల సంస్కృతి, 2) గ్రామీణ సంస్కృతి, 3) నగర సంస్కృతి అని చెప్పవచ్చు. మానవ సమూహాలు మౌలికంగా సమతల ప్రదేశాలలో నివసించిన, ఆ మానవ సమూహంలోని కొంత మంది, అరాచక ప్రవృత్తుల కారణంగా భయపడి పారిపోయినవారు కొండల్ని, గుట్టల్ని, లోయల్ని, తమ స్థావరాలుగా చేసుకున్నారు. మరి కొంత మంది చుట్టు ప్రక్కల ఉన్న గ్రామాలను ఆశ్రయించి స్థిరపడిపోయారు. క్రమంగా వీరు కూడా నగర వాతావరణానికి అలవాటుపడి నగరవాసులయ్యారు. ఇలా కొన్ని శతాబ్ధాలుగా కొండలు, గుట్టలు, లోయల్లో నివసిస్తూ గ్రామీణ నాగరిక సంస్కృతుల ప్రభావానికి లోనుకాక తమదైన ప్రత్యేక సంస్కృతిని నిలుపుకున్నవారే ఆదిమ వాసులు, గిరిజనులు.

అంగ్లంలోనే Tribes అనే పదానికి సమార్థకంగా మనం ఆదిమ జాతి, ఆదిమ నివాసి, ఆదివాసి, గిరిజన అనే పర్యాయ పదాలను వ్యవహరిస్తున్నాం. వీరి విజ్ఞాన్నాన్ని-అంగ్లంలో Tribal Lore అని అంటారు. మనం దీనకి సమానార్థకంగా "గిరిజన విజ్ఞానం" అంటున్నాం."[1]

"హైదరాబాదులోని ఆదిమ జాతులకు సంబంధించిన శిక్షణా సంస్థ, ఆదివాసి ససాంస్కృతిక పరిశోధన, మరియు శిక్షణాసంస్థ అనే పేరుతో ఉంది. ఇవి ఆదిమ జాతి, ఆదిమ నివాసులు, గిరిజనులు అనే పదాలకు సమానంగా "ఆదివాసి" అనే పదాన్ని స్వీకరిస్తే సమంజసమని భావించారు. వీరి విజ్ఞానాన్ని ఆదివాసి విజ్ఞానం (Tribal Lore) అంటే సరిపోతుంది.

గిరిజన శబ్దం కేవలం కొండలు గుట్టలలో నివసించే ప్రజలకు మాత్రమే పరిమితంగా కనిపిస్తుంది. కావున గిరిజన అనే పదం కంటే "ఆదివాసి" విజ్ఞానం అనే పదాన్ని స్వీకరించి, అధ్యయనం చేయడం సమంజసంగా ఉంటుంది.

సవరలు, గోండులు, చెంచులు, ఎరుకలు, ఎనాదులు, లంబాడీలు, మొదలైన ఆదిమవాసులు నాగరికత, విజ్ఞానం లేని పశుప్రాయులవలే మనకు కనబడుతున్నారు. కాని వారు మనకు కనబడినంత అనాగరికులు, అజ్ఞానులుకారు. ప్రాచీన కాలం నుండి శబరులు ఆర్యులకు చేరువగా ఉండి, ఆర్యుల విజ్ఞానాన్ని కొంత వరకు అన్ని విషయాలను గ్రహించినవారని చెప్పవచ్చు. ఉదహారణకు ఈనాడు జీవిస్తున్న సవరులలో ఆ విజ్ఞానం మనకు కనబడుతుంది"[2]

"గిరిజనుల జీవిత విశిష్టతలలో వారి సంప్రదాయం పద్ధతుల్ని ముఖ్యంగా చెప్పుకోవాలి. వాటిని పట్టుదలతోను భక్తితోను అవలంబిస్తారు. ఇది వారి పూజా పురస్కారాలలోను, మత కర్మ విషయాలలోను వ్యక్తమవుతుంది. ముఖ్యంగా సవరలు, గోండులు పూజించే దేవతల సంఖ్య 200లకు పైగా ఉండటం గమనించవచ్చు. వీరి మతంలో సూర్యుడు ముఖ్య దేవత సృష్టికర్త. "బింటు" అనే తెగ గిరిజనులలో సూర్యునికి మించిన సృష్టకర్త మరొకరు లేరని నమ్ముతారు వ్యాధులన్నీ దేవతలవల్లనే అందులోను క్షుద్ర దేవతల వల్లనే కల్గుతాయనే ప్రగాఢ విశ్వాసం వీరిలో ఉంది. అందువల్ల గిరిజనులు ఆ దేవతలను పూజిస్తూ జంతు బలిని కూడా ఇస్తుంటారు"[3]

"గిరిజనులు పండుగ పబ్బాలు సామూహికంగా అందరు కలిసి మెలసి ఉత్సవాలు జరుపుకుంటారు. వీరు విందులు వినోదాలలోను మద్యం సేవించటం, నాట్యం చేయడం, పాటలు పాడటంలోనూ వీరి సమిష్ట జీవనం కనిపిస్తుంది. ఆడవారు మగవారు కలిసి నాట్యం చేస్తారు. ఉదాహరణకు గొబ్బితట్టుతూ నాట్యం చేయడం సవరలు, చెంచులు, మొదలగు జాతులలో కనిపిస్తాయి. కంచు పళ్ళాలు, తప్పెట-డప్పులు మొదలగు వాటిని

ఉపయోగించి బంజారా స్త్రీ పురుషులు నాట్యం చేస్తారు. గిరిజనులలో నృత్యం ప్రధాన వ్యాయామ క్రీడగా భాసిస్తుంది. కొండ రెడ్ల నృత్యం చూడముచ్చటగా ఉంటుంది. వీరు అరకు లోయలోని థింస్సా నృత్యం, లంబాడీ నృత్యం మొదలైన మరికొన్ని గిరిజన నృత్యాలు కొండ రెడ్లలో కనిపిస్తాయి.

గిరిజనులలో ఇండ్ల నిర్మాణం విశిష్టంగా కనిపిస్తుంది. యానాదులు గుడిసెలను ఎదురుతోను, తాటి కమ్మలతోను కట్టుకుంటారు. మీదకి కొన దేలిన పెద్ద పిట్ట గూడులాగా గుడిసె కనిపిస్తుంది. లోపలికి వెళ్ళడానకి ఒకే ద్వారం ఉంటుంది. అదే విధంగా చెంచులు కొండ దరియల్లోను రెండు చెట్ల మధ్యలోను ఇండ్ల నిర్మాణం చేసుకుంటారు.

వైద్య విషయంలో బంజారాలు, సవరలు, ఎరుకలు, చెంచులు, కోయలు, పరిజ్ఞాన అనుభవం ఉన్నవారు. నాగరికులు కూడా వీరిచ్చేచెట్ల మందులను ఉపయోగిస్తారు. అలాగే వీరు మంత్రాలతో రోగాలను భూత, పిశాచ బాధలను తొలగించటానికి ప్రయత్నిస్తారు. వీరి సాహిత్యం ఏ సాహిత్యానికి తీసిపోదు. ప్రాచీన సంస్కృతి సారస్వతంలో చెప్పబడ్డ శబర వంశం వారే సవరులు అనే అభిప్రాయం ఉంది. ఈ శబరులు ఆర్యుల కంటే ద్రావిడుల కంటే ముందే మన దేశంలో ఉన్నట్లు తెలుస్తుంది"[4]

"ఆంధ్రప్రదేశ్‌లో 33 గిరిజన జాతులు ఉన్నాయి. 1971 జనాభా లెక్కల ప్రకారం వీరి జనాభా 16.57 లక్షలు అని చెప్పవచ్చు. ఈ జాతులు, వరసగా 1) ఆంధ్, 2) ఎరుకల, 3)కమ్మర 4) కొండదొర, 5) కొండరెడ్డి, 6) కోలాము, 7) కోయ, 8) కొందు, 9) కోటియా, 10) కులియా, 11) గదభ, 12) గోండు, 13) గౌడు, 14) చెంచు, 15) తోటి, 16) నాయకపోడు, 17) ప్రధాన్, 18) పొరజ, 19) భగత, 20) భీల్లు 21) మన్నెదొర, 22) మాలి (మహాలీ) 23) మూడదోర 24) యానాది, 25) రెడ్డి దొర, 26) వాల్మీకి, 27) సవర, 28) సుగాలి / లంబాడీ మొదలైన జాతులు ఆంధ్రప్రదేశ్ ఆదిమ జాతులు అనే గ్రంథంలో పేర్కొనబడ్డాయి. తక్కిన ఐదు జాతులు

1) కొండ కాపులు, 2) జాతపులు, 3) హిల్‌రెడ్లు, 4) రోణులు, 5) పోరిజలు మొదలైన వారు. తెలంగాణలో ఆంథ్, కొండరెడ్డి, కొలాం, కోయ, చెంచు, గోండులు, భిల్లులు, తోటి, ప్రధాన్, ఎరుకల, యానాది, బంజారాలు అనే 13 తెగల వారున్నారు.

పై తెగల్లో ఉప తెగలు కూడా ఉన్నాయి. తెలుగు మాతృ భాషలుగా ఉన్న తెగల్లో, భగత , చెంచు, కుమ్మ, కొండ దొర, కొండ కాపు, కొండ రెడ్డి, వాల్మీకి, మొదలైన తెగలు ముఖ్యమైనవి. గిరిజనులలో తిరుగుబోతు జాతులు, "లేదా" సంచార జాతులు (Nomadic Tribes) దిమ్మరులు. వీరికి (Vagrants) అని, దొంగ జాతులు విజ్ఞానం (Criminal Tribes), మొదలైన వాటిని గుర్తించడం జరిగింది"[5,6]

"ఈ సిద్ధాంత వ్యాసంలో నేను దాదాపుగా 28 తాండాల వరకు సర్వే చేసి బంజారాల వివాహ ఆచార సంప్రదాయాలను, సాంస్కృతిక పరంగా చర్చించడం జరిగింది. ఈ వ్యాసములో నాలుగు అధ్యాయాలుగా విభజించాను. మొదటి అధ్యాయంలో బంజారాల పుట్టు పూర్వోత్తరాలు చరిత్ర. ఇందులో జాతి మౌలికమైన మార్పునే కాకుండా సంస్కృతి చరిత్ర గురించి చర్చించడం జరిగింది. అందులో ప్రధానంగా పుట్టుక, గోత్రనామాలు, రాణాప్రతాపుని ఐతిహ్యం, జానపద, ఇతిహాసాల ఆధారంగా వీరి పుట్టకను గూర్చి చర్చించడం జరిగింది. చారిత్రకంగా బంజారాలు వలసపోవడం రాజస్థాన్‌లోని రాజపుత్ర వంశానకి చెంది వారమని చెప్పడం, దక్షిణ ప్రాంతానికి తరలి వచ్చినామని చెప్పడం కూడా జరిగింది. వీరిలో ముఖ్యంగా మూడు ప్రధానమైన వంశాలు అందులో 1) రాఠోడ్ వంశం, 2) చౌహాన్ వంశం, 3) పమార్ వంశము. వీటిని ఆధారంగా చేసుకొని బంజారా జాతులలో మిగిలిన ఉప తెగలు చెప్పడం జరిగింది. ఇవి తాండాల్లో మౌఖికంగా సేకరించడం కొన్ని అయితే, కొన్నింటిని అంతకు ముందే ఈ జాతిపై పరిశోధన చేసి సిద్ధాంత గ్రంథాలుగా ప్రచురించిన వాటిలో నుండి తీసుకోవడం జరిగింది.

రెండవ అధ్యాయంలో బంజారా సమాజం, సంస్కృతి అనే నేపథ్యంతో రాశాను. వీరు ఒకప్పుడు ఘన చరిత్ర కల్గిన వారైనా, కాలాను గుణంగా పేదవారు కావడం, దేశ ద్రిమ్మరులుగా మారటం, తమ జీవనాన్ని ఒక చోటు నుండి మరొక చోటికి మార్చుకోవడం, బ్రతుకు తెరువు కొరకు ఆయా ప్రాంతాలలో వాతావరణాన్ని అనుకూలంగా చేసుకొని జీవించడం మొదలైనవి ప్రముఖంగా చెప్పడం జరిగింది. అంతే కాకుండా బంజారాల కుల వ్యవస్థ వృత్తులు, వేరే జాతి వారిని వీరి సమాజాంలో కల్పుకోవడం (జాంగడ్), తాండా నాయకుని ప్రాధాన్యత, నాయక్‌తో పాటు అతని భార్య నాయకణ్ నాయకురాలు ప్రాధాన్యత, వారి న్యాయ నిర్ణయ పద్ధతులు, తాండా కుట్టుబాట్లను కూలంకషంగా చర్చించడం జరిగింది. పండుగలు, జాతరలు, బంజారాల వస్త్రాభరణాలు అందులో ఆడవారు, మగవారు ధరించేవి కూడా మౌఖికంగా సేకరించిన విషయాలు చర్చించడమైనది.

మూడవ అధ్యాయంలో బంజారాల జీవన స్థితితో మొదలుకొని వారి సంస్కృతి సంప్రదాయాలను వివాహ ఆచారాలను చెప్పడం జరిగింది. ఈ ఆచారం వల్ల వీరు ఇప్పుడు కనిపించే లంబాడీలు లేదా సుగాలీలు కారని ఒక్కప్పుడు వీరి వివాహం రాజలాంఛనాలతో సమానంగా జరగేవని భావించవచ్చు. ఎందుకంటే వీరు వివాహ సమయాల్లో "హాతి ఘోడ్ ఛేని బా ఓర్ బదల్ ఎ బళద్ దేరోచూ బా" (ఏనుగులు, గుఱ్ఱాలు లేవు కాని వాటి బదులుగా ఈ ఎద్దులను ఇస్తున్నాము తీసుకోండి నాయనా) అని పెళ్ళి కొడుకు వారు, పెళ్ళి కూతురుకు ఓలి రూపంలో ఎద్దులను ఇచ్చే సమయంలో చెబుతారు. దీనిని బట్టి పూర్వ కాలంలో వీరు ఏనుగులు, గుఱ్ఱాలు ఇచ్చిపుచ్చుకునే వారని తెలుస్తుంది. ఈ విషయాన్ని బట్టి బంజారాల వివాహ వ్యవస్థ ఎటువంటిదో స్పష్టంగా తెలుస్తుంది. అంతే కాకుండా వీరి వివాహ ఘట్టాలు ప్రతిది ఒక పండుగలాగ జరుగుతాయి. వీరు ముఖ్యంగా ఏడు రాత్రులు (సాత్ దాడేర్ నొక్తా) అందులో ముఖ్యమైనవి మూడు రోజులు తీన్‌దాడేర్ నొక్తాలు ప్రధానమైనవి అందులో (1) ఘోటార్ నొక్తా (పానకం తయారు చేసే కార్యం) 2) చూడోతీపేరో నొక్తా (రెట్ట గాజులు తొడిగించే

కార్యం) హిందూ సమాజంలో మంగళ సూత్రంతో సమానమైనది. మూడవది గొటేర్‌నొక్తా విందు కార్యం. ఈ విధంగా వీరి వివాహం జరుగుతుంది.

వివాహ సమయంలో బంధువులతో పాటు తాండాలోని ప్రజలందరు కూడా సామూహికంగా పాల్గొనడం విశేషం. ఇందులో ముఖ్యంగా నాయక్, అతని భార్య నాయకణ్ మరియు తాండాలోని వృద్ధ స్త్రీల పాత్ర ఎక్కువగా కనిపించడం జరుగుతుంది. వీరి వివాహంలో ప్రతి రోజు వట్టి కొబ్బరి బెల్లం పంచడం జరుగుతుంది. ఈ వస్తువులకు చాలా ప్రాధాన్యత ఈ సమాజం ఇస్తుంది. వివాహసమయములో వీరు ఆ రోజు జరిగే కార్యక్రమాల గురించి తాండా నాయకునితో అనుమతి తీసుకొని వాటి ప్రకారమే కార్యాలు చేసుకోవాలి. వీరి వివాహ సమయంలో పురోహితుడు లేకపోవడం మనకు కనిపించినా, మారుతున్న కాలాన్ని బట్టి ఇప్పుడిప్పుడే వీరు కూడా పురోహింతుల ద్వారా వివాహం జరుపుకుంటున్నారు.

బంజారా సమాజంలో వివాహ ఆచారాలు అక్కడక్కడ మార్పులు కనిపిస్తున్న "ఏడుపు" సంప్రదాయం మాత్రం ప్రతి కుటుంబాలలోను ఇప్పటికి మిగిలి ఉండడం గమనించదగ్గ విషయం. ఎంత చదువుకున్న వారైనా హిందూసంప్రదాయం ప్రకారం వివాహాలు జరిగిన, ఏడుపు పాటను మాత్రం ఇప్పటికి తాండా స్త్రీలు పెళ్ళి కూతురుకి నేర్పిస్తారు. ఆ పాటలో ఏడ్వడమే కాకుండా లయబద్ధంగా తాండా జీవన విధానాన్ని నాయకుడి పాత్రను తమ యిష్ట దైవాలను, తల్లి తండ్రి అన్నలు వదినలు యిష్టపూర్వకంగా పెంచుకున్న ఆవులు, ఎద్దులు, వాటిని పేరు పేరునా తలచుకుంటూ ఆ పాట ద్వారా ఏడుపును కొనసాగిస్తారు. ఈ విధంగా ఏడ్వడం చూసి అక్కడికి వచ్చిన కొత్త పాత జనుల హృదయం కరిగిపోతుంది. వారు కూడా పెళ్ళికూతుర్ని పట్టుకొని ఏడుస్తారు. ఇలా ఏడ్చే పాటను బంజారాలు "ఢావళేర్‌గిద్" అని అంటారు.

ఈ విధంగా ఇతర జానపద సమాజంలోనూ కనిపించని ఘట్టాలు గిరిజనులలో కనిపించడం విశేషమైనది. బంజారా సమాజంలో ప్రతి ఒక్కరికి

తాండా చాలా ముఖ్యమైనది. "నంగర్" అనగా తాండా అని అర్థం. వీటి తరువాతనే తల్లి తండ్రి. తమ ఇంటి బాగోగులు చూసుకోవాలి. ఎందుకంటే తాండా మొత్తం బాగుంటే ఆ ఇల్లు కూడా చల్లగా ఉంటుందని వారి నమ్మకము. తాండా నాయకుడు సత్ప్రవర్తన కలిగినవాడై ఉంటే ఆ సమాజం కూడా అలాగే మంచి ప్రవర్తన కలిగి ఉందని ఇతర తాండా ప్రజలు భావిస్తారు. వారు ఆ తాండా అబ్బాయిలకు వారి అమ్మాయిలను ఇచ్చిపుచ్చు కోవడానికి యిష్టపడుతారు. ఈ సమాజంలో పేద ధనిక అనే భేదం కంటే నాయకుడు మంచివాడా చెడ్డవాడా అనే సూత్రాన్ని ఎక్కువగా పాటిస్తారు. దీనిని బట్టి బంజారా సమాజం మరియు వారి ఆచార వ్యవహారం సమష్టి జీవనంగా కనిపిస్తుందనిని చెప్పవచ్చు.

నాల్గవ అధ్యాయంలో నేను సేకరించిన దాదాపు 100 గేయాల నుండి 40 గేయాల వరుకు సందర్భ భావంతో ఈ అధ్యాయంలో చెప్పడం జరిగింది. ఈ పాటల ద్వారా వారి జీవితం ఆచారం మొదలైనవి కళ్ళకు కట్టినట్లు కనబడుతుంది. ప్రతి పాట వెనుక ఊహించని రీతిలో కథ సంప్రదాయం కనబడుతుంది. ప్రతి కార్యానికి పాట/గేయం ఎత్తి పాడుపు ఒక రమణీయ దృశ్యంగా కనిపించడం ఒక కారణ మైతే, పాట ద్వారానే వరుసైన వారు పాట ద్వారా ఒకరి మీద ఒకరు శృంగార గేయాన్ని పాడుకోవడం మరొక విశేషం.

ఈ విధంగా బంజారాల జీవితంలో పాట అన్నది సర్వసాధారణంగా సాగే ఒక ప్రక్రియ అని చెప్పవచ్చు. పాట లేనిది వారి ఇంట్లో ఏ కార్యక్రమాలు జరగటానికి వీలు లేదు. పండుగలు, పబ్బాలు, జాతరలు, వివాహాలు మొదలైనవి ఏవి తీసుకుననప్పుటికి పాటే ప్రధానంగా కనిపిస్తుంది. వీటితో పాటు భక్తి గేయాలు ముఖ్యంగా సీతారామలక్ష్మణుల మీద తమ కుల దైవమైన శ్రీ వేంకటేశ్వరుని మీద, కుల గురువు అయినటువంటి సేవా మహారాజ్ మరియు హాతీరాం బాబాజీల మీద ఎన్నో పాటలు, వేడుక సమయాలలో పాడుకుంటారు. వీరు కష్టసుఖాల సమయాలలోను,

వ్యవసాయ పనులప్పుడు కూడా తమ శ్రమను మరచిపోవడానికి ఈ పాటలే ప్రధానమైనవి. ఈ విధంగా బంజారాల జీవితం పాట వెనుక ముడిపడి ఉందని చెప్పవచ్చును"[7,8,9.]

సూచికలు

1. జానపద విజ్ఞానాధ్యయనం. - మోహన్. జి. యస్. పుట - 1,2,3,4,5,13,14.
2. *Castes and Tribes of Southern India - Thurston Edger - Page -5,7,10,12.*
3. *A Tribe in Transition - Majumdar - D.N.- Page 17,20,22.*
4. *The Yanadis (Thesis) - Reddy. P.C. - Page 11, 14,18, 20.*
5. *Tribal Life in India - Nirmal kumar Bose - Page 15, 18.*
6. *The Religion of an Indian Tribe - Verrier. Elwin, - Page 8,12,16,18.*
7. కరీంనగర్ జిల్లా లంబాడీల ఆచార వ్యవహారాలు - శంకరయ్య జె.- పుట 47- 97 వరుకు
8. ఆంధ్రుల జానపద విజ్ఞానం - సుందరం. ఆర్వీ.ఎస్. - పుట - 238-239.
9. తెలుగు జానపద సాహిత్యము - స్త్రీల గేయములలో సంప్రదాయము - వసుంధరా రెడ్డి చింతపల్లి పుట. 56.

ఉప యుక్త గ్రంథ సూచి

1. ఖండోభా, పి.కె. లంబాణి ఒగటుగళు (కన్నడ), తేజ్ సింగ్ రాథోడ్ మెమోరియల్ ట్రస్ట్ గుల్బర్గా (1988)
2. జీవలా నాయక్, నూన్సావత్ బంజార, సుగాలి, లంబాడీలని పిలవబడే వారి వంశావళి చరిత్ర, బంజారా సేవా సంఘ ప్రచురణ, పిడుగురాళ్ళ, గుంటూరు. (1990).
3. ఖండోబా, పి.కె. తాండా సంస్కృతి (కన్నడ) రిజస్ట్రార్, గుల్బర్గా యూనివర్సిటి, గుల్బర్గా (1990).
4. కండోబా, పి.కె. కర్నాటక లంబాణి గుళ్ళు (కన్నడ), ఒందు సంస్కృతి అధ్యయన, తేజ్‌సింగ్ రాథోడ్, మెమోరియల్ ట్రస్ట్ గుల్బర్గా – (1991)
5. బ్రహ్మానంద, హెచ్.యస్.గోర్‌బోలి సంఖ్య, వచిగళ్ళు (కన్నడ) "డా.ఎ. చిదానంద మూర్తి, గౌరవ సంపుట, సంశోధనదల్లి ప్రకటిగొండ లేఖనద – మెలచ్చు" (1991)
6. చిదానందమూర్తి, ఎం.వాగర్థ (కన్నడ) భాషా విజ్ఞాన సంబంది సిద్ధి సంప్రబంధమాలి *Bappco 88* మైసూర్ రోడ్, బెంగుళూర్ – (1981).
7. సూర్యనారాయణ, ఎం.భారత దేశం, గిరిజన సముదాయాలు, తెలుగు అకాడమి హైదరాబాద్ (1983).
8. మోహన్, జి.యస్. జానపద విజ్ఞాన వ్యాసావళి, శ్రీనివాసా పబ్లికేషన్, మలయనూరు – 515786 (1981).
9. వెంకటరెడ్డి, కసిరెడి. తెలుగు పొడుపు కథలు, జాతీయ సాహిత్య పరిషత్, భాగ్యనగర్ శాఖ, ఆంధ్రప్రదేశ్ (1990)

10. రెడ్డి జి.ఎస్. తెలుగు పొడుపు కథలు, ఆచార్య జి.యస్.రెడ్డి షష్టిపూర్తి సన్మాన సంఘ ప్రచురణ 4, తిరుపతి (1988)

11. కృష్ణమాచార్య, ఎక్కిరాల. కళ్యాణ సంస్కృతి తిరుమల తిరుపతి దేవస్థానము-(1980)

12. పురుషోత్తము, జటావల్లభుల - వేదకాలపు స్త్రీలు ఆంధ్ర గీర్వాణి విద్యా పీఠము, వేద శాస్త్ర కళాశాల కోవ్వూరు (1933)

13. మల్లయ శాస్త్రీ బంకుపల్లె. వివాహతత్వము - టి.టి.డి. 1984.

14. సరస్వతీ దేవి ఇల్లందుల. కళ్యాయణ కల్పవల్లి, మురళి పవర్ ప్రెస్, హైదరాబాద్ (1966)

15. శ్రీ నాథ వెంకట సోమయాజులు నోరీ. మన వివాహ వ్యవస్థ, రామ పబ్లికేషన్స్ మద్రాసు, ప్రచురణ - 1999.

16. ధర్మారావు తాపి. పెళ్ళి దాని పుట్టు పూర్వోత్తరాలు, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్ - 1960.

17. బంజారా చరిత్ర సంస్కృతి - ప్రగతి- చీన్యా నాయక్. బి. శ్రీ లక్ష్మి ప్రాసెస్, బెంగుళూరు - 1988.

18. సుగాలి సంస్కృతి భాషాసాహిత్యాలు, డా॥గోనా నాయక్. యం. పద్మ శ్రీ గ్రాఫిక్స్, హైదరాబాద్, ప్రచురణ - 2002.

19. కరీంనగర్ జిల్లా లంబాడీల ఆచార వ్యవహారాలు, శంకరయ్య జనపాల, కర్షక ఆర్ట్ ప్రింటర్, హైదరాబాద్, ప్రచురణ - (1995)

20. బాలాజీదాసు రాథోడ్ భూక్యా, బంజారా వంశావళి చరిత్ర, హైదరాబాద్, పద్మా పవర్ ప్రెస్ - 1982

21. కృష్ణ కుమారి, నాయని. తెలుగు జానపద గేయ గాథలు, హైదరాబాద్, తెలుగు అకాడమి, 1990

22. ఇందుబాల. యం. వివాహము, కుటుంబ సంబంధాలు, హైదరాబాద్, తెలుగు అకాడమి - 1976.

23. చిన్న వెంకటేశ్వర్లు. భూక్యా, ఎ.పి. ట్రైబల్ లైఫ్, బంజారా సేవా సంఘ్ ప్రచురణ, గుంటూరు - 1992

24. సుందరం, ఆర్వియస్. ఆంధ్రుల జానపద విజ్ఞాన అధ్యయనము, శ్రీనివాస పబ్లికేషన్స్ చంద్ర లేఅవుట్, బెంగళూరు, 560 040.

2001 నాటికి నల్లగొండ జిల్లా, నూతనకల్ మండలంలోని
బంజారా తాండాల జనాభా వివరాలు

క్రమ సంఖ్య	తాండాల పేర్లు	గృహాలు	పురుషులు	స్త్రీలు	మొత్తం
1.	కాశిపిచ్చికుంట తాండా	20	42	31	73
2.	రాజానాయక్ తాండా	49	106	84	190
3.	చౌలా తాండా	60	121	121	242
4.	పాత్లావత్ తాండా	7	11	12	23
5.	తూర్పు తాండా	44	92	99	191
6.	పడమటి తాండా	41	50	50	100
7.	ఆమ్‌గోత్ తాండా	44	86	98	184
8.	గుట్టకాడి తాండా	44	86	88	174
9.	సేట్‌రాం తాండా	21	40	41	81
10	బద్య తాండా	33	80	73	153
11	బోటిక్రింది తాండా	30	67	61	128
12	సోమ్ల తాండా	19	47	44	91
13	రెగడి తాండా	28	62	73	135
14.	నాయకుని తాండా	40	98	97	195
15.	హెమ్లా తాండా	22	52	49	101
16.	మూడ్ తాండా	14	24	26	50
17.	బక్కహెమ్ల తాండా	56	124	122	246
18.	మాన్‌సింగ్ తాండా	31	81	67	148
19.	లక్య తాండా	16	40	33	73
20.	జాల్ తాండా	60	166	160	326

21.	పొట్ట కొక్య తాండ	14	29	28	57
22.	టిక్య తాండా	138	279	277	556
23.	అజ్మీర తాండా	50	195	104	223
24.	దిర్షన్‌పల్లి తాండా	41	195	160	355
25.	కొత్త తాండా	31	84	61	145
26.	భగ్య తాండా	48	34	37	71
27	గుగులోతు తాండా	98	241	195	436
	మొత్తం	1099	2456	2291	4747

సూచికలు

నల్లగొండ జిల్లా, నూతనకల్ మండలంలోని ఇరువై ఏడు (27) తాండాలను సందర్శించి. నేను స్వయంగా సేకరించిన మౌఖికంగా బంజారాల చరిత్ర, వివాహచారా గేయాలు క్రింది వారు అందించారు. వారి పేర్లు.

తాండాలు		వ్యవహర్తలు
1. కాశిపిచ్చికుంట తాండా	-	గుగులోతు రాములు –వ : 70సం.
2. కాశిపిచ్చికుంట తాండా	-	గుగులోతు సొమ్లి బాయి. వ : 60సం.
3. రాజా నాయక్ తాండా	-	బాణోతు మల్సురూ నాయక్. వ : 60సం.
4. రాజా నాయక్ తాండా	-	బాణోతు ద్వాలీబాయి. వ : 55సం.
5. చౌలా తాండా	-	జాటోతు భిక్య, వ : 60సం.
6. చౌలా తాండా	-	జాటోతు మారోణి, వ : 50సం.
7. ఆమ్‌గోత్ తాండా	-	ఆమ్ గోత్ లాలు, వ : 65సం.
8. ఆమ్‌గోత్ తాండా	-	ఆమ్ గోత్ భీకరి, వ : 60సం.
9. గుట్టకాడి తాండా	-	భుక్య బిచ్చ్య, వ : 70సం.
10. గుట్టకాడి తాండా	-	భుక్య మంగ్తి వ : 60సం
11. సేట్‌రాం తాండా	-	బాణోతు రాము వ : 55సం..
12. సేట్‌రాం తాండా	-	బాణోతు గంస్సి, వ : 50సం..
13. బద్య తాండా	-	నేనావత్ వేంక్యా, వ : 60సం..
14. బద్య తాండా	-	నేనావత్ గంస్సి, వ : 50సం..
15. బోటిక్రింది తాండా	-	పాతులోతు వస్రాం, వ : 50సం.

16. బోటిక్రింది తాండా - పాతులోతు పిపళీ, వ : 45సం..

17. సోమ్లా తాండా - గుగులోతు తేజ్యా వ : 70సం.

18. సోమ్లా తాండా - గుగులోతు కోమటి, వ : 60సం.

19. రేగడి తాండా - రమావత్ మంచా, వ : 50సం.

20. రేగడి తాండా - రమావత్ లక్ష్మి వ : 45సం.

21. నాయకుని తాండా - గుగులోతు రూప్ల వ : 60సం.

22. నాయకుని తాండా - గుగులోతు రాజి, వ : 50సం.

23. హెమ్లా తాండా - భుక్య కొక్య, వ : 55సం.

24. హెమ్లా తాండా - భుక్య భూరి, వ : 60 సం.

25. మూడ్ తాండా - మూడ్ భీమా, వ : 55 సం.

26. మూడ్ తాండా - మూడ్ ఘమ్మి, వ : 55 సం.

27. బక్క హెమ్లా తాండా - గుగులోతు వస్రాం, వ : 50 సం.

28. బక్క హెమ్లా తాండా - గుగులోతు కౌంసల్య, వ : 40 సం.

29. మాన్‌సింగ్ తాండా - భుక్యా కాశ్య, వ : 55 సం.

30. మాన్‌సింగ్ తాండా - భుక్యా కేళీ, వ : 50 సం.

31. లక్యా తాండా - గుగులోతు హరిలాల్, వ : 60 సం.

32. లక్యా తాండా - గుగులోతు బిక్కు, వ : 55 సం.

33. జాల్ తాండా - గుగులోతు హంజార్య వ : 70 సం.

34. జాల్ తాండా - గుగులోతు కాళి, వ : 60 సం.

35. పుట్టకోక్య తాండా - భుక్య రాంజి, వ : 55 సం.

36. పుట్టకోక్య తాండా - భుక్య రామ్లి, వ : 50 సం.

37. టిక్యా తాండా - లావుద్యా నర్సింహ నాయక్,వ :50 సం.

38. టిక్యా తాండా - లావుద్యా సొన్ని, వ : 50 సం.

39. అజ్మీర తాండా – లకావత్ సోమ్లా వ : 75 సం.
40. అజ్మీర తాండా – లకావత్ నాజ్జీ వ : 60 సం.
41. దిర్శన్ పల్లి తాండా – బదావత్ దస్రూ వ : 50 సం.
42. దిర్శన్ పల్లి తాండా – బదావత్ సుజాత, వ : 40 సం.
43. కొత్త తాండా – కేళోతు రాంజీ, వ : 50 సం.
44. కొత్త తాండా – కేళోతు భూరి, వ : 40 సం.
45. భగ్య తాండా – బాణోతు హుస్సేన్, వ : 50 సం.
46. భగ్య తాండా – బాణోతు నాగి, వ : 50 సం.
47. గుగులోతు తాండా – గుగులోతు పర్శ్యా, వ : 70 సం.
48. గుగులోతు తాండా – గుగులోతు పన్ని , వ : 60 సం.
49. పాత్లావత్ తాండా – పాతులోతు పంతుల్య, వ : 60 సం.
50. పాత్లావత్ తాండా – పాతులోతు మంగ్లీ, వ : 55 సం.
51. తూర్పు తాండా – అజ్మీర లక్ష్మ, వ : 50 సం.
52. తూర్పు తాండా – అజ్మీర ద్వాళి, వ : 45 సం.
53. పడమటి తాండా – లకావత్ లాల్‌సింగ్, వ : 55 సం.
54. పడమటి తాండా – లకావత్ బీబీ, వ : 50 సం.

ఆంధ్ర సారస్వత పరిషత్తు కొన్ని ప్రచురణలు

1. ఆంధ్ర మహాభారతోపన్యాసములు .... రూ. 100/-
2. తెలుగు వాగ్గేయకారులు – అన్నమయ్య విలక్షణ వ్యక్తిత్వం .... రూ. 70/-
3. తెనుగు సాహితి .... రూ. 36/-
4. స్త్రీల రామాయణపు పాటలు .... రూ. 36/-
5. సమీక్షణం .... రూ. 36/-
6. పరిణతవాణి – 1,2,3,4,5,6 సంపుటాలు (36,45,60,65,60,150) .... రూ. 370/-
7. ఆధునిక తెలుగు సాహిత్యంలో విభిన్న ధోరణులు .... రూ. 70/-
8. ఇరివెంటి వ్యాసాలు .... రూ. 30/-
9. శాలివాహన గాథా సప్తశతీసారము .... రూ. 15/-
10. రాయప్రోలు రచనలు – తత్వవివేచన .... రూ. 60/-
11. తెలుగు సాహిత్యోద్ధారకులు .... రూ. 40/-
12. మల్లికా గుచ్ఛము .... రూ. 8/-
13. మన జాతినిర్మాతలు .... రూ. 4/-
14. సుమతి, వేమన, కృష్ణ శతకాలు .... రూ. 24/-
15. ఆంధ్ర సారస్వత పరిషత్తు స్వర్ణోత్సవ సంచిక .... రూ. 50/-
16. ఆంధ్ర సారస్వత పరిషత్తు వజ్రోత్సవ సంచిక .... రూ. 250/-
17. తెలంగాణాలో జాతీయోద్యమాలు .... రూ. 10/-
18. సంస్కృత పాఠవల్లరి .... రూ. 4/-
19. నా సాహిత్యోపన్యాసములు .... రూ. 5/-
20. గౌతమబుద్ధుడు – జవహర్‌లాల్ నెహ్రూ .... రూ. 3-60
21. విమర్శకవతంసులు .... రూ. 45/-
22. మన దేశం – తెలుగుసీమ .... రూ. 7/-
23. మన నదులు – కృష్ణా గోదావరులు .... రూ. 3/-
24. మధురభక్తి – ముగ్ధభక్తి .... రూ. 80/-
25. ప్రాచీన కవిత .... రూ. 10/-
26. ప్రసంగ వ్యాసాలు .... రూ. 5/-
27. దశరూపక సారం .... రూ. 5/-
28. భారతీయ వాస్తు శిల్ప విజ్ఞానం .... రూ. 2/-
29. నా రేడియో ప్రసంగాలు .... రూ. 5/-
30. సాహిత్యానువాదం : సమాలోచనం .... రూ. 60/-
31. శివరాత్రి మాహాత్మ్యము .... రూ. 75/-
32. తెలుగు రచన .... రూ. 7/-
33. ఆంధ్ర వాఙ్మయ చరిత్ర .... రూ. 85/-
34. సాహిత్య సోపానములు .... రూ. 75/-
35. మన హాస్యము .... రూ. 100/-
36. తెలుగు భాషా సాహిత్య వైశిష్ట్యం .... రూ. 100/-
37. వ్యాస గుళుచ్ఛం (1, 2 భాగాలు) .... రూ. 130/-
38. తెలంగాణలో తెలుగు సాహిత్య వికాసం .... రూ. 150/-

